
దేశంలో అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక

04-1981



ఏప్రిల్ '81
రూ.3.50

పి.శ్రీనివాసశాస్త్రి ప్రొంగేటి,

సంస్థాపకులు
కీ॥శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి లీలావతి
రాఘవయ్య

ఏప్రిల్ 1981

సంపుటి 19 | విషయసూచిక | సంచిక 3

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం


పొంగేటి సంద్రాన...

రచన : పి. శ్రీనివాస శాస్త్రి

ముఖ చిత్రం : కమల్ హాసన్, చివరి అట్టమీద : జీనత్ అమన్

జ్యోతి, 1-8-4/1/1 చిక్కడపల్లి, హైదరాబాదు 500 020

సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో సహా) రు. 50



తొలిమాట

మండే ఎండలు!

మార్చికూడా రాలేదు, మండిపోతున్నాయి ఎండలు! మండే ఎండల్లో ఆవిరై పోతున్నారు మనుషులు! హైదరాబాదుని హైదరాబాధగా వర్ణించిన కవి చమత్కారం యీ విధంగా సార్థకమవుతోంది. ఐసు ధర మండిపోతోంది. గ్లాసు నీళ్ళ కోసం తప్పనిసరిగా (హోటల్లోనైతే) టీవో కాఫీ అయినా తాగవలసి వస్తోంది! కాగా, రాష్ట్రంలోని కరువు ప్రాంతాలలో, కావాలంటే కడివెడు కన్నీళ్ళయినా దొరుకుతున్నాయికానీ, గొంతు తడుపుకోడానికి గుక్కెడు మంచినీళ్ళు కూడా లభించడంలేదని వార్తలొస్తున్నాయి. ఈ ఘోరకలిని యెదుర్కొని నీటి ఎద్దడి సమస్యని పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి యిటీవల శాసన సభలో యిచ్చిన మాట నీటిమీది రాతలా కాక, శిలాక్షరమై చెల్లుతుందని ఆశిస్తున్నాము.

❊ ❊ ❊ ❊ ❊

జనవరిలో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడిన కొన్ని విదేశీ చిత్రాలమీద మా ప్రత్యేక ప్రతినిధి సమీక్షలు కొన్నింటిని సచిత్రంగా ఈ సంచిక సినిమా శీర్షికలో ప్రచురించాము. ఉత్తమ చలనచిత్రాభిమానులైన మా పాఠకులకు ఈ సంక్షిప్త సమీక్షలు ఆసక్తికరంగా ఉండగలవని భావిస్తున్నాము.

❊ ❊ ❊ ❊ ❊

జ్యోతి మే సంచిక వెలువడేనాటికి ఉగాది వచ్చి వెళ్ళే అవకాశం వుంది కనుక, మా పాఠకులకు, రచయితలకు, ఏజంటు మహాశయులకు, ప్రకటన కర్తలకు, ఇతర శ్రేయోభిలాషులకూ మా హృదయపూర్వకమైన ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

ఉత్తరాలు

బహుమతి కథల మీద మరొక అభిప్రాయం

సదానంద శారద వ్రాసిన "ఘురికి" కథ మనిషిలోని మంచిని, మానవత్వాన్ని కనీస స్థాయిలో కూడా తనలో మిగుల్చుకోకుండా, ఎదుటివాడి ప్రతి మాటలోను, ప్రతి చేష్టలోను స్వార్థ చింతనను ఊహించే సుబ్బారావులను గురించి వ్రాసినది. శిల్ప పద్ధతి నవ్యంగా తోచినా కథ ఎందుకో నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. కేఎస్వీ గారి "మనో మొరావియా" తనలోని మోసం చేసే మరో మనిషిని గురించి వ్రాసింది. కథలో ఏదో లోపించినట్లుగా ఉంది. ఇక శశికళ గారి "గోడమీది రాతలు"లో ఏదో చెప్పలేని తీయదనం, సన్నటి బాధ హృదయాన్ని పిండగలిగింది. మొదటి, ద్వితీయ కథలలో విషయం గొప్పది. కాని చిత్రణలో ఏదో లోపం ఉందనిపిస్తుంది. కాని "గోడమీది రాతలు" కథలో విషయం అత్యంత అల్పమైనది. కాని చిత్రణలో మృదుత్వం, తీయదనం ఉన్నాయి. కేవలం అంతవరకూ అద్దెకు ఉన్న ఇంటిని వదలిపోయేటప్పుడు చెలరేగిన గత స్మృతుల చిత్రణ ఈ కథ. ఇది రచయిత్రి సున్నిత హృదయాన్ని, చైల్డ్ సైకాలజీ మీది స్టడీని ప్రతిబింబింపజేస్తుంది.


"పిల్లలు కాస్త పెద్దవాళ్ళయ్యారు. ఇప్పుడు ఇంక గోడలమీద రాస్తారో, నాన్న కొడతాడని రాయరో" అన్న ఈ మాటలు ఎందుకో కన్నులు చెమ్మగిల జేస్తాయి. మంచి కథను చదివామన్న స్ఫూర్తిని ఈ కథ కలిగిస్తుంది.

ఎమ్. దేవీ నాగమోహనరావు
పెద్దాపురం

ఆరంభమే అద్భుతం!

మీరు "జ్యోతి"లో సీరియల్‌గా ప్రచురిస్తున్న "మీరా" సీరియల్ ఎంతో ఆసక్తిదాయకంగా ఏమవుతుందా అన్న ఆత్రుతతో మనసు పరవళ్ళు త్రొక్కించేస్తూ పరుగులు తీస్తున్నది. కాని బహు కొద్దిగా వేసి ఎంతో నిరాశ చెందేలా చేస్తున్నారు. క్రొత్త సీరియల్ ఆరెకపూడి కౌసల్యాదేవిగారి "సౌభాగ్యలత" ఎంతో తృప్తిగా, మనసుకు ఎంతో హాయిగా వున్నది. మొదటిలోనే మా మనసును ఆకట్టుకునేలా వ్రాసిన రచయిత్రి కౌసల్యాదేవిగారికి నా యొక్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఎమ్. లలితాప్రసాదు
సికింద్రాబాదు



ఇటీవల మద్రాసు నడిగర్ సంఘం హాలులో ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' వైభవోపేతంగా నిర్వహించిన 'తెలుగు నాటక శత జయంతి' ఉత్సవాల్లో 'తెర ముందు కృష్ణుడు' శ్రీ పీసపాటిని 'తెరమీద కృష్ణుడు' డా॥ ఎన్. టి. రామారావు 'కళాసాగర్' తరపున సత్కరిస్తున్న దృశ్యం. సుప్రసిద్ధ తమిళ రంగస్థల నటుడు శ్రీ ఆర్. ఎస్. మనోహర్ ఈ ఉత్సవాలకు అధ్యక్షత వహించారు. డా॥ సి. నారాయణరెడ్డి, శ్రీ గుమ్మడి ప్రసంగించారు.


సశేషం!

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతినందుకున్న కథ "సశేషం," (మార్చి '81) బాగుంది. రచయిత్రి జె. సుబ్బలక్ష్మిగారు అవిటి పిల్లవాడి మనోభావాలు, అటువంటి బిడ్డను కన్న తండ్రి వేదన, అతని మనోభావాలు చాలా చక్కగా వ్రాశారు. ఆ కథ చదువుతున్నంతసేపు మనస్సంతా బాధతో నిండిపోయింది. ఎంతో కాలంగా జ్యోతిని చదువుతున్నప్పటికి అందులో చాలా మంచి కథలుగాని, నవలలుగాని, సీరియల్స్‌గాని చదివినప్పటికి కూడ ఇంతవరకు ఎప్పుడు ఉత్తరం వ్రాయలేదు. కాని ఈ కథ చదివిన తరువాత ఎందుకో ఉత్తరం వ్రాయాలనిపించింది.



లయన్స్ క్లబ్ గుంటూరు నార్త్ కార్యదర్శి, ఉన్నవ శతజయంత్యుత్సవ సమితి కోశాధికారి శ్రీ జి. ఎస్. మూర్తి నాగార్జున విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య భావరాజు సర్వేశ్వరరావుగారికి 10 వేల రూపాయల చెక్కును బహూకరిస్తున్న చిత్రం.

బెంగుళూరులోని 'అభిరుచి' ఏర్పాటు చేసిన సభలో శ్రీ కాశీపట్నం రామారావు (మధ్య) పాల్గొన్నారు. శ్రీ వి. రామనరసింహారెడ్డి (ఎడమ) శ్రీ ఘట్టమరాజు (కుడి)లను కూడా చిత్రంలో చూడవచ్చు. శ్రీ కవనశర్మ శ్రీ కాశీపట్నం గారిని పరిచయంచేస్తున్నారు.





ఇటీవల జరిగిన ఒక వంశీ సభలో, ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన శ్రీ ఆవుల సాంబశివరావును, వారి సతీమణినీ అభినందిస్తున్న సుప్రసిద్ధ తార జమున. వంశీ రామరాజు కూడా చిత్రంలో వున్నారు.

ఇటువంటి మంచి కథను వ్రాసిన జె. సుబ్బలక్ష్మిగారు అభినందనీయులు.

ఇటువంటి మంచి కథలను అందిస్తున్న మీకు నా థేంక్స్.


వి. లక్ష్మీసుందరి
విజయవాడ

"జ్యోతి" మార్చి '81 సంచికలో ప్రచురించిన ప్రత్యేక బహుమతి పొందిన కథ "సశేషం" బాగుంది. "దొరకని దొంగ" (మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి కథ) ఈ రోజుల్లో కట్నం యిచ్చి పుచ్చుకునే వాళ్ళకి ఒక మంచి సందేశం. మార్చినెల నవలానుబంధం "డాక్టర్ చైతన్య" అంత బాగుండలేదు. ముఖచిత్రం చాలా ముచ్చటగా వుంది.

గోపీ ప్రమోద్ శా
హైదరాబాదు.


మార్చి '81 సంచికలో ప్రచురించిన మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి "దొరకని దొంగ" కథ బాగుంది. కట్నం ఇవ్వలేని వాళ్ళ దరికి ఇదో ఎడ్వయిస్ ఇస్తుంది. ప్రచురించిన మీకూ, రచయితకూ ధన్యవాదాలు.

ఎ. ఆర్. శకుంతల
విశాఖపట్టణం



ఇటీవల సికిందరాబాదు సాంస్కృతిక సంస్థ. బాలాజీ ఆర్ట్ థియేటర్స్ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆ సందర్భంగా జరిగిన సభలో చలనచిత్ర నటుడు శ్రీ మురళీమోహన్ ప్రసంగిస్తున్నారు. శ్రీ పి. ఎల్. నారాయణ, శ్రీ కట్టా సుబ్బారావు కూడా చిత్రంలో వున్నారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులైన శ్రీ ఆవుల సాంబశివరావు సన్మాన సభలో స్వాగతోపన్యాసం యిస్తున్న డా॥ సుంకు బలరాం (అధ్యక్షులు భావన ఆర్టు థియేటర్స్) ఆశీనులైన వారు : డా॥ దాశరథి (ఆస్థాన కవి), ప్రొ॥ జాఫర్ నిజాం (ఉపాధ్యక్షులు, కాకతీయ విశ్వవిద్యాలయం) సన్మానితులు శ్రీ ఆవుల సాంబశివరావు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, శ్రీ ఎం. వి. నారాయణరావు, శ్రీ జి. రామిరెడ్డి (ఉపాధ్యక్షులు ఉస్మానియా విశ్వవిద్యాలయం)





ఆకుపచ్చ లాగు

ఆంగ్ల మూలం : పి. సి. నెట్టో   అనువాదం : 'అభిమన్యు'

ఆవు పేడతో అలికిన నేల మీద పడుకుని వుంది పార్వతి. గుడిసెకు పైకప్పుగా పరిచిన సీనారేకుల సందుల్లోనుంచి ప్రసరిస్తున్న ఉషః కిరణాలు చిగురుటాకుల్లా వున్న పార్వతి [illegible] రెప్పల్ని వెచ్చగా తాకాయి. నెమ్మదిగా కళ్ళు తెరిచింది పార్వతి! నిద్ర[illegible] వదల్లేదింకా! చిన్ని నోరు తెరిచి [illegible]

కంగా ఆవులిస్తూ పక్కకు పత్తిగిల్లింది. గుడిశె గోడ పైభాగాన ప్రాకుతున్న ఎలుకొకటి పార్వతి దృష్టికి సోకింది!

మరి కాసేపటికి వీధిలోని కొళాయి చప్పుడు విన్నది పార్వతి! అక్కడ గుమిగూడిన మురికి వాడ వాసులు నీళ్ళ కోసం హోరాహోరి పోరాడుకున్నారు. ఇద్దరు గృహిణులయితే నోటి కొచ్చినట్టు తిట్టుకుంటున్నారు. చేతులూ కలిసాయి!

మునగచెట్టు మీది పిచ్చుకల కిచకిచలు పార్వతికి స్పష్టంగా వినబడుతున్నాయి: పార్వతి తల్లి దుర్గ అదుర్దాగా లేపింది కూతుర్ని!

"లేమ్మా-లే! పంపు కట్టేసే లోపుగా నీళ్ళు తెచ్చి నింపు తల్లీ, నా కెందుకో అలసటగా వుంది. కాసేపు పడుకుంటాను. నువ్వు లేమ్మా."

"లేస్తానే. నీళ్ళు నింపి. ఇంటి ముందు వూడ్చి, కళాపి కూడా చల్లుతాను." అంది పార్వతి ఉత్సాహంగా లేస్తూ.

పార్సెల్ పెట్టెల చెక్కలతో తయారు చేసిన ఓటి తలుపు తెరుచుకుని బయటికి నడిచింది పార్వతి.

చలిగాలి పార్వతి చెంపలను కోసుకుంటూ వీస్తోంది! చిరిగిన స్కర్ట్, దారాలు సాగుతున్న బ్లౌజ్ చలి బారి నుండి పార్వతిని రక్షించలేక పోతున్నాయి! ఒక్కసారి గజగజ వణికి పోయింది! గుడిశె వెనక వున్న మురికి కాలవ దాటుతుంటే ముసురు పట్టినట్లున్న దోమలు పార్వతి ముఖాన్ని తెరలా కప్పేశాయి! ఒక పక్కన పందులు పోరాడుతూ, సరసమాడుకుంటున్నాయి. దిబ్బల మీద గుమికూడిన కోళ్ళు పేడ కెళ్ళగించి పోస్తున్నాయి. పాల వ్యాన్, సీసాల గలగల శబ్దంతో మేలుకొలుపు పాడుతోంది, ఉదయాన్ని సూచిస్తూ!

కొళాయి దగ్గర చిలుం పట్టిన సత్తు డబ్బాతో నీళ్లు తీసుకుని ముఖం కడుక్కుంది పార్వతి. తర్వాత కుండని పుకుంది! కుండ చాల బరువుగాను, నిండుగాను వుండటం చేత నెత్తి నెట్టుకు నడిచి పోతుంటే నీళ్ళు తొణికి పార్వతి బట్టలు బాగా తడిసి పోయాయి!


దుర్గ బయటి కొచ్చి కాళ్లూ, ముఖం కడుక్కుంది. వెంటనే పార్వతిని వెంట బెట్టుకుని టీ స్టాల్‌కు బయల్దేరింది.

అక్కడ తినుబండారాల మీద మూగుతున్న ఈగలు, గోడల మీద ప్రాకుతున్న బల్లులు కాకా హోటల్ స్థాయిని సార్థక పరుస్తున్నాయి!

దుర్గ, పార్వతి చెరో బన్ తిని టీ త్రాగారు. కాని పార్వతి గొంతులో నుంచి ఎండి పోయిన రొట్టె ముక్కలు సుఖంగా జారకపోగా, రాచుకు పోయి నానా బాధ పెట్టాయి! వేడి టీ మాత్రం కొంత వెచ్చదనం కలిగించి వణికి పోతున్న వంటికి ఉపశమనం చేకూర్చింది!

మరి కాసేపటికి బక్కెటు, చీపురూ తీసుకుని తన పనిమీద వెళ్ళి పోయింది దుర్గ!

దుర్గ భర్త త్రాగుబోతు. పార్వతి పసి బిడ్డగా వుండగానే దుర్గ వంటరిదై పోయింది!



ఆకాశంలో ఏనుగు మెడలో
వెండి గంటలా వేలాడే చంద్రుడు


— దేవిప్రియ

పగలంతా మునగ చెట్టు నీడలో స్వప్న జగత్తును సృష్టించుకుంటూ వుంటుంది చిన్న పార్వతి! దిన చర్యలో అదీ ఒక భాగమే!

దుర్గ పని మీద వెళ్ళి పోగానే, మునగచెట్టు ఎక్కి అందిన మునక్కాడలు కోసింది పార్వతి! రాత్రిళ్లు మునక్కాడల పులుసుతో తృప్తి పడటం ఆ తల్లీ, కూతుళ్ళకు అనివార్యమైన అలవాటు!

మునక్కాడలు కోస్తున్న పార్వతి చూపులు అకస్మాత్తుగా రోడ్డు కవతల వేపు నేత్రానంద కరంగా వున్న అందమైన ఇళ్ళ వేపు పయనించాయి! ఆ ఇళ్ళలోని పిల్లల ఆనందోత్సాహాల సంగీతం, నవ్వుల కోలాహలం గాలిలో

కవితకి కార్టూన్ :



పరణించిన అవ్వ నగలు
మన కాలేజీ అమ్మాయి
ఎంతపోరినా పెట్టుకోదు:

— తిలక్

తెలివస్తూ పార్వతికి వినిపిస్తున్నాయి. క్షణంలో పార్వతి కళ్లు తన చిన్న శరీరానికి అతుక్కుని చిరిగి, మాసి

కవితకి కార్టూన్ :



నవీన విశ్వవిద్యాలయాల్లో
పురాణ కవిత్వంలాగ!

— శ్రీ శ్రీ

పోయిన స్కర్ట్ మీదికి వాలి పోయాయి. గొంతు నొప్పిగానూ, వొళ్ళంతా వేడిగానూ అనిపించింది పార్వతికి. రేపే సంక్రాంతి పండగనీ, వేసుకోవటానికి తనకు కొత్త బట్టలు లేవన్న సంగతీ గుర్తు కొచ్చింది!

దుర్గ సాయంత్రం ఇంటికి తిరిగొచ్చే సరికి పార్వతి బయట ఆడుకుంటూ కనిపించలేదు. లోపలికి వెళ్ళాక నేలకు అంటుకుపోయి పడుకుని వున్న బిడ్డను చూసింది. పార్వతి వళ్లు సలసల కాగి పోతోంది! ఊపిరి తీసుకోవటానికి కూడ ఎంతో కష్ట పడుతోంది! విపరీతమైన గొంతు నొప్పి!

'ఏమైందమ్మా' అనడిగింది దుర్గ ఆరాటంగా.

"నువ్వేం కంగారు పడకమ్మా. రేపటి కల్లా తగ్గిపోతుంది. సరేగానమ్మా, రేపే కదూ సంక్రాంతి పండగ! ఆ చాకలాళ్ళ అమ్మాయి ఎంచక్కా కొత్త బట్టలు వేసుకుంటుందో: నాకు లేవుగా అమ్మా."

"నా దగ్గర డబ్బుల్లేవమ్మా! ఏం చేయను చెప్పు?"

"రోడ్డు కవతల ఇళ్ళలో వుంటుందే, తెల్లగా, ఎత్తుగా-ఆమె ఇంటికి వెళ్ళి వాళ్ళ పాప పాత బట్టలు అడిగి తీసుకురామ్మా. ఆ పాప కూడా సరిగ్గా నా అంతే వుంటుంది. ఆ పాప బట్టలు నాకు బాగా సరిపోతాయి. నేనూ నీతో వచ్చేదాన్నే. నా కాళ్లు వణికి పోతున్నాయే. నడవలేను."

"మా తల్లికదే! ముందు నీకు మందులు కొనుక్కుని రావాలమ్మా. మందులకే డబ్బులేదు. రేపు ధర్మాసుపత్రికి తీసుకెళతాలే!"

పగలంతా వీధులన్నీ వూడ్చి అలసిపోయిన దుర్గ ఓపిక తెచ్చుకుని ఎదురుగా వున్న ఇళ్ళవైపు నడకసాగించింది. కొద్ది సేపట్లోనే అనుకున్న ఇంటి తలుపు తట్టింది దుర్గ. ఆ ఇల్లాలు వచ్చే స్వల్ప వ్యవధిలోనే ఆ ఇంటి వంటింటి నుంచి ప్రసారమవుతున్న రకరకాల ఘుమ ఘుమలు దుర్గ నాసికా పుటాల్ని రెచ్చగొట్టాయి! అకస్మాత్తుగా దుర్గ కళ్ళల్లో నీళ్లు పేరుకుని, ఆకలి కరకరలాడింది!


ఇంతలో తలుపు తెరిచింది ఇల్లాలు! తన వ్యధను దాచుకోవటానికి దుర్గ గబగబ చీర కొంగుతో ముఖం తుడుచుకుంది!

"ఏం కావాలి?" అనడిగిందా ఇల్లాలు సాత్వికంగానే.

"ఏం లేదమ్మగారూ. నేను చాలా పేదదాన్ని. ఆ మురికి వాడలో వుంటూ వీధుల[illegible] బ్రతుకుతుంటాను. మీ పాప యి[illegible] బిడ్డ నాకూ వుందమ్మా. రేపు సంక్రాంతి పండగ కదమ్మా — నా బిడ్డకు కొత్త బట్టల్లేవు. నా దగ్గర కొనటానికి డబ్బులేదు. మీ పాప బట్టల్లో పాతదో జత వుంటే దయ చేయండమ్మా. నా బిడ్డ పొంగి పోతుంది. మహా ఆనందపడి పోతుందమ్మగారూ"

దుర్గ చెప్పిందంతా విని ఆ ఇల్లాలు విచారంగా ముఖం పెట్టి లోపలికి వెళ్ళింది. కొద్ది సేపటికి ఓ బ్లౌజ్, ఆకుపచ్చ రంగు బెల్ బాటమ్ పాంటొకటి

కవితకి కార్టూన్ :




గార్డెన్ రెస్టారెంట్ చల్లగాలిని
రుచి మరిగిన వాణ్ణి నేను.

— దేవిప్రియ

తీసుకొచ్చి యిచ్చింది దుర్గకు. ఆ తల్లి ఆనందానికి అంతు లేదు. కళ్ళతోనే


కవితకి కార్టూన్ :



విలాస వతుల క్రీగంటి చూపునుండి
విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తారు

— తిలక్

కవితకి కార్టూన్ :



భూమి తనచుట్టూ తాను తిరుగుతూ
ధనవంతుడి చుట్టూ తిరుగుతుంది
— తిలక్

కృతజ్ఞత తెలియజేసి, ఒక్క పరుగున గుడిశె దగ్గర వాలి, పార్వతి చేతుల్లో పెట్టింది దుస్తులు.

ఆకుపచ్చని బెల్‌బాటమ్ ప్యాంట్ చూసేసరికి పార్వతి కళ్ళల్లో కోటి దీపాలు వెలిగాయి!

'అమ్మా, రేపు తలంటి పోసుకుని యీ బట్టలు వేసుకుంటాను' అంది సంక్రాంతి సంబరమంతా తానొక్కతే అనుభవించబోతున్న అనుభూతితో.

దుర్గ మనసు తేలిక పడింది! మెల్లగా వంట ప్రయత్నంలోకి దిగింది! అన్నం ఉడకగానే పార్వతి కోసం మట్టి పాత్రలో పెట్టింది. కాని పార్వతి చూపులు, పలవరింతలు గమనించిన దుర్గకు కాళ్ళాడలేదు. వారం క్రితం తమ మురికివాడలో వ్యాపించిన డిఫ్తీరియా వ్యాధి గుర్తొచ్చి ఆమె గుండె ఒక క్షణం లయ తప్పినట్లయింది! ఆ రాత్రంతా దుర్గ కంటి మీద కునుకు లేదు.

పార్వతి తెల్లవార్లూ పలవరిస్తూనే వుంది. మునగచెట్టు మీద పారాడే ఆకు పచ్చని గొంగళి పురుగులు, సీతాకోక చిలకల్లా ఎలా వెండిలా మెరుస్తూ రంగు మార్చుకునేదీ పార్వతి పలవరింతల్లో అదో ఘోషగా వినిపిస్తూనే వుంది.

ఉదయం కోసం నిరీక్షిస్తూ నిద్రకు దూరమైంది దుర్గ అసహనంగా - ఆరాటంగా.

భారంగా తెల్లవారింది.

మునగచెట్టు మీద పిచ్చుకల కిచకిచలు ప్రారంభమయ్యాయి! గుమ్మాల ముందు రంగ వల్లులు తీర్చి దిద్దటంలో నిమగ్నమయ్యారు వాడలోని స్త్రీలూ, ఆడపిల్లలూ - సంక్రాంతి తెచ్చిన ఉత్సాహం అక్కడి పేద ప్రజల్లో కెరటాల్లా ఉప్పొంగుతోంది.

అంతలో దుర్గ తలుపు తీసుకుని బయటికి పరుగెత్తుకుంటూ వచ్చింది- గుండెలు బాదుకుంటూ-పంచ భూతాల్ని కంపింపజేస్తూ! అక్కడి వాతావరణం క్షణంలో ఓ విషాద గీతంలా మారిపోయింది.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు చెరగని చిరునవ్వుతో, చెదరని రెండు జడలతో ఆకుపచ్చ బెల్‌బాటం ప్యాంట్‌ను తోడు చేసుకుని మహా ప్రస్థానం సాగించింది-పన్నెండేళ్ళ పేద బాలిక పార్వతి — మృత్యువునే జీవితంగా మలుచుకుని.

*

సీరియల్

సౌభాగ్యలత

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవీ రామశాస్త్రి

(గత సంచిక తరువాయి)

5

"పది రోజులుగా చూస్తున్నాను—నా మాటకు ఏమైనా అనుకూలంగా సమాధానం చెప్తావేమోనని, అసలా విషయమే మరచావా ఏం?"

డైనింగ్ టేబుల్ వద్ద విశ్వేశ్వరి కుమార్తె శశిరేఖను ఉద్దేశించి అన్నది. రఘురామయ్యా, వకుళా కూడా అక్కడే వున్నారు.

"మాట్లాడవేమిటి శశీ?" రెట్టించింది విశ్వేశ్వరి.

పసి పిల్లలా స్పూన్స్‌తో ఆడుకొంటున్న శశిరేఖ విసుగ్గా చూసింది.

"ఏమిటమ్మా?"

"అదే. వి[illegible]విషయం. ఏ నిర్ణయానికి వచ్చావని?"

శశిరేఖ [illegible]భరంగా మారిపోయింది.

"చెప్పాను కదమ్మా. అదే నా నిర్ణయం!" స్థిరంగా అన్నది.

ఆ సమాధానం వేడిని తట్టుకోలేనట్టు రఘురామయ్య భోజనం ఆపి వెనక్కు జార్లబడిపోయాడు.

"ఇంత పెంకె దానివనీ, తెలివి తక్కువ దానివనీ ఎప్పుడూ అనుకోలేదు. మధ్యాహ్నం శ్రీమంత్ నీ కోసం రెండు సార్లు వచ్చాడు. అసలు నువ్వతడికి కన్పించనేలేదట ఊరి నుండి వచ్చాక?"

తల్లి మాటలు శశిరేఖకు కోపం తెప్పించాయి.

"నేను లేనపుడు అతడు రావడం నా నేరం కాదు. అయినా ఏమిటి అతగాడిని అంత కలుసుకోవలసిన అవసరం నాకు?. తీవ్రంగా అడిగింది".

రఘురామయ్య సాలోచనగా చూస్తూ అడిగాడు : "శశీ, నువ్వూ శ్రీమంత్ ఏమైనా పోట్లాడుకున్నారా? అటువంటి దేమైనా వుంటే నాకు చెప్పవమ్మ కదమ్మా?"

"లేదు నాన్నగారూ."

"మరి? ఎప్పుడూ అతడితో స్నేహంగా వుండేదానివి. ఈసారి నీవువచ్చి పదకొండు రోజులైనా అతడితో మాట్లాడకపోవడమేమిటి? ప్రక్కయిల్లేకదా?"

"అదే నేనూ అడిగితే? ప్రక్కయిల్లేకదా? ఊరినుండి వచ్చానని ఒక్కసారి వచ్చి పలుకరించాడా? ఉద్యోగంలో చేరానని అతిశయమేమో? లేక ప్రయోజకుడి నయ్యానని అహంకారమో!"

"ఛఛ! ఎందుకో అతడిని అపార్థం చేసుకుంటున్నావమ్మా. శ్రీమంత్ అటువంటి మనిషేనా? వాళ్ళ ఆఫీసర్‌తోపాటు కేంప్‌లో వున్నాడట యిన్నాళ్ళు. నువ్వు ఈ వూరు వచ్చిననాడే అతడు వెళ్ళిపోయాడు."

"ఔను. అదేమరి. ఇపుడు ప్రతిదానికీ ఆ ఉద్యోగం వంక ఒకటి బాగా దొరుకుతుంది. నేను ఎప్పుడు వచ్చినా స్టేషన్‌కు వచ్చేవాడు. ఇపుడు మరి రాచకార్యాలలో మునిగిపోయాడు కదూ?"

వింటూనే రఘురామయ్య హాయిగా నవ్వేశాడు, తేలికైన మనసుతో.

"ఓ! అదా నీ కోపం? ఇంకా ఏమో అనుకున్నాను. అడుగో అతడు రానే వస్తున్నాడు! మీరిద్దరే తేల్చుకోండి మీ తగవు .... రావోయ్ శ్రీమంత్, రా రా" అని యిటు తిరిగి సాదరంగా ఆహ్వానించాడు.

ప్రాంగణంలో స్కూటర్‌ను ఆపి ఛెంగుఛెంగున మెట్లెక్కి వస్తూన్న శ్రీమంత్‌తోపాటు ఆ యింటిలోనికి వెలుగు వచ్చిందా అన్నట్లుంది.

స్తబ్ధ వాతావరణం ఒక్కసారి చైతన్యాన్ని పుంజుకొన్నది.

"హల్లో శశీ! ఎలా వున్నావ్?"

డైనింగ్ టేబుల్‌కు అటుగా శశిరేఖకు అభిముఖంగా కూర్చున్నాడు.

"ఫైన్!" మామూలుగా అన్నది శశిరేఖ.


"నువ్వూ భోజనం యిక్కడే చేసెయ్యి," అతడి ముందుకూడ ఒక ప్లేటు వుంచుతూ అన్నది విశ్వేశ్వరి:

"లేదమ్మా. చాలా పనుంది. శశిని చూడాలనే వచ్చాను. రేపు తప్పక వస్తాను. శశీ, ఇంటిదగ్గర ఉంటావా?"

"ఏం రేపు ఆఫీసు లేదా!"

"ఉన్నదనుకో, కాజువల్ లీవు తీసుకుంటాను" అంటూ లేచాడు.

"వెళ్తానండీ, స్టేషన్‌కు పోవాలి. ఒక ఆఫీసర్‌కు సెండాఫ్ ఇవ్వాలి. బై శశీ. వస్తా వకుళా" అంటూ వచ్చినంత వేగంగానూ నిష్క్రమించాడు శ్రీమంత్.



చైతన్య స్రవంతి మూర్తీభవించినట్లున్న శ్రీమంత్‌నూ, హుందాగా టక టకా నడుస్తూన్న అతడి బూట్లనూ కన్పించినంత వరకూ చూస్తూండిపోయిన వకుళ చూపులు మెల్లగా శశిరేఖపైకి తిరిగాయి.

శశిరేఖ అటు చూడడమేలేదు. భోజనం చేస్తోంది, టేబుల్‌పై నున్న డిషెస్ అన్నిటినీ కలియజూస్తూ.

"రేపు అతడి దగ్గరకూడ యిలా పెంకెగా మాట్లాడి చిన్నబుచ్చక శుభ్రంగా వుండు. చక్కటి స్వభావం. అంతకంటే ఏం కావాలి ఆడదానికి?"

విశ్వేశ్వరి చెప్పిన హితవుకు ఎటువంటి సమాధానం చెప్పకనే భోజనం అయిందనిపించి మేడమీదికి వెళ్ళిపోయింది శశిరేఖ.

రఘురామయ్య గుంభనంగా నవ్వాడు.

"వాళ్ళే సర్దుకుంటారులే. చిన్నతనపు పోట్లాటలు అవన్నీ"

నిజమే నన్పించింది విశ్వేశ్వరికి కూడా.

వకుళ మనసు భారంగా మూల్గింది.

శశి చిన్నతనపు చిలిపితనంలో లేదనీ, మైకపు తెరల చాటున తనను తాను బిగించుకుంటున్నదనీ ఆమెకు తెలిసినా తలిదండ్రులకు చెప్పగల సాహసం లేదు.

6

లేత నీలిరంగు చీరపై నల్లని అల్లిక పూలు, చేతిలో అదేరంగు జరీ పూలు కుట్టిన పర్సు, చక్కగా దువ్వి వదలివేసిన గిరజాల జుట్టు-వింత సోయగాలతో మెరిసిపోతూన్న శశిరేఖను కొన్ని లిప్తల కాలం పరవశంతో చూశాడు



ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

ఆంధ్రప్రదేశ్ లో రైతులకు చేయూత

రైతు మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల ఆర్థిక అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకున్నది.

❊ రుణాల చెల్లింపు గడువు పునర్నిర్ణయం :

1980 జూన్ 30వ తేదీ నాటికి సహకార పరపతి సంస్థలకు రైతులు బకాయిపడ్డ రుణాల వసూళ్ళ విషయంలో కాల వ్యవధిని పునర్నిర్ణయించారు.

❊ అసలు మొత్తం

సాధారణ రుణం :	మూడు సంవత్సరాల రుణంగా పునర్నిర్ణయం.
మధ్యకాలిక (మార్పు చేసిన) రుణం వాయిదా. :	సాధారణ రుణంతో కలుపుకొని సగటు రుణం మొత్తం 5 సంవత్సరాల రుణంగా పునర్నిర్ణయించబడింది.
మధ్యకాలిక (పునర్నిర్ణాయక) రుణం వాయిదా :	సాధారణ, మధ్యకాలిక (మార్పుచేసిన) రుణాలతోసహా మొత్తం రుణాన్ని 7 సం॥ రుణంగా పునర్నిర్ణయించబడింది.

❊ వడ్డీ

ఒక సంవత్సరానికి వడ్డీబకాయి :	ఒక సంవత్సరంపాటు వాయిదా వేశారు.
రెండు సం॥రాల వడ్డీ బకాయి :	రెండు సంవత్సరాలు గడువు పెంచారు.
మూడు సంవత్సరాలు, అంతకు మించిన కాలానికి వడ్డీ బకాయిలు :	మూడు సంవత్సరాలపాటు వ్యవధి పెంచారు.

మొత్తం మీద గడువు పొడిగింపు మూడు సంవత్సరాలకు మించకుండా దీర్ఘకాలిక రుణాలను రుణం కాలవ్యవధితోపాటుగా, బకాయిపడ్డ వాయిదాల సంఖ్య మేరకు, తిరిగి చెల్లించడానికి గడువు పెంచారు.

❊ పంట ఋణాలు :

1980 ఖరీఫ్ కాలంలో సహకార బ్యాంకులు రికార్డు స్థాయిలో రు. 82 కోట్లు మేరకు పంట రుణాలను రైతులకు మంజూరు చేశాయి.

75 శాతం సహకార బ్యాంకు రుణాలను 5 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్టభూమిగల రైతులకు మంజూరు చేస్తారు. ఇందువల్ల చాలా వరకు బలహీన వర్గాలకు లాభం కలుగుతుంది. ఇందులో మూడవ వంతు మొత్తాన్ని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలవారికి కేటాయిస్తారు.

❊ దీర్ఘకాలిక ఋణాలు

రాష్ట్ర సహకార వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు ప్రస్తుత సంవత్సరంలో రు. 65 కోట్ల మొత్తాన్ని భూముల అభివృద్ధి, బావుల త్రవ్వకం, తోటలు, గొర్రెలు, కోళ్ళ పెంపకం పథకాలకు కేటాయించింది.

❊ రుణాల వసూళ్ళ నిలిపివేత

కరువు బాధిత ప్రాంతాలలో రుణాల బకాయీలు, సెస్సులతోసహా భూమి శిస్తు వసూళ్ళను ప్రభుత్వం నిలిపివేసింది.

❊ పంటల భీమా

వరి, జొన్న, వేరుశనగ పంటలకు పంటల భీమా పథకాన్ని ప్రవేశ పెట్టారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖచే ప్రకటితము.

నెం.13:దిన:

శ్రీమంత్.

ఎవరో స్నేహితురాలితో రోడ్డువారగా నిలబడి మాటలాడుతున్నది, గాలికి సయ్యాటలాడుతూన్న ముంగురులను సుతారంగా సవరించుకుంటూ.

"డ్రైవర్! జీప్ ఆపు."

"శశీ! ఎక్కడికి బయలుదేరావు?" అంటూ జీప్‌నుండి దిగుతూన్న శ్రీమంత్‌ను విస్ఫారిత నయనాలతో ఆశ్చర్యంగా చూసింది శశిరేఖ.

"నేను తర్వాత కలుస్తాలే అయ్యగారిని. నీవు వెళ్ళు! అన్నాడు డ్రైవర్‌తో.

"మీ ఆఫీస్ వెహికిలా అది?"

సాగిపోతూన్న జీప్‌ను చూస్తూ అడిగింది శశి.

"ఔను. నువ్వెక్కడికి?"

"ఆ(....ఒక స్నేహితురాలి దగ్గరకు. తోచక...." సమాధానం చెప్ప టానికి తడబడింది.

పరీక్షగా చూశాడు శ్రీమంత్.

"ఈ రోజు నీకోసం నేను సెలవుతీసుకు వస్తానని నిన్ననే చెప్పానుకదా! నీవు వేరే ప్రోగ్రాం పెట్టుకోవడమేమిటి?"

"యేమో, ఉద్యోగస్తుడివి కదా! తీరదేమో అనుకున్నాను."

"చాలా గొప్పగా ఊహించావుకానీ, పద, అలా నది ఒడ్డుకు పోదాం."

ఈ వాదోపవాదాలు వినిన శశి స్నేహితురాలు సెలవు తీసుకున్నది.

"నది ఒడ్డుకు నడిచే ఓపిక లేదు నాలో యిప్పుడు."

"ఎంచేతో?"

శశి మాట్లాడలేదు.

అతడు రెట్టించాడు.

ఓ రెండు ఫర్లాంగుల దూరమే నడవలేవా? మనం ఎన్నిసార్లు అలా వెళ్ళలేదు?"

శశి వదనం అసహనంగా మారిపోయింది.

"ఔను. వెళ్ళాం. అందుకే విసుగొచ్చింది ఆ నడకా ఆ పద్ధతులపైన. జీప్ ఎందుకు పంపేశావు మరి?"

"అది ఆఫీస్ జీప్ కదా? స్వంతానికి వాడుకోకూడదు."

"అంతేనన్నమాట మన ఉద్యోగం విలువ?" శశి అనాలోచితంగా అనే సింది.

శ్రీమంత్ భృకుటి ముడిపడింది.

అంతలో దారిన పోయే కారు ఒకటి ఆగింది.

"హల్లో శశీ!" అన్నది ఓ కంఠం.

"ఓ! జలజా!"

కారు దగ్గరకు వెళ్ళి రెండు నిముషాలు మాట్లాడిన శశిరేఖ కొరకు ఆ కారు తలుపులు తెరుచుకున్నాయి.

"వెళ్తున్నా శ్రీమంత్"

లాంఛనప్రాయంగా చెప్పేసింది శశి, కారు తలుపు మూస్తూ.

అయోమయంగా చూస్తూన్న శ్రీమంత్ తేరుకోవడానికి కొద్ది క్షణాలు పట్టింది.

ఆత్మీయులని తలచిన వారినుండే అవమానం అనుభవమైన ఆ అభిమాని అంతరంగంలో హాలాహలం చెలరేగింది.

అలా పరధ్యానంగా అడుగులు వేస్తూనే వున్నాడు.

అతడికి తెలియకనే కాళ్లు నది ఒడ్డుకు నడిచాయి.

అయితే, అతడి మదిలోని పరాభవాగ్నిని మరింత ప్రజ్వలింపజేసే దృశ్యం తయారుగా వున్న దక్కడ.

శశి వచ్చిన కారు అక్కడే వున్నది.

ఆమె స్నేహితురాలు జలజతోపాటు మరొక యువకుడు కూడా వున్నాడు.

శశికి బాహ్యప్రపంచ స్మృతే లేనంత పరవశత్వంతో నవ్వులు, మాటలు

సాగుతున్నాయి ఆ యువకునితో. జలజ చిన్న చిన్న పళ్ళెరాలలో ఫలహారాలు సర్దుతోంది.

శ్రీమంత్ మదిలో, వదనంలో అనేక భావాలూ, శంకలూ ఉత్పన్న మయ్యాయి.

తదేకంగా రెండు నిముషాలు వారిని గమనించాడు.

గిరుక్కున వెను దిరిగి, గృహోన్ముఖుడయ్యాడు.

7

"శ్రీమంత్! రెండు రోజులుగా ఆఫీసుకు వెళ్ళడం లేదేమిటి?"

నులక మంచంపై కూర్చుని పొగాకు చుట్టుకుంటూ అడిగిన తండ్రి ప్రశ్న విననట్లు ఆకసం దెస చూడసాగాడు శ్రీమంత్.

"ఏరా అబ్బాయ్? ఒంట్లో బాగుండలేదా?" కోటయ్య రెట్టించాడు.

"బాగానే వున్నది. ఊరకనే......సెలవు వున్నది కదా అనీ...... తీసుకున్నాను." నసిగాడు.

"రెండు రోజులు కాదు రెండు నిముషాలుకూడ దొరకదని పరుగెత్తే వాడివి కదా?"

"ఆఁ. ఆఫీస్‌లో వున్న పనిని బట్టి...."

అంతకంటే ఆరా తీసే అవకాశం తండ్రికి ఈయకూడదని లేచి లోపలికి వెళ్ళబోయాడు.

గ్రహించిన కోటయ్య సంభాషణ మార్చాడు.

"అన్నట్టు... శశిరేఖ ఊళ్ళోనే వున్నదట. రావటం లేదేం ఇదివరకు లాగా?"


వింటూనే గతుక్కుమన్నాడు శ్రీమంత్, కానీ తన కలవరపాటును కప్పి పుచ్చుతూ జవాబుగా అన్నాడు,

"నేనే కలుసుకున్నాను రెండుమూడుసార్లు వాళ్ళింట్లో."

ముక్తసరిగా వున్న ఆ జవాబు కోటయ్యలో సంశయాన్ని రేకెత్తించి, కుమారుని ఓసారి పరిశీలనగా చూసేట్లు చేసింది.

"శశిరేఖ రాకమునుపే రఘురామయ్య పెండ్లిముహూర్తం, శుభలేఖల నమూనా కూడ చర్చించాడు నాతో. మరి శశి వచ్చి ఇన్నాళ్ళైనా మరలా ఆ ప్రసక్తి లేదు. నీకేమైనా తెలుసా?"

నిజానికి అందుకు సమాధానం శ్రీమంత్ వద్దకూడా లేదు. నిన్న నదిపద్ద చూసిన దృశ్యం, శశిరేఖలో క్రొత్తగా కొట్టవచ్చినట్లు కానవస్తూన్న నిర్లక్ష్యతా, రఘురామయ్య తటస్థతా-అన్నీ కలిపి ఏదో ఒక అనూహ్యమైన అన్వయం చేస్తూన్నది అతడి మనసు. కానీ ఆధారం లేని అనుమానాలను వ్యక్తీకరించడం



అతడి స్వభావానికి సరిపడదు.

అందుకే ప్రకాశంగా నవ్వేశాడు.

"ఇలా కొత్త ఉద్యోగం వచ్చిందో లేదో-అప్పుడే ఈ తొందరేమిటి నాన్నా? కొంచెం నన్ను యిందులో స్థిరపడనీయండి. అప్పులు తీర్చనీయండి. ఆ తర్వాత ఖర్చు సంగతులు ఆలోచించవచ్చు."

విస్మయంగా చూశాడు కోటయ్య. అతడి కనులలో అనేక ప్రశ్నలు కదిలాడాయి.

"లోగడ ఇటువంటి ప్రసక్తి అనేకసార్లు వచ్చింది. ఆమాటకొస్తే, అసలు ఏడెనిమిదేండ్లుగా అనుకుంటూన్న మాటే యిది. నువ్వు ప్రాజ్ఞుడవై తెలివిగా చదువుకుంటూన్నప్పటినుండే—నీకు పధ్నాలుగు సంవత్సరాలప్పుడే రఘురామయ్యా, అతడి భార్యా ఈ మాట స్థిరపరిచారు. ఎపుడూ అభ్యంతరకరంగా మాట్లాడని నువ్వు ఈరోజు క్రొత్తగా మాట్లాడుతున్నావ్?"

"ఏమీ క్రొత్తలేదు. ఎపుడూ మీరూ యింత స్థిరంగా అడగలేదుగా, ఏదో అనుకోవడమే కానీ?"

"నీవు అప్పులు తీర్చుకునేవరకూ అయిదారేళ్ళు ఆగమంటే ఆడపిల్లవాళ్ళు ఆగుతారా?"

అసహనంగా చూశాడు శ్రీమంత్.

"అదంతా నాకు తెలియదు కానీ, మీరు మాత్రం మీఅంత మీరుగా వారి దగ్గర వివాహ ప్రసక్తి తీసుకురావద్దు! మీ తొందరనీ, అభిలాషనూ వ్యక్తీకరించవద్దు."

నివ్వెరపాటుతో చూశాడు కోటయ్య.

"ఏమిటీ ధోరణి? అయినా మనం బాకీ వున్నది మాత్రం ఎవరికి? రఘు

రామయ్యకేగా?"

"అందుకే వారివద్ద లోకువ కాకూడదు. మనమూ మనంతటి వాళ్ళంగా కన్పించాలి కానీ, అప్పులకూ, పెళ్ళికీ లంగరు వేయకండి."

"శ్రీమంత్!"

"ఔను నాన్నా. అప్పు రూపేణా అయినా సరే-వారి డబ్బు నామీద వున్నంతకాలం నేను వారి దృష్టిలో తక్కువగానే కన్పట్టవచ్చు! ఆ మొహమాటాలూ, ఋణాలూ లేనపుడే అల్లుడికి సరైన గౌరవం!"

మరి తర్కించను యిష్టం లేదన్నట్లుగా అక్కడినుండి నిష్క్రమిస్తూన్న శ్రీమంత్‌ను తండ్రి ఆలోచనాపూర్వకంగా, అవాక్కుగా చూస్తూండిపోయాడు.

అయితే, శ్రీమంత్ విధించిన ఆంక్షను అతడు ఖాతరు చేయలేదు. అందుకు కారణం రఘురామయ్యకూ అతడికీ పాతికేండ్లుగా గల అపురూప స్నేహబంధమే.

శ్రీమంత్‌తో తర్క వితర్కాలు జరిగిననాటి సాయంత్రమే రఘురామయ్యతో ఎప్పటిమాదిరిగా కాలక్షేపంగా చదరంగం ఆడుతూ కూర్చున్నాడు కోటయ్య.

అయితే, ఎప్పటిలా చదరంగంలో ప్రజ్ఞ ప్రదర్శించకుండా పరధ్యానంగా వున్న కోటయ్యను హాస్యమాడాడు రఘురామయ్య.

"పడుచుతనపు పరాకులు, ఏళ్ళు పైబడుతూన్న తరుణంలో సంప్రాప్తించాయేం కోటయ్యా?"

అతడితో సరిగా, పకపక నవ్వలేకపోయాడు కోటయ్య.

అవకాశం జారవిడువకుండా అనేశాడు:

"పడుచువాళ్లు మనం పడుచుతనంలో వున్నట్లుండకపోవడమే మరి మనల్ని పరాకులో పడవేస్తోంది.

శ్రీమంత్‌ను ఓయింటివాడిని చేసి బాధ్యత తీర్చుకుందామనుకున్నవేళ, వాడేమిటో వేదాంతం మాట్లాడ్తున్నాడు!"

వినగానే రఘురామయ్య కలవరపడినా, తన తత్తరపాటును దాచిపెడుతూ చిరునవ్వుతో అన్నాడు:

"రోజులు మారాయిగా మరీ? శశి కూడ అలాగే అంటోంది, "ఇప్పుడే పెళ్ళేమిటీ?" అని, మరి ఆ వయస్సులకే మన పెళ్ళిళ్ళై ఆరేడేళ్ళయింది: సంసారంలో-జీవితంలో స్థిరపడ్డాం." అంటూ అకారణంగా నవ్వేస్తూ వాతావరణం తేలిక చేయాలని చూశాడు.

కోటయ్య నవ్వలేదు.

అనుభవజ్ఞుడైన అతడి మెదడు చురుకుగా పనిచేయసాగింది.

"అప్పుడే వద్దంటోందా? ఇంకేమైనా అంటోందా శశి?" సూటిగా అడిగే



శాడు.

రఘురామయ్య వదనంలో గాభరా స్పష్టంగా ద్యోతకమైంది.

సరిగ్గా అదే సమయంలో శశిరేఖ రావడంతో తాత్కాలికంగా రఘురామయ్య కోటయ్య ప్రశ్నాపరంపర నుండి రక్షింపబడ్డాడు.

"నమస్కారమండీ." యాంత్రికంగా చెప్పేసి మేడమీదికి వెళ్ళిపోయింది శశిరేఖ.

అటువైపు గది తెర తొలగించుకుంటూ సరిగా అదే సమయంలో వకుళ ప్రవేశించింది కాఫీ ట్రేతో.

"ఈమధ్య అస్సలే చదరంగానికి రావడం లేదేమండీ? మీకు అలవాటుగా కాఫీ ఈయకపోతే నాకు తోచదు" అన్నది ఆప్యాయంగా కోటయ్యకు ఒక కప్పు అందించుతూ.

జవాబు లేకుండా నవ్వేశాడు కోటయ్య,

కానీ లోలోపల అతడు శశిరేఖకూ వకుళకూ గల వ్యత్యాసం బేరీజు వేస్తున్నాడు. ఆయనలో ఈ తరహా పరిశీలనా దృష్టి కలగడం యిదే మొదలు.

వాతావరణంలో మొత్తం మీద ఏదో మార్పు వచ్చినట్లు అతడి అంతరంగానికి తట్టింది.

"శ్రీమంత్ మాటలను నేను చిన్నతనపు తొందరపాటుగా భావించి తేలిక చేయలేదు రఘురామయ్యా, కానీ ఆలోచించితే చిన్నవాళ్ళే మనకంటే తెలివిగా ఆలోచించగలరని అన్పిస్తోంది. ఎవరిదగ్గర తీసుకున్నా అప్పు అప్పే-నా చదువుకు రఘురామయ్యగారు చాలా ఖర్చుపెట్టారు. ఆ ఋణంనుండి విముక్తుడనైతేగానీ, సంసార జంఝూటంలో చిక్కుకోదలచలేదు. అని స్పష్టంగా చెప్పేశాడు! ఏమిటో వాడి అంతరంగం? అర్థం కావటంలేదు." (సశేషం)

(దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం విశ్వనాధ సత్యన్నారాయణగారికి జ్ఞానపీఠం బహుమతి లభించిందని విన్నాక వారి అనితర సాధ్యమైన శైలిని అనుకరించాలనే బుద్ధిపుట్టి వ్రాసిన కథ ఇది. వారు బ్రతికి వుండగా యీ కథను ప్రచురణకు పంపడానికి సాహసించలేక పోయాను: వారి శైలిని అనుకరించ గలిగానని సహృదయ పాఠకులు యే కొద్ది మంది తల వూపినా నా శ్రమ ఫలించిందనే భావిస్తాను. —రచయిత)

ఒకానొక గ్రామములో రామయ్య అనువాొక రైతు వుండెను. ఒక గ్రామములో ఎందరో రామయ్యలుండ వచ్చును. మరి యీ రామయ్య ప్రత్యేకత యేమి? అతడందరి రామయ్యల వంటి వాడు గాదు: మంచితనము మూర్తీభవించినవాడు. తన పని యేదో తాను చూసుకొని మిగిలిన వారికి వీలైనంత సాయము చేసెడి వాడు:


ఈ కాలములో యింకా అటువంటి వారున్నారాయని మీకు సందేహము రావచ్చును. మంచివారు యీ కాలములో నేమి, అన్ని కాలములలోను వుందురు. ఒకానొక సమయ మందు మంచి గుణమునకు గ్రహణము పట్ట వచ్చును. లోకులు మంచి తనమును చెడ్డదిగా భావించ వచ్చును. ఆ కాలములో మంచితనము ప్రకాశ వంతముగా లేదన్నమాట! అయిన నేమగును? నాటి సారస్వతము, చరిత్రలలో మంచితనము ప్రసక్తి వుండదు. అందువల్ల వాటినే ఆధారముగా చేసుకొని నేటి పండితులు ఆ కాలమున మంచితనమే లేదన వచ్చును: సరి: ఈ రామయ్య మంచితనము ఎక్కువగా ఉన్నవాడు:

రామయ్య తనకున్న నాలుగెకరముల కొంద్రను సాగు చేసుకొనెడివాడు. పంటల కాలమున పొలములోనే నివశించెడివాడు. పిల్లలు భోజనము తెచ్చి పెట్టగా భుజించి పాకలోనే యుండెడి వాడు. పొలములు పంటలతో నున్నప్పుడు యేమి జరుగును? ఎక్కడెక్కడి పశువులు మేయుటకు వచ్చును. మరి వానిని యజమానులు కట్టడిలో నుంచరా? కొంత మంది కట్టడి చేయుదురు. మరి కొందరు వూరు కొందురు. ఈ పశువులతో ఆ వూరిలోని గాడిదలు కూడా కొన్ని చేరెను.

గాడిదలు పశువులతో చేరినను గాడిద బుద్ధులు పోవుకదా! పశువులు తిన్నంత తిని తమ దారిన తాము పోవును. గాడిదలు అట్లు చేయవు: కడుపు నిండిన వెనుక అవి ఓంద్ర

విశ్వనాథ వారు వ్రాయని కథ!

'కపి'



పెట్టును. గాడిదల ఓంద్రనుసహింపగల వాడెవ్వడు? వసుదేవుడే ఓంద్ర పెట్ట వద్దని గాడిద కాళ్ళు పట్టుకొనెరి: మరి అందరూ అది చేయగలరా? చేయలేరు.

కనుక వారేమి చేసెదరు? తమ చేతిలోని బడితతోనో, రాళ్ళతోనో వాటిని కొట్టెదరు.

మన రామయ్యకూ చిన్నతనము నుండి గాడిదఓండ్రయన్న అసహ్యము. కనుక గాడిద ఓండ్ర పెట్టగానే చేతిలోని చేపాటి కర్రను సవరించి వాటిని తరిమి కొట్టెడి వాడు. ఒక వ్యక్తి వొక పని చేయుచున్నాడనుకొందము. ఆ పని వల్ల మనకునూ లాభ ముండునను కొందము. ఆ పనిని యెప్పుడూ మనమూ వ్యక్తికే వదలి వైచెదము. రామయ్య విషయములోనూ యిదే జరిగినది. రామయ్యకు ఓండ్రయన్నగిట్టదు. కనుక అతను గాడిదలను తరిమి కొట్టును. ఇది మిగిలిన వారికి లాభము. కనుక వారు వూరుకొనెడి వారు. చివరకు ఆ చుట్టుపట్ల యే పొలములోనికి గాడిద వచ్చినను రామయ్యయే తోలవలెనన్నది ఖాయమై పోయినది!

ఒక వ్యక్తి ఎంతో కాలము వొకే పనిని వోపికగా చేయలేడు. కొంత కాలమునకు విసుగు పొడ సూపును. బాధ కలుగును. యుక్తా యుక్త విచక్షణా జ్ఞానము నశించును!

పొలములో కష్టపడి వచ్చిన రామయ్య విశ్రాంతి తీసుకొన నెంచును. గాఢ సుషుప్తిలో నుండగా మెలుకువ వచ్చును. ఊను గాడిద ఓండ్ర! గాఢ నిద్ర నుండి లేపబడిన యే వ్యక్తికైనను విపరీతమగు కోపము వచ్చును. గాడిద పొలమున పంట మేయుట మొదటి కారణము. ఓండ్ర పెట్టుట రెండవ కారణము. అతడేమి చేయును? దగ్గరలో నేమున్న దానిని గాడిద వైపు కోపముగా విసరును!

ఒక రోజిట్లే జరిగెను. కోపముతో రామయ్య తన దగ్గరలో నున్న గొడ్డలిని గాడిదల వైపు విసరెను. తరువాత కొంచెము సేపటికి అతని కోపము తగ్గెను. కోపము తగ్గగానే అతనికి గొడ్డలిని విసరినందుకు పశ్చాత్తాపము కలిగెను. గొడ్డలి వ్రేటుకు గాడిద మరణించెనేమొ, అందు వల్ల తనకు పాపము వచ్చును అనుభీతి కలిగెను!

అయిననేమయ్యె నన్నమాట? అతని మంచితనమునకు కొద్ది క్షణములు గ్రహణము పట్టెను. ఆ సమయమందు అతను చెడ్డ వాడాయెను. అది తొలుగగానే అతను మంచి వాడాయెను. ఇట్లే యే కాలమందైనను జరుగును!

రామయ్య మెల్లగా పాక నుండి బయటకు వచ్చి చూచెను. పుచ్చపువ్వు వంటి వెన్నెల పచ్చని పొలములపై తళతళా మెరయుచున్నది. ఆకాశము నుండి దేవతలు వెండి కరిగించి భూమి పై గ్రుమ్మరించు చున్నట్లున్నది. సకలచరాచర ప్రకృతి తెల్లటి వెన్నెలలో మునిగి పోయినది. కాని రామయ్యను యివి యేవియు ఆకర్షించలేదు. అతని దృష్టి యంతయు గాడిదలపై నున్నది. అతను భయపడినట్లే జరిగినది! అతని పాకకు కొంచెము దూరములో వొక గాడిద పడియున్నది. ప్రక్కనే రామయ్య గొడ్డలి పడియున్నది! రామయ్య గుండె వొక్క క్షణము కొట్టుకొనుట మాని వేసెను!

అయిన తన గొడ్డలి వ్రేటునకు గాడిద మరణించెనన్న మాట. ఎంత పని జరిగినది! కోపముతో వొక ప్రాణిని తాను నిష్కారణముగా హత్య చేసెనన్న మాట. ఈ పాపము పోవుటెట్లు? పిల్లి హత్యకు ప్రాయశ్చిత్తమున్నది. బ్రాహ్మణ హత్యకు ప్రాయశ్చిత్తమున్నది. మరి గాడిద హత్యకో? ఉండియే వుండును! దీనిని గురించి ఎవరినైన సంప్రదించవలయును. ఈ నాటి బ్రాహ్మణులు ప్రతి చిన్న పనికి ఎక్కువ ధనము ఖర్చగు ఉపాయమును చెప్పెదరు.

అయిన తానీ గాడిద హత్య గురించి వారికి చెప్పవలదా? చెప్పక పోయినను యీ దుష్కార్యము తన మనస్సునెల్లప్పుడు బాధించుచుండును. కనుక చెప్పి ప్రాయశ్చిత్తము చేసుకొనుటయే మేలు! కాని యిది ప్రాయశ్చిత్తముతో వదలక పోవచ్చును. గాడిద స్వంతదారుడు దాని వెలను కోరవచ్చును. "చచ్చిన వాడి కళ్లు చేరెడేసి" అన్నట్లు ఆ చనిపోయిన గాడిద గుణగణములను

యిబ్బడిముబ్బడిగా వర్షించి అతడు అధిక వెల నడుగ వచ్చును!

ఈ ప్రాయశ్చిత్తపు ఖర్చుతో, గాడిదకీయవలసినవెలతో తనఈయేటి పంట సరిపోవచ్చును! మరి మిగిలిన సంవత్సరమంతయు నెట్లు గడుపవలెను?

అయినను ఆ గాడిద యిటువైపున కేల రావలయును? వచ్చిన వచ్చినది. మేసిన మేసినది. ఓండ్ర యేల పెట్టవలయును? ఇంత పొలమును పాడు చేసితిని సుమా అని కేక వైచుటా అది? అయినను అది గొడ్డలి వ్రేటు దూరములోని కేల రావలయును?


ఇన్ని కార్యములు వరుసగా జరిగిన వన్న యేమన్న మాట? దాని కాలము తీరి పోయినది! కనుక మృత్యు చోదితయై అది యిక్కడకు వచ్చి చేరినది. అందువలన నా తప్పేమియు లేదన్న మాట. దైవ ప్రేరణ చేతనే నేను గొడ్డలి విసిరితినన్న మాట. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనను కుట్టదని వుండనే వున్నది కదా! ఈ గాడిద పూర్వ జన్మలో మానవుడై మరియొక గాడిదకు ఈ రకమైన మృత్యువును కలిగించి యుండ వచ్చును. కర్మ సిద్ధాంతము తప్పించు కొనుట నెవరి తరము?

అయినచో వచ్చు జన్మలో నాకును యిదియే గతియా? అయిన కానిమ్ము! ప్రస్తుత మీ పశ్చాత్తాప కాండ వదిలించుకొన గలిగిన అదే పది వేలు. "బ్రతికున్న బలుసాకు తిన వచ్చును". తనకు మాలిన ధర్మము మొదలు చెడ్డదేరమని శాస్త్రకారులు చెప్పియే యున్నారు. "ప్రాణ విత్తమాన భంగ మందు బొంకవచ్చునధిప" అని కూడా వారే చెప్పి యున్నారు. కనుక ప్రాయశ్చిత్తము వరకూ రాకుండగ ఈ చనిపోయిన గాడిదను ప్రక్క పొలము లోనికి యీడ్చి వేయుటయే ప్రస్తుత కర్తవ్యము.

మరి మనసు బాధ పడుటయో యందువా?-ఆ కార్యము నాచరించి నప్పుడు తాను మనిషి కాడు. అసురుడు. అసుర ప్రవృత్తి తొలిగినంతనే మానవుడాయెను. కనుక మానవ ధర్మ సూత్రముల ప్రకారము ప్రాణ, విత్త, మాన, భంగముల తొలగించు కొనుటయే తన కర్తవ్యము!

ఈ విధముగా అతని ఆలోచనలను వ్రాయుటకు యింత కాలమాయెను. కాని ఆలోచించుటకు అతనికి అయిదు నిముషముల కాలము మాత్రమే పట్టెను. మనో వేగమునకు దీటు వచ్చునదేది?

చివరకు దృఢ నిశ్చయముతో ఆ చచ్చిన గాడిదను ప్రక్క పొలము లోనికి యీడ్చి వేయుటకు అతను ఆయత్తుడై ముందుకు సాగెను. క్రిందకు వంగి దాని వెనుక కాళ్లు పట్టుకొని బలము కొద్దీ దానిని లాగబోయెను. ఇంతలో నొక మహా విచిత్రము సంభవించెను! ఆ గాడిద కదిలి తన సత్తువ కొలదీ రామయ్యను తన్ని శర వేగముతో ముందుకు పరిగెత్తెను! ❋



చేత వెన్నముద్ద

— వాకాటి

"ఉడుముండదె నూరేండ్లును ?-" అన్నాడు కవి. ఉండడం, పడి వుండడం, ఎలాగో ఒకలాగున వుండడం అన్నది జీవచ్ఛవాల లక్షణం. అనుక్షణమూ స్పందిస్తూ, వెతుకుతూ, ఎదుగుతూ, విస్తరిస్తూ, చీకట్ల నెదిరిస్తూ, వెలుగులు వెదజల్లుతూ, "మానవ జన్మ అన్నది, ఇదుగో ఇందుకు!" అని నిర్వచిస్తున్నట్లుగా బ్రతకడం మనిషి లక్షణం.

నగర జీవిత సుఖ సంతోషాలను కాలదన్ని

ఆఫ్రికా అరణ్యాలలో ఆసుపత్రి

తెరిచిన అపూర్వ మానవతామూర్తి

ఆల్బర్ట్ ష్వయిట్జర్ !

అలాంటి మనిషి చేతులే అవి. అవి అక్కడ కీకారణ్యంలో గొడ్డలి చేతపట్టి వృక్షాలను నేలకూల్చి, ఆ చోటునంతా చదునుగా చేసి, ఆ వృక్షాలను కోసి పలకలుగా చెక్కి వాటితో చక్కటి ఇళ్ళను, వైద్యశాలలను నిర్మించాయి.

ఆ చేతులే శస్త్రచికిత్స పనిముట్లను సుతారంగా వాడి వందలాది జనుల బాధను తగ్గించాయి, మందుల నందించి వారి నారోగ్యవంతులను చేశాయి.

ఆ చేతులే ఆర్గాన్ వాయిద్యపు మెట్ల మీద అలవోకగా నాట్యంచేసి పాశ్చాత్య శాస్త్రీయ సంగీత సుధలను వర్షించాయి.

ఆ చేతులే కలాన్ని పూని-"చారిత్రక దృష్ట్యా జీసస్", "జీసస్ మానసిక పరిశోధన", "ఒక పురాతన అర

ణ్యపు టంచున", "భారతీయ ఆలోచనా ధార-దాని ఎదుగుదల-" వంటి విషయాలమీద 1600 పుటల ఉద్గ్రంధాలను రచించాయి.

నిజంగా అవి ఎంతటి మహత్తర హస్తాల్లు!

○ ○ ○


అలా చేతులతో, శరీరంతో, మేధతో, హృదయంతో, ఆత్మతో అనుక్షణమూ చైతన్యవంతంగా మూర్తిమంతంగా జీవించిన ఆ మహానుభావుడి పేరు ఆల్బర్ట్ ష్వెయిట్జర్!

ష్వెయిట్జర్‌ని, ఆఫ్రికాలో మారుమూల కీకారణ్యం మధ్య ఆస్పత్రి నిర్మించి అనేక వేలమందికి ఆరోగ్యం ప్రసాదించిన ఆధునిక అశ్వనీ దేవతగానే చాలమంది ఎరుగుదురు....కాని ఆయన బహుముఖ వ్యక్తిత్వంలోని ఇతర అంశాలను ఎరుగరు.

1875 లో జర్మనీలోని కెయిసర్‌బర్గ్‌లో జన్మించిన ష్వెయిట్జర్-తనకు అలౌకిక ఆనందంయొక్క అనుభూతి సంగీతం ద్వారా లభించిందని పేర్కొన్నాడు. మొదట తన తండ్రియొక్క పాత పియానో మీద, తర్వాత హార్మోనియం మీద పాటలు వాయించడానికి తంటాలుపడ్డ ష్వెయిట్జర్‌కు బాల్యం నుంచే జానపద గీతాలంటే ఇష్టంగా వుండేది. సంగీతం ఆ బాలుడిని 'అక్షరాలా' కదిలించివేసేది. కొన్ని పాటలు వింటున్నప్పుడు-అతడు నఖశిఖపర్యంతం ఎంతగా వణికిపోయేవాడంటే-క్రింద పడిపోకుండా వుండడానికి గోడను ఆనుకోవలసి వచ్చేదట! చలదళం (రావియాకు) వంటిది గనుకనే ఆయన ఎద, సంగీతమన్నా, సర్వసృష్టిలోని జీవరాశి యన్నా, సాటి మానవుడి బాధ అన్నా అంతగా స్పందించింది. ఆ స్పందన లేని గుండె కప్పనోరువలె లబ్‌డబ్ మని ఎన్ని కోట్లసారులు కొట్టుకుంటేనేమి, అది ఒక మరమాత్రమే కదా....

ఆర్గానో పియానో వాయిద్యాలను పేరొందిన గురువులవద్ద అభ్యసించాడు యువకుడు ష్వెయిట్జర్. తత్వశాస్త్రాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని, మతాన్ని అధ్యయనం చేశాడు. ప్రేమించే తలిదండ్రులు, తగుపాటి సుఖసంపదలు, ఆదరణ, తనకు నచ్చినవాటిని చేయగల స్తోమత-వీటన్నిటివలన కలిగే ఆనందంతోబాటే అతగాడికి-గౌతముడికి వలెనే ప్రపంచంలోని ఆర్తి, బాధ, ఇవి అమితమైన ఆవేదనను కల్గించాయి. లోకంలో ఇంతటి బాధ వుండగా తాను జీవితంలో ఎదురయిన సుఖసంతోషాల నిలా హాయిగా స్వీకరించి తృప్తిగా వుండడం తగునా-అని అతడు మధన పడసాగాడు.

1905 పాటికి ఒకపక్క విద్యాభ్యాసం కావిస్తూనే, ఇంకొకప్రక్క-సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీతకారుడు, కవి అయిన "బాక్" మీద అపూర్వమైన గ్రంధాన్ని ఫ్రెంచ్‌లో రచించాడు. (తర్వాత 1908 లో ఇదే గ్రంధాన్ని జర్మన్‌లో రాశాడు.) 1904 లో ఒక పారిస్ పత్రికలో ఆఫ్రికన్ నీగ్రోల గురించి చూడగానే, వారి వ్యాధిగురించి



చదవగానే ష్వెయిట్జర్‌కు తానిన్నాళ్ళ పడుతున్న బాధకు అర్థం తెలిసింది. తన దారి ఏదో ఎవరో వేలెత్తి చూపినట్లయింది. వెంటనే అతడు వైద్య విద్య నభ్యసించడానికి, అది ముగియగానే ఆఫ్రికా వెళ్ళడానికీ నిశ్చయించాడు!

అతడి బంధు మిత్ర వర్గమంతా ఆశ్చర్యపోయింది. ముప్పైయేళ్ళకే తత్వశాస్త్రవేత్తగా, మత విషయాలలో అధికారిగా, సంగీతకారుడిగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించినవాడు ఇవన్నీ వదులుకుని ఎక్కడో ఆఫ్రికాలో మారుమూల అడవుల్లోకి వెళ్ళిపోవడమా?-

"ఇన్నాళ్ళు మాటలు మాట్లాడాను, రాతలు రాశాను. ఇపుడింక కార్యరంగంలోకి దూకి పనిచేయవలసిన సమయం ఆసన్నమయింది!" వేదికలు, పరీక్షా మందిరాలూ చాలునన్నాడు, జీవిత రంగంలోకి దూకాలన్నాడు.

దూకాడు.

1913 లో భార్యతోపాటు ఓడమీద బయలుదేరి వెళ్ళి ఆఫ్రికాలోని లాంబరీన్ చేరాడు. కాకులు దూరని కారడవిలో, స్వయంగా చెట్లను నరికి తన చేతులతో ఆస్పత్రిని నిర్మించాడు. గ్రామాలు తిరిగాడు. తానంటే ఆ అనాగరికులకు నమ్మకం కలిగేలా చేశాడు. వారి జబ్బుల నధ్యయనం చేశాడు. మందులతో, శస్త్రచికిత్సతో వారి వ్యాధులను నయం చేశాడు. భార్య సహాయంతో ఆకాశంకింద ఆపరేషన్లు చేసేవాడట ఆయన! మొదటి తొమ్మిది నెలలలోనూ రెండువేల మందికి చికిత్స చేశాడు.

ఈవిధంగా 1917 దాక నాలుగేళ్ళు సేవచేసిన ఈ మహానుభావుడి జీవితం

లోకి ప్రపంచయుద్ధపు విషాదచ్ఛాయలు తొంగిచూశాయి. వీరున్న ఆఫ్రికన్ భూభాగం ఫ్రెంచివారి దయినందున వీరు జర్మన్ లయినందున, ఎక్కడో యుద్ధంలో ఈ రెండు దేశాలూ ప్రత్యర్థులు గనుక, ష్వెయిట్జర్ దంపతులను బందీలుగా చేసి ఫ్రాన్స్‌కు తీసుకువెళ్ళి వుంచారు!

కష్టాలన్నీ సజ్జనులకే కదా వస్తాయి.. అలాగే ష్వెయిట్జర్ కూడా ఈ అవమానాలను భరించాడు. ఆ "ఖైదు" ముగిశాక జర్మనీ చేరాడు. యుద్ధం ముగిసింది. 1918-24 లో సంగీతం, గ్రంధరచన, తత్వశాస్త్ర పఠనాలతో గడిచిపోయాయి. 1918లో ష్వెయిట్జర్ దంపతులకు కూతురు రీనా పుట్టింది. ఆయన యూరపు తన కిచ్చిన పదవిని, ఇస్తున్న గౌరవాలను, కీర్తిప్రతిష్ఠలను- అన్నిటినీ త్యజించి 1924 లో మళ్ళీ ఆఫ్రికా చేరాడు. మూడేళ్ళ అక్కడి బాధాసర్పదష్టులకు అండగా నిలిచాడు.

1929-31, 33-34, '35 లలో ఆయన లాంబరీన్‌లో తన ఆస్పత్రి కార్యకలాపాలను పటిష్ఠం చేస్తూ ఆఫ్రికాలో వున్నాడు. మళ్ళీ 1937-39 మధ్య, ఆ తర్వాత 39-48 మధ్య అక్కడే రోగుల సేవలో గడిపాడు. ఈనాడు మన దేశంలోనే పల్లెసీమలకు పొమ్మని ప్రాధేయపడితే వెళ్ళకపోవడానికి సాకులు వెతికే మన వైద్యులకూ-పనిగట్టుకుని ఖండాంతరం వెళ్ళి ఇంకొక జాతివారి బాధ నుపశమింపజేసిన ష్వెయిట్జర్‌కూ ఎంత వ్యత్యాసం!

"పైకి, పైపైకి
నీ స్వప్నాలతో, నీ కోర్కెలతో
ఇంకా ఇంకా పైకి
నీ సేవాశయం వైపుగా.... పో!
ఇంకా పైపైకి
మేఘాలు గుమికూడే చోటికి
ఆ ఎత్తుపైకి
నీ విశ్వాస నక్షత్రం వెలుగు
సాయంతో
సాగిపో!"

-అన్న కవితను విద్యార్థి దశలో పటం కట్టి తన మేజా పైగా వేలాడదీసిన ష్వెయిట్జర్ తన జీవితాన్ని అలాగే నిండుగా జీవించాడు. సాఫల్యం, సార్థక్యం దండిగా చేకూరాయి ఆయన జీవితంలో.... అనేకానేక గౌరవాలు వచ్చి ఆయన పాదాల దగ్గర వర్షించాయి. జూరిచ్ విశ్వవిద్యాలయంవారి గౌరవ డాక్టరేట్, ఫ్రాంక్‌ఫర్ట్‌వారి "గెతె పురస్కారం", ప్రాగ్ (జెకొస్లొవేకియా), ఎడింబరో (స్కాట్లండ్) విశ్వవిద్యాలయాలవారి గౌరవ డాక్టరేట్‌లు, శాంతి బహుమతి, ఫ్రెంచ్ అకాడమీ అధ్యక్ష పదవి-ఇవన్నీ ఆయనను వరించిన గౌరవాలలో కొన్ని మాత్రమే. కష్టం వచ్చినప్పుడు కుంగనట్లుగానే, అంతర్జాతీయంగా ఖ్యాతి, గౌరవం వచ్చినప్పుడు పొంగిపోని ష్వెయిట్జర్ భగవద్గీతలోని సూక్తిని గుర్తుకు తెస్తాడు. అంతేకాదు, భగవద్గీతలోని 'కర్మసన్యాసం' మీద ఆయన చక్కటి వ్యాఖ్య రాశాడు. ఆ భావం జీర్ణించుకున్నవాడు గనుకనే గెతె పురస్కారం అందుకున్నాక (1932) తన

ప్రసంగంలో ఆయన-ప్రతీవ్యక్తి ఆలోచనా పరుడవాలి, అంతేకాదు, కార్యశీలి కూడా కావాలి" అని ఉద్బోధించాడు.

ఇంతటి ఎడతెరిపి లేని కార్యకలాపాల మధ్య ఆయన 1935 లో తన 60 వ పుట్టినరోజు సందర్భంగా, కొలంబియా కంపెనీ వారడుగగా "బాక్" సంగీతాన్ని ఆర్గాన్ మీద వాయించి అనేక రికార్డింగ్‌లు చేశాడు!

తన రచనలలో అల్పశబ్దములనుండి అనల్ప అర్థములను సాధించినట్లే చర్చివేదికమీద నుండి తన ప్రసంగం చిన్నదిగా, అయినా భావగర్భితంగా వుండడానికి యత్నించినట్లే-ష్వెయిట్జర్ తన ఆయుస్సులోని సంవత్సరాలనుండి ఎంతటి జీవితాన్ని పిండుకున్నాడో అన్పిస్తుంది. కీర్తిశిఖరాల సధిరోహించి, 1951 లో ఒకసారి ఫ్రాన్స్‌కు వస్తే, అక్కడ పాత్రికేయుల గోష్ఠి, సన్మానాలు అయ్యాక ఆయన-"చకచక తన సూట్‌కేసులను మోసుకుంటూ వెళ్లి మూడవ తరగతి పెట్టెలోకి ఎక్కి-కూచున్నాడ"ట!! ఇంతటివాడూ వాళ్ళ వూళ్ళో ఎవరింట్లోనన్నా ఆర్గాన్ వాయిద్యం పాడయిందని తెలిస్తే నడుచుకుంటూ వెళ్లి మరమ్మత్తు చేసిపెట్టి వచ్చేవాడట! అంచేతే "తరువు లతిరసఫలభారగురుత గాంచు" నన్నాడు భర్తృహరి.

ఇంత నిండుగా పంటలు పండించిన ఈ ఆదర్శ జీవి చదివిన చదువులలో కెల్ల మర్మం ఏమిటి అంటే "ప్రాణం పట్ల, తోటి ప్రాణిపట్ల గౌరవమే నీతి. పిపీలికంనుండి అనంత విశ్వందాక విస్తరించిన ప్రాణిపట్ల గౌరవం వుండాలి. ఇందులో దేనికయినా హాని కల్గించాల్సిన అవసరం వస్తే అది తప్పనిసరా అని ఆలోచించాకనే ఆ పని చేయాలి" అన్నాడు ష్వెయిట్జర్. "ప్రతి ప్రాణి పట్ల కారుణ్య భావం జాలువారనిదే ఏ నీతీ, ఏ ధర్మమూ కూడా పరిపూర్ణం కానేరదు" అని నిర్వచించాడాయన.

"మన ఆలోచనలంత ఎత్తుకు మన జీవితం ఎదగాలి. లేకపోతే మన జీవితాల స్థాయికి మన ఆలోచనలు దిగజారతాయి. హేతువాదం అన్నది చాల ఇరుకైన దారి. అది కొద్దిదూరం తర్వాత అంతమవుతుంది. కాని విశ్వాసం అలాకాదు. హేతువును దాటి అనంత దూరాలకు తీసుకెళ్ళే శక్తి దానికి వుంది.... సర్వ ప్రాణికోటిపట్ల కారుణ్య భావం ద్వారా మనం నిజంగా వసుధైక కుటుంబం కాక విశ్వైక కుటుంబంలో సభ్యుల మవుతాము. ఆ విధంగా సర్వ విశ్వాన్ని ఆవరించేదే నిజమైన మతం, ధర్మమూను. ఈ ప్రపంచాన్ని అధిగమించడం మన ఆధ్యాత్మిక ఆశయం. సర్వప్రాణుల పట్ల "కరుణ-గౌరవం" అనే ధర్మం ద్వారా ఈ ఆశయం సిద్ధించి మనలో మనకు శాంతి ఏర్పడడమే గాక-మనకు ఒకానొక గంభీరమైన, చైతన్యవంతమైన విధంగా భగవత్ సాక్షాత్కారం లభిస్తుంది" అన్నాడు జీవితపు పొలాన్ని అనేక హలాలతో దున్ని ఇబ్బడిముబ్బడిగా పంటలు పండించి జగతికి పంచిపెట్టిన ఆ విశ్వహాలికుడు! ❊

జ్యోతి

(సచిత్ర మాసపత్రిక)

యాజమాన్యం, తదితర వివరాలు

ఫారం 4 (8వ నిబంధన ప్రకారం)

ప్రచురణ స్థలం :	హైదరాబాదు
ఎంతకాలానికొకసారి :	నెలకొకసారి
ముద్రాపకుని పేరు :	పి. రామకృష్ణ
జాతి :	భారతీయుడు
విలాసం :	1—8—4/1/1, చిక్కడపల్లి హైదరాబాదు-500 020
ప్రకాశకురాలి పేరు :	శ్రీమతి వి. లీలావతి
జాతి :	భారతీయురాలు
విలాసం :	1—8—4/1/1, చిక్కడపల్లి హైదరాబాదు-500 020
సంపాదకురాలి పేరు :	శ్రీమతి వి. లీలావతి
జాతి :	భారతీయురాలు
విలాసం :	1—8—4/1/1, చిక్కడపల్లి హైదరాబాదు-500 020
పత్రిక యజమానురాలు :	శ్రీమతి వి. లీలావతి

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేస్తున్నాను.

1—3—1981
హైదరాబాదు

(సం.) వి. లీలావతి



డాక్టర్ కె.వి.కృష్ణకుమారి

మనిషిలో దేవుడు

"మీరింక రెస్ట్ తీసుకోండి స్సార్.... కనీసం గంటైనా పడుకోండి-మళ్లా ఎమర్జెన్సీ-ముంచుకొస్తుందో ఏమో-" సిస్టర్ వంక కృతజ్ఞతతో చూస్తూ- నీరసంగా నవ్వాడు డాక్టర్ జగన్నాథరావు.

"రెండున్నర దాటింది సార్.... మధ్యాహ్నం నుంచీ ఊపిరి కూడా తీసు

కోకుండా పని చేస్తున్నారు మళ్ళా...."

నమ్మకంగా తనని అంటి పెట్టుకునే, తల నెరిసిన వార్డ్‌బాయ్ వంక చిరు నవ్వుతో చూశాడు.

అలసటెరుగని అతని నవ్వుని అనూహ్యమైన భావాలెన్నో కారు మబ్బుల్లా కమ్ముతూనే వున్నాయి.

డాక్టర్ జగన్నాధరావు గారు-ఈ యుగంలో పుట్టాల్సిన మనిషి కాదు. అంతా వ్యాపారమయమై-ప్రాణానికీ-డబ్బుకీ లంకె వేసే స్థితికి దిగజారిన ఈ పవిత్ర వృత్తిలో వుండాల్సిన మనిషి కాదంటారు తెల్సిన వాళ్ళు. "అందర్నీ బ్రతికించాలనే తాపత్రయ యే గానీ తనూ-తన వాళ్లూ కూడా బ్రతకాలే-ఎలా బ్రతుకుతారు అన్న ఆలోచన కూడా లేని అమాయకుడను" కుంటారు చాలా మంది—

"ఉండకూడని లక్షణాలన్నీ వీడిలో వున్నాయి. ఒకటి-మితి మీరిన దయ. అది చెద పురుగులా నిన్నే తినేస్తుందిరా అంటే విన్పించుకోడు. రెండు—జాలి. ఎంత మంది మీదని జాలి చూపిస్తావయ్యా-అసలు నీకు తెలీదేమో—కర్కశంగా మాట్లాడి - దులపరించుకు పోయేవాడే - ధన్యుడు. నీలా జాలిపడుతూ అందరి గాధలూ వింటూ-దానాలు చేస్తూ కూర్చున్నావంటే-నిజంగానే నీ హార్ట్ ఎన్లార్జ్ ఐపోతుంది. నీ జేబు ఖాళీ ఐపోతుంది. గుండెను కుదించటం నీ చేతకాదు. జేబును నింపుకోటం నీ జాతకంలోనే వుండదు. ఎందుకంటే ఆ బుద్ధి నీలో పుడుతుందన్న ఆశలేదుకనుక.

మూడు—స్వార్ధాన్ని మరచి పని చెయ్యటం. ఇది మటుకు చాలా తప్పు. ఎవడి స్వార్ధాన్ని వాడు చూసుకోలేకపోవటం క్షమించరాని నేరం. నీలో నిస్వార్ధాన్ని ఇతరుల స్వార్ధం దారుణంగా తినేస్తుంది. అంటే 'నిన్నే' నన్న మాట. స్వార్ధమెరుగని వాడు అప్రయోజకుడై మనును. అదీ స్వల్ప కాలం.

నాలుగు—ఎవరి కోసమో శ్రమపడటం ఎందుకు? ఎందుకు పడాలి? వాళ్ళేమవుతారని? జలగల్లా రక్తాన్ని పీల్చే అవకాశ వాదులేగానీ అవసరానికి సాధనంగా ఉపయోగించుకుని కనీసం కృతజ్ఞతను చూపించాలన్న ఇంగితం కూడా లేని కృతఘ్నులేగానీ, నీ వల్ల ఉపయోగం పొందినవాళ్లుగానీ-నీ దయవల్ల బ్రతుకుతున్నవాళ్లుగానీ-ఒక్కసారైనా నీ గురించి ఆలోచిస్తారంటావా?-నీ శ్రమకు ప్రతిఫలాన్ని అందించగల స్తోమత వుండీ-మొహం చాటేసే దుర్మార్గులకోసం ఎందుకీ అనవసర శ్రమ.

ఐదు—గవర్నమెంట్ జీతమిస్తోంది కనుక పని చెయ్యి. అదీ-నీ ఆరోగ్యం చూసుకుంటూ, ముందు చూపును పెంచుకుంటూ పని చెయ్యి. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇతరుల ఆరోగ్యంకోసం ఆలోచించు. నీ ఆరోగ్యం చెడిపోయాక ఏ ఆరోగ్య వంతుడూ నిన్ను మామూలు మనిషిని చెయ్యలేడు.

ఆరు—డబ్బు విలువ ఇప్పటికైనా తెల్సుకో. నీలో వున్న ప్రతీ రక్తం



బొట్టునీ ఉదారంగా వాడుకుంటూ దాని రుచి మరిగినవాళ్లు నీ చుట్టూ వున్నారు. నీ రక్తంలో ప్రతీ అణువు ఎంతో పవిత్రమైంది, ఎంతో విలువైంది. అపాత్రదానం చేస్తున్నావు.

ఏడు—ఇంత మంచితనం కూడదురా. ఇన్నేళ్లు జనం కోసం ఇంతగా శ్రమదానం చేస్తున్నావు. అందరూ వంది మాగధుల్లా నీ చుట్టూ చేరి భజన చేస్తున్నారు. బాగానే వుంది. ఏదో క్షణంలో ఏదో బలహీన క్షణంలో నీ మంచితనాన్ని అపార్ధం చేసుకునే క్షణమంటూ ఏదైనా రావచ్చు. అప్పుడీ పెద్ద మనుష్యులందరూ బురఖాలు తీసేస్తారు తెల్సా. స్వతస్సిద్ధమైన జంతు రూపాలతో నిన్ను చిత్రవధ చేసి మరీ చంపుతారు తెల్సా. అప్పుడు నీకంటూ ఏం మిగుల్తుంది?

నీ కంటూ మటుకు మిగిలేదే మంటుంది.

ఎనిమిది— ..

శ్రేయోభిలాషుల హెచ్చరికలన్నీ చిరు నవ్వుతో తీసి పారేస్తారాయన. కారణం. "వాళ్ళు" చెప్పిన గుణాలన్నీ తనలో - వేళ్లు పాతుకు పోయాయి. ఎంత కష్టపడినా పెకిలించటం అసాధ్యం. నరనరానా జీర్ణించుకుపోయి వున్నాయి. ప్రతీ రక్త బిందువులోనూ-అందులోని ప్రతీ అణువులోనూ-స్వతస్సిద్ధమైన గుణంతో కల్సిపోయి వున్నాయి.

అవిలేని తను లేడు—

తను లేక పోతేనే అవి వుండవేమో.

అందుకే- జగన్నాథరావుగారు ఇప్పుడు ఈ కాలంలో పుట్టాల్సిన మనిషి కాడు.

బ్రతికించటమేగానీ, బ్రతక నేర్చటం తెలియని మనిషి.

"సిస్టర్ ఆ బేబీకి మళ్ళా ఫిట్స్ వస్తే..."

"పెరాల్‌డిహైడ్ ఇస్తా సార్-"

"సిస్టర్.. ఆ మధుసూధనరావ్‌కి- గుండె జబ్బేలేదూ ఏమీ లేదు. అంతా ఫంక్షనల్...."

"....సర్....వాళ్లారికే గొడవ చేసినా-సమాధానపరుస్తాం.

ఇప్పటి దాకా వీళ్ళతోనే సరిపోయింది....ప్లీజ్ - రెస్ట్ తీసుకోండి సార్-"

జగన్నాథరావుగారి పెదాలు తృప్తితో విచ్చుకున్నాయి.

యాభై పడిలో పడుతున్న ఆయన వయసూ, సర్వీసు దృష్ట్యా చూసినా-ఇలా నైట్ డ్యూటీస్ చెయ్యాల్సిన అవసరం లేదు. ఇంట్లో విశ్రాంతి తీసుకోవచ్చు. తీరిగ్గా, ప్రశాంతంగా. భార్యా పిల్లల్తో కాలక్షేపం చెయ్యచ్చు—

కానీ-ఆయన ఒక లక్ష్యానికి అంకితమైన వ్యక్తి.

బాధ్యతను - చివరి దాకా - బాధ్యతాయుతంగానే - నెరవేర్చాలనే నియమం వున్న మనిషి.

విరామ మెరుగని వృత్తి నేర్పిన మానవత్వంలో - వృత్తి చూపించే మానవత్వంలో - వృత్తిలో కన్పించే మానవత్వంలో నిండా మునిగిపోయిన మనిషి.

విశ్రాంతి అన్న పదానికి అర్థాన్ని మర్చిపోయాడు.

మానవత్వపు విలువలు వెదుకుతూ ముందుకు సాగిపోతూనే వున్నాడు.

"సార్-మంచినీళ్లు తేవాలా సార్-"

పక్క సర్దుతూ-వినయంగా నిల్చబడ్డాడు నీడ లాంటి వార్డ్ బాయ్ శంకరయ్య.

"నేను తీసుకుంటాగానీ నువ్వు కాసేపు పడుకోమరి."

బలవంతంగా అణచిపెట్టుకున్న నిస్సత్తువ వెల్లువలా కమ్మేసింది.

గుండెను ఎవరో పట్టినట్లయి బరువుగా అన్పిస్తోంది.

ఫాన్ తిరుగుతున్నా ముచ్చెమటలు పట్టిన బాబుగారి వంక గాభరాగా చూశాడు శంకరయ్య.

"ఏం బాబూ కాసేపుండేదా?"

"వొద్దొద్దు....నువ్వెళ్లు "

శంకరయ్యని పంపించి బోల్టు వెయ్యబోతూ మరోసారి అన్నాడు.

"చూడూ... ఆ కేసులు....—"

"చిత్తం బాబూ -"

గది చల్లగా వుంది. మనసు వేడిగా వుంది.

గుండె మంచులా వుంది. అది గడ్డ కట్టుకుపోతున్నట్టుంది.

నిస్సత్తువ కళ్ళముందు చీకటిని పేరుస్తోంది.

అర్థమౌతోంది జగన్నాథరావుగారికి.

ఆత్రంగా అప్రయత్నంగా జేబులు వెతుక్కున్నారు. ఎప్పుడూ వెంట వుండే బిళ్ళలు—మర్చిపోయాడు....

చీరిన బాధ-జీర

ఉంగటం తెగిన చెప్పు మోస్తున్న
జీవితం భుజాలమీద భారంగాకాళ్ళు,
ఎండకి తార్రోడ్డుమీద కరుగుతూ
ముప్ఫై ఎనిమిది గ్రీష్మాల
ఖర్వాటుడ్ని—
సమాధానాలు దొరకవని తెలిసున్న
ప్రశ్నల్ని,
నా తలచర్మం కింది స్పాంజిలో
ఇంకిస్తూ
సానుభూతి భుజాల మీద
నిట్టూరుపు ల్నంటించి
సమస్యల్ని పొగలు
మింగుతాయని, వార్షిమ్
జేబులోంచి పొగ
గొట్టాల్ని నిలబెట్టి
పెదాలమీద
పొగ
బ్రోంకియల్ ట్రీని ఆక్రమించి
గొంతు మడతలో చిక్కుకుని
ఊడక
ఊగుతూ
ఊపూపుతూ, నాలిక మీద
టేస్ట్ బడ్స్ ఎండి,
ఎక్కడో
నేను
చితికి చతికిలపడి, నా
కాళ్ళు నడుస్తూనే వుంటాయ్
సైగల్ గొంతు చీరిన బాధల జీరలా

— భైరవయ్య

కర్తవ్యం హడావుడిలో, పని వత్తిడిలో—

అతి ప్రయత్నం మీద మంచంమీద పడుకున్నా ప్రాణమెటో తేలిపోతున్నట్టుంది.

మరుక్షణంలో తలుపులు కొడుతున్న చప్పుడు!

హడావుడిగా లేవబోయిన ఆయన గుండెలో ఏదో కలుక్కుమంది.

తలుపు మీద చప్పుడు ఎక్కువగా విన్పిస్తోంది.

దాంతో బాటే—శంకరయ్య ఘర్షణా విన్పిస్తోంది.

గొంతు తడారిపోతుంటే నాలు గుక్కలు నీళ్ళుత్రాగి విధిలేనట్టు తలుపు తియ్యబోయారు.


కంటి ముందు చీకటిని చీల్చుకుంటూ వెలుగులాంటిదేదో కన్పించింది.

"ఎవరూ—"

తప్పు చేసినట్లు తలదించుకున్నాడు శంకరయ్య.

"బాబూ....ఆ ఫిట్సు వచ్చే పాప తండ్రిట, ఇప్పుడే ఊర్నుంచొచ్చాట్ట. పాప మగతగా వుంటే మీరు చూడకుండా నిద్రపోతున్నారని గొడవ పెడుతున్నాడు....

"....అవును పాప వొళ్ళెరక్కుండా పడుంది. మీకేదీ పట్టనట్టు తలుపులు బిడాయించుకున్నారు.... కొట్టీ కొట్టీ మా చేతులు పోయాయి....ఓ సారొచ్చి పాపను చూడండి—"



డాక్టరంటే తన క్రింద నౌఖరన్నట్టు గదమాయించి మరీ అడుగుతున్నాడు పెద్ద మనిషి.

"ఆ మత్తు, ఇంజక్షన్ వల్లయ్యా బాబూ-చెపితే విన్పించుకోవేం....

ఇప్పటి దాకా డాక్టరు గారు కేసు చూసి ఇప్పుడే పడుకున్నారు...."

సిస్టర్ డాక్టర్ వైపు వకాల్తా పుచ్చుకున్నట్టు మాట్లాడుతుంటే ఆ పెద్ద మనిషికి చిర్రెత్తుకొచ్చింది.

"ఐతే పిల్లను చూడరా ... ప్రాణం పోయినా ...."

అతి కష్టం మీద రాబోయి ఆగిపోయారు జగన్నాధరావు గారు.

"....ప్రాణానికి ప్రమాదం లేదు.. ఇంజక్షనిచ్చాం కదా....కదిలించకూడదు .... మళ్లా ఫిట్స్ వస్తే చెప్పండి...."

బలవంతాన వొత్తి పలుకుతున్న డాక్టర్ని ఒక త్రాగుబోతును చూసినట్టు చూశాడా పెద్ద మనిషి—

"మీరు పడుకోండి సార్...."

సిస్టర్ తలుపు వెయ్యటమూ, అతను అసహ్యంతో కాండ్రించటమూ ఒకే సారి జరిగాయి.

బోల్టు వెయ్యటం కూడా మరచి అచేతనుడై పోయారాయన.

బరువుగా అడుగులు వేస్తూ మంచం

వైపుకు నడిచాడు.

కొంత సేపటికి ...

మళ్లా గుమ్మం దగ్గర గొడవ విన పడుతోంది.

శంకరయ్యని మింగేసేలా మాట్లాడు తున్నాడింకో పెద్ద మనిషి.

"కాస్త మెల్లిగా మాట్లాడవయ్యా బాబూ...."

శంకరయ్య అభ్యర్ధన గాలిలో కల్సి పోయింది.

"మెల్లి గేంటయ్యా-మెల్లిగా - ఆడు గుండె జబ్బొచ్చి సస్తే మీరూ - మీ డాట్రూ కటకటాల ఎనక్కెల్లి పోవాల. అర గంట కాడినుంచీ సూత్తుండా-మా వోడికి గుండె నెప్పి తగ్గే లచ్చనాలేమైనా వున్నయ్యా?—సూడ లేక మా వోల్లు సత్తున్నారు గానీ ఆ డాట్రు అయిగా తొంగుండాడే. తొంగో టానికిటయ్యా డూటీలు సేసేది....ఇంటికాడి కెల్లి తొంగోమను. శాసివితంగా తొంగో మను. మల్లా ఆడ్నీడికి రానీ కుండా సేత్తా. మినిట్టరు మా బామ్మరిదే. ఓయ్...."

దూకుడుగా వుంది వ్యవహారం.

జగన్నాధరావు గారి కళ్లు శూన్యం లోకి చూస్తున్నాయి.

వొళ్ళంతా మంచు ముద్దలా వుంది.

గుండె మీద కొండని విడిచి పెట్టి నట్టున్న బాధ అనూహ్యంగా వుంది.

విసురుగా లేచి వెళ్ళాలని వుంది.

అసహ్యంగా-అనాగరికంగా - అధి కార దర్పంతో వాగుతున్న ఆ నోటిని మూయించాలని వుంది.

ఏ గుండె జబ్బులేని వాళ్ళ ముద్దుల కొడుకు తెచ్చిపెట్టుకున్న భాగవతం కోసం గుండె జబ్బున్న, తను కేవలం వాళ్ళని శాంతిపరచటానికే తృప్తిపరచ టానికే విశ్రాంతి మరచి పాటుపడ్డానని అరవాలని వుంది.

చీటికీ మాటికీ కంగారుగా పిల్చే వాళ్ళ అధికార దర్పంతనకీరోజు కాస్త కూడా విశ్రాంతిని మిగల్చలేదనీ, శాశ్వత విశ్రాంతినే మిగుల్చుతోం దనీ చెప్పాలి. హాస్పిటల్ వాళ్ళు వాళ్ళకి యిలా అడ్డుపడేది—

తనకున్న గుండె జబ్బుకు జాలిపడి, తను నింపిన ఆప్యాయతకు, ఆపేక్షతో ఏదో చెయ్యాలన్న తపన పడి,

అంతే....అంతే.

ఇంక ఆలోచించలేకపోతున్న జగ న్నాధరావుగారి కళ్ళముందు అస్పష్ట మైన ఆకారాలు జాలిగా కదులుతు న్నాయి.

ప్రజాసేవ ప్రజాసేవ అంటూ ఆరో గ్యాన్నీ సర్వస్వాన్నీ ప్రజలపరం చేసినా ఆవగింజంతైనా విశ్వాసంలేని ప్రజలను తల్చుకుని తనని తిట్టుకుంటూ జాలిగా నవ్వుతోంది అర్ధాంగి లక్ష్మి.

అందరి పిల్లలూ తన వాళ్ళేనని పరపతి నుపయోగించి ప్రయోకుల్ని చేసినా శక్తి కొద్దీ పాటుపడి ఆత్మ తృప్తిని మిగుల్చుకున్నా కనీసం కృతజ్ఞత కూడా వాళ్ళ నుంచి ఆశించక పోయినా ఆ కృతజ్ఞత ఏనాటికైనా మిగిలి వుండి తమకు అన్నం పెడుతుందేమోనని అనాథలుగా చూస్తున్న పిల్లలు కన్పిస్తున్నారు....

కన్పించటంలేదు.

విసురుగా తలుపులు తెరుచుకున్నాయి.

"అసలీ డాక్టరున్నాడా లేడా గుమ్మంకాడింత గోల జరుగుతావుంటే నిమ్మకు నీరెత్తినట్టు పడుకున్నాడా? ఈడ్చించి బదిలీ సేయించి పారేత్తా"

అహంకారం మృగంలా మొరుగుతోంది.

మంచి తనం దేవతలా అదృశ్యమైంది.

అనుమానంతో శంకరయ్య, సిస్టరూ డాక్టర్ రూమ్ లోకి అడుగుపెట్టారు.

"...... ......"

"ఏందయ్యా..ఎల్లినోల్లేమయ్యారూ? ఆ డాక్టరసలు మడిసేనా అంట"

లోపల్నుంచొచ్చిన శంకరయ్య గుమ్మం ముందున్న జనాన్ని పిచ్చిగా చూశాడు.

"ఆయన మనిషికాదు బాబూ. అందుకే ఈ మనుష్యుల్లో వుండలేక వెళ్ళిపోయారు"

రెండు చేతుల్తో మొహాన్ని దాచుకుని భోరుమని ఏడ్చేశాడు.

వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తూనే వుంది సిస్టర్! ❋



తాడిమళ్ళ రామకృష్ణ

మినీకథ

భార్య

రాత్రి పది గంటలవుతోంది.

మొదటి ఆట సినిమా కూడా వదిలేశారు.

'నాన్న వచ్చేస్తే బావుండును!'

మరోసారి అనుకుంది మంజుల–మనసులో.

నాన్న ఇంటికి రాగానే జరగబోయే బీభత్సం తనకి తెలియంది కాదు!

రోజూ జరిగే భాగోతమే అది!

అయినా తను ఆ చిటపటలకు అలవాటు పడలేదు.

రానురానూ అమ్మకి మరీ మతి పోతోంది.

'పాపం! తెల్లవారకుండానే లేచి ఫైళ్లలో మునిగిపోతారు నాన్న. ఆ తర్వాత హడావిడిగా ఆఫీసుకు పరుగెడతారు. సాయంత్రం వరకూ తల త్రిప్పటానిక్కూడా తీరిక వుండని పనిట—ఆఫీసులో.

సాయంత్రం అవగానే క్లబ్‌కి వెడతారు నాన్న.

అదయినా రిలీఫ్ కోసం—ఆ ఫైళ్ళనుంచి! ఆ టెన్షన్ నుంచి! ఆ చిరాకుల నుంచి ఆ రొటీన్ నుంచి!

ఈ మాత్రానికే అమ్మ నానా రభసా చెయ్యాలా!

పాపం నాన్న ఎంత సర్ది చెప్పినా వినదు–

తన మొండి తనం తనదే!

తన వితండ వాదం తనదే!

తనకు నాన్నని చూస్తే జాలి.

అర్థం లేకుండా—

అర్థం చేసుకోకుండా—

అమ్మ అలా నాన్న మీద విరుచుకు పడటం, అందునా ఎదిగిన పిల్ల ముందు కీచులాడటం—

ప్చ్.........

మంజుల మనసు మండి పోతూంటుంది—తల్లి మీద.

* * * *

మంజుల మండి పడుతోంది—

ఆఫీసు అవగానే ఇల్లు చేరని భర్త మీద.

రాత్రి ఏ పదవుతేనోగానీ గూటికి చేరని రామారావు మీద.

'ఆఫీసు గొడవల్నుంచి, ఇంటి సమస్య నుంచి కొంచెం రిలీఫ్ కావాలే మంజూ! అందుకే ఆఫీసు అవగానే క్లబ్‌లో స్నేహితులతో సరదాగా గడిపి వస్తుంటాను.

ఇంత మాత్రానికే నువ్వు గొడవ చేస్తే ఎలా!'

బ్రతిమాలుతున్నాడు రామారావ్.

"ఆహాహా....రిలీఫ్‌ట రిలీఫ్! ఇక్కడ ఇంట్లో ఒక్కర్తినే చావాలి కాబోలు. అసలు ఇప్పుడు మాత్రం ఇంటికెందుకొచ్చారు? వెళ్ళి ఆ రిలీఫ్ క్యాంప్‌లోనే వుండండి." ఆవేశంగా అరిచింది మంజుల.

ఆ సమయంలో ఆమెకి తన చిన్నతనం గుర్తులేదు. ❋

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి రు. 116 పొందిన కథః

ఇలక్కయు

జె.సి.జోషి

ప్రేమకి వయస్సుతో నిమిత్తం లేదనే సంగతి వింతైన విషయమేమీ కాదు. శకుంతల ప్రేమలో పడేనాటికి దుష్యంతుడికినలభై దాటా యని అంటారు. అయితే ప్రేమకీ, రూపానికీ కూడా ఎటువంటి సంబంధమూ లేదంటే మాత్రం నా కెందుకో ఒప్పుకోబుద్ధికాదు. ప్రేమ గుడ్డి దనే నానుడిని నేనంగీకరించను. మనిషిని చూడ గానే మనకి కనిపించేది బాహ్యస్వరూపమేగాని వ్యక్తి గుణగణాలు, తెలివితేటలు, వెన్నలాంటి మనసు ఇత్యాదులు కావుకదా. ఏ ప్రేమ చరిత్ర తీసుకున్నా ఎవరూ అందవికారిని ప్రేమించినట్టు దాఖలా లేదు. అలా అని వేద మూర్తిని కురూపిగా అంచనా వేయడం కూడా అన్యాయమే.

నలభై యేళ్ళకే బాగా పల్చబడిన తల వెంట్రుకలు, పీలగా లోతుకు పీక్కుపోయిన దవడలు, కొంచెం విశాలమైన నుదురే అయినా అక్కడక్కడ కనిపించీ, కనిపించనట్టుండే స్ఫోటకం మచ్చలు, కళ్ళకింది మడతలు, ఆ మడతల్లో దాగిన చీకటి వలయాలు, వాటికింద కదలాడే చిరునీడలు, పైకి పొడుచుకువచ్చి నట్లుండే మెడకింది ఎముకలు-వేదమూర్తిని చూసినవాళ్ళకి వెంటనే అతనిపట్ల సుహృ ద్భావం కలగకపోవటానికి కారణం అతని ఈ బిలో ఏవరేజ్ ఆకారమే తప్ప మరోటికాదు.

ఎవరితోటీ ఎక్కువగా మాట్లాడే స్వభావం కాదు వేదమూర్తిది. అతనికీ నాకూ మంచి స్నేహం కుదరటానికి కారణం మా అభి రుచులు. ఒకవిధంగా చూస్తే నాదృష్టిలో వేద మూర్తి ఒక ఇంటలెక్చువల్ గా కూడా కని పిస్తాడు. ఆంత్రోపాలజీ దగ్గర్నుంచి ఆంటో నియోనీ సినిమాలదాకా, చీనా రాజకీయాల నుంచి చిన్నపిల్లల పెంపకంవరకూ ఏవిషయం మీదనైనా చర్చించగల పరిజ్ఞానం కలవాడు వేదమూర్తి. తరచుగా పత్రికలకు కథలూ, వ్యాసాలూకూడా రాస్తూవుంటాడు. నాకూ సాహిత్యంమీద కాస్తో కూస్తో ఆసక్తి వుండటం చేత అతనితో బాగా స్నేహం కుదిరింది. అయితే తన వ్యక్తిగతమైన విషయాలగురించి మాత్రం ఎప్పుడూ వేదమూర్తి నాతో చెప్పింది లేదు. సభ్యత కాదని చాలాకాలందాకా నేనూ అతని పర్సనల్ విషయాలగురించి అడగనూలేదు. నలభై యేళ్ళు కావస్తున్నా అతనింకా వంటరివాడనీ, శ్రీకాకుళం ఆవతల ఎక్కడో అతని దూరపుబంధువులు వుంటు న్నారనీ మాత్రమే తెలుసు నాకు. ఒకసారి మాత్రం చొరవచేసి అడిగాను! "ఇంకా పెళ్ళి చేసుకోలేదు ఎందు"కని? వేదమూర్తి కాసేపు మౌనంగా వున్నాడు. తరువాత చిన్నగా నవ్వి అన్నాడు.

"తనలో లేనిదాన్ని ఇతరుల్లో చూసి ఈర్ష పడతారు కొందరు. ఆరాధిస్తారు మరికొందరు. నేను ఈ రెండోతెగకి చెందినవాణ్ణి. సౌంద ర్యాన్ని పిచ్చిగా ఆరాధిస్తాను"

కొంత అర్థమైనట్టు అనిపించినా అతను చెప్పింది చాలా భాగం అర్థం కాలేదు నాకు.

"దూరంగా వుండి ఆరాధిస్తానే గాని సమీ పించి అందుకోవాలనుకోలే దెన్నడూ"

"ఎందుకని?" అడిగాను.

"పొందలేను గనుక"


వేదమూర్తి కాంప్లెక్సేమిటో నాకిప్పుడు బోధపడింది. తను అందంగా లేడు. తను కోరుకునే అందమైన తోడు తనకి లభించదు.

ఆ తరువాత ఆ విషయం గురించి మరి సంభాషణ సాగలేదు—

"నేను యామినిని ప్రేమిస్తున్నాను" అన్నాడు ఒక రోజు వేదమూర్తి ఆఫీసర్స్ కాంటీనులో కూర్చుని.

నేను టీ కలుపుతూ అదిరిపడ్డాను. యామినికి నిండా పాతికేళ్ళు కూడా వుండవు. ఆర్నెల్ల కిందటే మా బాంకిలో జూనియర్ ఆఫీసర్ గా చేరింది. పదిహేనేళ్ల సర్వీసు తరువాత స్టాఫ్ ఆఫీసరుగా ప్రమోట్ అయిన వాడు వేదమూర్తి.

మొదటిసారి ఆఫీసర్స్ కాంటీన్ లో యామి నిని చూసినప్పుడు చాలా అందమైన



రచయిత పరిచయం



పుట్టింది నెల్లూరులో, 38 ఏళ్ళ కిందట. పెరిగిందీ, పెరుగుతున్నదీ మద్రాసులో. ఇరవై యేళ్ళ నించీ కథలు రాస్తున్నాను. సుమారు 80కి పైగా వివిధ పత్రికల్లో నా రచనలు ప్రచురించబడ్డాయి.

వివాహం : అయింది. ఆవిడపేరు మల్లీశ్వరి.

సంతానం : ప్రభుత్వ పరిమితికి రెండింతలు. ఒక అబ్బాయి, ముగ్గురమ్మాయిలు. (నా కథలు వీళ్ళు చదవలేకపోతున్నారనే చింత. వీళ్ళకి తెలుగు రాదు.)

ఉద్యోగం : ఉంది. రిజర్వ్ బ్యాంకులో.

అభిరుచులు : మంచి సినిమాలు, మంచి సాహిత్యం, మంచి స్నేహితులు.

ఆశ : కాశీపట్నంలా, బీనాదేవిలా, రావిశాస్త్రిలా రాయాలని.

నిరాశ : వాళ్ళకున్న జీవితానుభవం నాకు లేదని, వాళ్ళలా రాయలేకపోతున్నానని.

—జి. సి. జీవి.

అమ్మాయి అని అనిపించింది నాకు. నిజానికి ఈ పదేళ్ల సర్వీసులో అంత అందమైన అమ్మాయిని చూట్టం అదే ప్రథమం.

ఉడీ అలెన్ సినిమాల్ని గురించి మాట్లాడుతూన్న వేదమూర్తి చటుక్కున మాట్లాట్టం మానేసేడు. అతని చూపుల దిక్కుకి దృష్టి సారించాను. తన బాచి ట్రైనీ ఆఫీసర్స్‌తో అప్పుడే కాంటీనులోకి ప్రవేశిస్తోంది యామిని. మంత్రబద్ధునిలా కన్ను ఆర్పకుండా ఆమె కేసి చూస్తున్నాడు వేదమూర్తి. యామిని మమ్మల్ని దాటుకుని వెళ్ళి చివరి టేబిల్ ముందు కూర్చుంది. "ఉడీ అలెన్‌ని గురించి ఏదో చెపుతున్నావ"ని అడిగాను అతన్ని ప్రస్తుతంలోకి మళ్లిస్తూ. ఉలిక్కిపడ్డట్టయినాడు వేదమూర్తి.

"ఆఁ... 'లవ్ అండ్ డెత్' చూశావా నువ్వు?" అడిగాడు.

"లేదు."

"అయితే అలెన్‌ని గురించి చెప్పి లాభం లేదు. ముందు ఆ సినిమా చూసిరా" అని సిగరెట్ వెలిగించి "వెళ్దామా" అంటూ లేచాడు. వేదమూర్తి. కుర్చీలోంచి లేస్తూ యామిని వేపు వో సారి చూశాను. నవ్వుతూ తన ఫ్రెండ్స్‌తో ఏదో మాట్లాడేస్తూ టీ కలుపుతోంది యామిని-దాదాపు ప్రతిరోజూ కాంటిన్‌లో యామిని ప్రత్యక్షమయ్యేది. సరిగ్గా

మేము కాంటీన్‌కి వెళ్ళే వేళకి అక్కడ టీ చప్పరిస్తూనో, అప్పుడే లోపలికి ప్రవేశిస్తూనో కనిపించేది. టీ తీసుకుంటున్నంతసేపూ అప్పు డప్పుడూ వేదమూర్తి ఆమెని కన్నార్పకుండా చూస్తూనే వుండేవాడు.

ఒకటి రెండుసార్లు యామిని చిత్రంగా అతనికేసి చూసి, చూపులు మరల్చుకోవటం కూడా గమనించాను నేను.

ఆ రోజు...

నేను టీ డికాక్షన్ కప్పులోకి వంపుకుని పాలు కలుపుతున్నాను. అప్పుడే తన క్కోట్రైనీ అయిన వేదవల్లితో ప్రవేశించింది యామిని. పసుపురంగు బెరీన్ చీర అదేరంగు జాకెట్టులో పసిడిబొమ్మలా మెరిసిపోతూవుంది. కాంటీను లోని అన్ని కుర్చీలూ దాదాపు నిండిపోయి వున్నాయి. వాళ్ళు మా టేబిల్ దగ్గరికే రావాల్సి వచ్చింది. ఎదురెదురుగా వున్న కుర్చీల్లో నా పక్కన వేదవల్లి, వేదమూర్తిపక్కన యామిని కూర్చున్నారు.

దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ రాసిన "వాటీస్ లివింగ్ అండ్ వాటీస్ డెడ్ యిన్ ఇండియన్ ఫిలాసఫీ" పుస్తకం గురించి చెపుతూన్న వేదమూర్తి చటుక్కున ఆగిపోయి ఒకసారి యామినికేసి చూశాడు. అదే లోతైన చిక్కని చూపు! మెరుపులా ఆమెకూడా అతనికేసి ఒకసారి చూపు విసిరి వేదవల్లితో ఏదో మాటలు కలిపింది. వేదమూర్తి నా ముందున్న ట్రేని ముందుకు లాక్కుని అల వాటుకు భిన్నంగా తనే టీ కలపటం ప్రారంభించాడు మౌనంగా. "దేవీప్రసాద్ గురించి ఏదో చెపుతూ మధ్యలో ఆపేశావు" అంటూ గుర్తుచేశాను అతని మౌనాన్ని భరించలేక.

"అతనిదే, 'లోకాయత' చదివేవా?" అడిగాడు వేదమూర్తి,

"లేదు."

"అది చదవందే అతని ఇండియన్ ఫిలాసఫీ ఎనాలిసిస్ అర్థం కాదు" అంటూ అక్కడితో ఆ సంభాషణ తుంచేశాడు వేదమూర్తి.

వేదవల్లి వేదమూర్తికేసి చూసింది. అంతకు ముందు అతని సెక్షన్‌లో ట్రైనింగ్ అయింది గనుక కొంత పరిచయం వుంది ఆమెకి.

టీ ట్రేలోంచి చటుక్కున తలెత్తి "ఇంకా బాంకింగ్ డిపార్టుమెంటులోనే వుంటున్నారా?" అని అడిగాడు వేదమూర్తి ఆమెని.

"అవును... మీరు?" అంది వేదవల్లి.

"అదే... ది సేమ్ పబ్లిక్ డెట్" చెప్పాడు వేదమూర్తి.

"ఏ సెక్షన్?" అడిగింది వేదవల్లి.

"ఇప్పుడు న్యూలోన్స్‌లో వుంటున్నాను"


"చక్కా హేపీగా వుంటుందనుకుంటాను?"

"కొంచెం హేపీగానే వుంది" అనేసి చటుక్కున యామినికేసి తిరిగి "వేరార్ యు బీయిగ్ ట్రైన్డ్ నౌ" అన్నాడు వేదమూర్తి. ఆ ప్రశ్నకు యామినితోబాటు నేనుకూడా విస్తుపోయాను. మౌనంగా టీ చప్పరిస్తోన్న యామిని తలెత్తి అతనికేసి చిత్రంగా చూసింది ఒక్క క్షణం. ఆ తరువాత చెప్పింది "ఎక్స్ఛేంజ్ కంట్రోల్" వేదమూర్తి ముఖంలో ఏదో పెద్ద రిలీఫ్ ఫీల్ కావటం గమనించాను. ఆ తరువాత కాసేపు డిపార్ట్ మెంటల్ ట్రైనింగు పూర్తయిన తరువాత ఏ సెంటర్‌లో పోస్టింగయ్యేది మొదలైన ప్రశ్నల రూపంలో యామినితో మాటలు కలిపాడు వేదమూర్తి.

ఆ సాయంత్రం నన్ను 'మాడిస్'కి తీసి కెళ్లాడు. పర్మిట్ రూంలో కూర్చున్నాము. రెండు ప్రీమియర్ బీర్లు మా ముందుంచి ఓపెన్ చేసి వెళ్లాడు బేరర్.

"ఇన్నేళ్ళ సాహచర్యంలో చొరవచేసి నీవై ఒక అమ్మాయితో అందునా యామిని లాంటి అమ్మాయితో, ధైర్యంగా మాట్లాడటం ఈ రోజే చూశాను. కంగ్రాట్స్ వేదమూర్తీ" అన్నాను బీర్ని గ్లాసులోకి వంపుతూ.

"థాంక్స్" అని చిన్నగా నవ్వేడు వేదమూర్తి. కొద్ది నిమిషాలు మౌనంగా బీరు చప్ప



రిస్తూ కూర్చున్నాం ఇద్దరం.

"నేను ఆ అమ్మాయిని ఆరాధిస్తున్నాను. ఐ సింప్లీ అడ్మైర్ హర్" అన్నాడు వేదమూర్తి సిగరెట్ వెలిగించి.

ఎవరిని వుద్దేశించి ఆ మాటలంటున్నాడో అడగాల్సిన అవసరం లేకపోయింది నాకు. "అంటే నువ్వు యామినిని ప్రేమిస్తున్నా నంటావా?" అన్నాను నేను కొంచెం ఎగతాళిగా.

"నాన్‌సెన్స్! ప్రేమకీ, ఆరాధనకీ చాలా తేడా మిస్టర్ గౌతమ్. నీకు తెలీదేమో". "చెబితే తెలుసుకుంటాను" కొంచెం వ్యంగ్యం ధ్వనించేలా అన్నాను.

"అందంగా వుండే దేన్నయినా ఆరాధించ వచ్చు, ఆ తృష్ణ వుండాలేగాని. అందమైన మనుషులు, గలగలపారే సెలయేరు, పచ్చని బయళ్లు, పచ్చని లోయలు, రంగులసూర్యాస్త మయాలు, గోదావరి ఇసుక తిన్నెలు, వెన్నెల నురగలు, అజంతా శిల్పాలు, ఇవన్నీ ఆరా ధించ తగినవే. ప్రేమించటానికీ ఆరాధనకూ చాలా తేడా వుంది. ప్రేమించటంలో పొందా లనే కోరిక ఇమిడి వుంటుంది. వెన్నెలనీ చంద మామనీ చూసి ఆరాధించగలం. పొందా లనుకోము" అని గ్లాసులో మిగిలిన బీర్‌ని ఒక్క గుక్కలో ఖాళీ చేసి లేచాడు వేదమూర్తి—

వేదమూర్తిలో క్రమంగా మార్పు రావటం గమనించాను. పదిహేను రోజుల కోసారైనా గడ్డం గీసుకోని అతను రోజు మార్చి రోజు షేవ్ చేసుకుని వస్తున్నాడు. మామూలు కన్న సిగరెట్ల సంఖ్య పెరిగింది: ఇప్పుడు వేదమూర్తి ఎదురు పడినప్పుడల్లా 'హలో' అని చిరునవ్వుతో పలకరిస్తోంది యామిని. పీలగా వుండే అతని మొఖంలో ఏదో కళ తళుక్కు మని మెరిసేది ఆ క్షణంలో. మధ్య మధ్య అతని చూపుల్లో చూపులు కలుపుతోంది యామిని. ఇలా ఎన్నోరోజులు గడవక ముందే ఒక రోజు అన్నాడు వేదమూర్తి:

"నేను యామినిని ప్రేమిస్తున్నాను."

ఒక్క క్షణం అదిరిపడ్డ నేను చాలా సేపటి దాకా ఏమీ మాట్లాడలేదు. కాంటీన్ దాదాపు ఖాళీ అయిపోయేదాకా కూర్చుండి పోయాము. దూరంగా వున్న టేబిల్ దగ్గర మాత్రం ఇద్దరు సీనియర్ ఆఫీసర్లు టీ తీసుకుంటు న్నారు మౌనంగా.

"నీవు భావుకుడివే కావచ్చు. నీలో రొమాంటిక్ టెంపరమెంట్ పాలు అమితంగానే వుండొచ్చు. అయినా ఇటువంటి విషయాల్లో మరీ ఇంత భావుకత్వం తగదు మూర్తీ, తరువాత చాలా బాధపడాల్సి వస్తుంది" అన్నాను చిన్నగా.

మొదటిసారి నన్ను అదోరకంగా చూశాడు వేదమూర్తి. బహుశా నేనలా నిర్మొహమాటంగా అంటానని అతనూహించి వుండడు.

"ఇంతకీ ఆమెకూడా నిన్ను ప్రేమిస్తోందా?" అడిగాను.

"అనే అనుకుంటున్నాను. అయినా ఇద మిద్ధంగా ఇప్పుడప్పుడే చెప్పలేను" అన్నాడు వేదమూర్తి.

"అసంభవం. యామిని నిన్నెన్నటికీ ప్రేమించదు. ప్రేమించలేదు. ప్రేమకి కళ్లున్నాయి" ఎలా అనగలిగానో అంత ఆవేశంగా. బహుశా నా అంతర్యంలో ఏమూలో పొంచివున్న అసూయ కావొచ్చు.

"సరే, నువ్వే చూస్తావుగా ఒకరోజు" అని లేచాడు వేదమూర్తి.

ఆ తరువాత కొన్నాళ్లు నన్ను పిలవకుండానే ఒంటరిగా కాంటీన్‌కి వెళ్ళేవాడు వేదమూర్తి.

ఒకటిరెండుసార్లు కాంటీన్‌లో అందరూ వెళ్ళిపోయేదాకా వేదమూర్తీ, యామినీ మాట్లాడుతూ కూర్చోవటం చూశాను. మరో విశేషం, యామినికూడా ఇప్పుడు ఒంటరిగానే వస్తోంది కాంటీన్‌కి.

ఆరోజు సాయంత్రం "బ్లూ డైమండ్"లో నా ముందువరుసలో కూర్చున్న వాళ్ళని చూసి నా కళ్లు బైర్లు కమ్మినట్లయింది. యామిని చేయి వేదమూర్తి చేతుల్లో వుంది. ఎందుకో అక్కడ వుండాలనిపించక సినిమా మధ్యలోనే బయటికొచ్చేశాను.

వేదమూర్తికీ నాకూ నడుమ పైకి లేచే పల్చని గోడ నాకు భరింపరాని అడ్డుగా తోచింది. దాన్ని పడగొట్టాలని తీర్మానించు కున్నాను. అందుకే ఒకరోజు సాయంత్రం అతణ్ణి బస్టాండులో కల్సుకున్నాను.

"సారీ మూర్తీ! ప్రేమ గుడ్డిది కాదన్నాను కాని అన్ని కళ్ళూ ఒకే దృశ్యాన్ని ఒకేలా చూడాలనే నియమం లేదన్న సంగతి ఆలోచించలేదు అప్పుడు. అందుకే "లైలా అందాన్ని మజ్నూ కళ్ళతో చూడు" అనే నానుడి పుట్టివుంటుంది. ఇప్పుడు నమ్ముతున్నాను. యామినీ ఈజ్ ఇన్ లవ్ విత్ యు. విష్ యు ఆల్ ది బెస్ట్" అంటూ స్నేహంగా అతని చేతిని నొక్కాను.

మళ్లీ మామూలు స్నేహం కలిసింది మా మధ్య. యామినికి నన్ను పరిచయం చేశాడు వేదమూర్తి. ఇప్పుడు ముగ్గురం కలిసే కాంటీన్‌కి వెడుతున్నాం. ఆ రోజు రెండు జళ్లు వేసుకొచ్చింది యామిని-అచ్చం కాలేజీ అమ్మాయిలా వుంది. ఈ అమ్మాయి ఆఫీసర్ కాబోతోంది అంటే నమ్మశక్యం కానట్టుగా వుంది. ఈ పసితనం, ఇంత లేత యవ్వనం, నలభై యేళ్ళ, కళ్లు లోతుకుపోయిన వేదమూర్తితో అంత చనువుగా, అంత ఫ్రీగా మెరిసే కళ్ళతో, మత్తువెదజల్లుతూ మాట్లాడే ఆ దృశ్యం నా కెందుకో అత్యంత అసహజంగా విభిన్న ప్రకృతులు కలిసి ఢీకొనబోతున్నట్లుగా ధ్వనించింది. అయితే ఇది కూడా కేవలం నా భ్రమ కావచ్చు. నాలో మొలకెత్తే ఈర్ష్యా బీజపు సూచనల తాలూకు సీతలు కావచ్చు.

మొదటి సారిగా యామినితో తనకి చనువేర్పడింది సిటీ బస్సులోనట. వేదమూర్తి ఆ సాయంత్రం సినిమాకి వెళుతున్నాడు. అదే



బస్సులో యామిని కూడా వుంది. మగవాళ్ళ సీట్లన్నీ నిండిపోయి వున్నాయి. ఆడవాళ్ళ వరసలో కిటికీ పక్కన కూర్చుంది యామిని. ఆమె పక్క సీటు ఖాళీగా వుంది. ఆమెకు దగ్గరగా నిలబడి 'హలో' అని పల్కరించాడు వేదమూర్తి.

"హలో! హౌ ఫార్?" అని అంది యామిని అందంగా నవ్వుతూ.

"సినిమాకి" అని చెప్పి "ఇఫ్ యూ డోన్ట్ మైండ్" అంటూ ఖాళీ సీటు కేసి చూశాడు వేదమూర్తి. "ఫరవాలేదు కూర్చోండి" అంటూ కొంచెం సర్దుకుని అతనికి చోటిచ్చింది యామిని.

ఆ మాటా ఈ మాటా కలిపాడు వేదమూర్తి. ఆమె గురించి అడిగాడు. అతన్ని గురించి కొన్ని వివరాలడిగింది యామిని.

"ఐసీ! అలాగా? ఐ డోంట్నో సో ఫార్. రెగ్యులర్‌గా రాస్తూ వుంటారా! ఏయే పత్రికలకి?" అంటూ తన ఆశ్చర్యాన్ని, కుతూహలాన్ని వ్యక్తపరిచింది.

ఛావర్స్ కాలేజీలో సి.ఎ.ఐ.ఐ.బి క్లాసులకి హాజరవటానికి వెళుతోంది బస్సులో. ఎల్.ఐ.సి. స్టాపులో దిగారు ఇద్దరూ.

"మీరూ రాకూడదూ నాతో సినిమాకి. సరదాగా వుంటుంది" చాలా మామూలుగా అడగ గలిగాడు మూర్తి.

"ఏ సినిమా?"

"జూలియా"

"గుడ్ మూవీ?"

"వెరీ గుడ్ మూవీ"

"అయితే పదండి" అంటూ అతని వెంట నడిచింది యామిని.

యామిని కేరళలో చదువుకుంది. పాల్ ఘాట్ సొంత వూరు. తల్లి చిన్నప్పుడే ఎవరితోనో లేచిపోయింది. తండ్రి మలేషియా వెళ్లి మళ్లీ రాలేదు. ఎప్పుడైనా డబ్బులు మాత్రం పంపుతూ వుంటాడు. పిన్ని, బాబాయిల దగ్గరే పెరిగింది యామిని. ఈ వివరాలన్నీ చాలా మామూలుగా, ఏవిధమైన సంకోచాలూ లేకుండా చెప్పింది. అలా మొదలైంది వాళ్లిద్దరి మధ్య చనువు.

వేదమూర్తి తనకి తెలిసినవన్నీ ఆమెకి చెప్పేవాడు. చాలా ఆసక్తిగా కళ్ళింతలు చేసుకుని ఓపిగ్గా వినేది యామిని.

"చూడండి. ఎంతసేపూ యీ మోడర్న్ ఫిక్షన్ చదువుతూ కూర్చుంటే లాభం లేదు. క్లాసిక్స్ చదవటం అలవాటు చేసుకోవాలి మీరు. క్లాసిక్సు టచ్ చెయ్యని జీవిత చిత్రణ, మానసిక విశ్లేషణ, సంఘర్షణ యీ మోడరన్ ఫిక్షన్‌లో కనిపించదు మీకు" అని టాల్‌స్టాయ్, డాస్టోవిస్కీ, స్టెండర్‌ల నవల లిచ్చి చదవమనే వాడు.

"మొదట్లో మీ పేరు విన్నప్పుడు చాలా చిత్రంగా ఫీలయ్యాను" అన్నాడొకరోజు.

"ఎందుకని?" అడిగింది యామిని ముద్దుగా.

"యామిని అంటే చీకటి కదా అర్థం. మీ శరీరం మీదగాని, ముఖంలోగాని ఎంత వెదికినా 'యామిని' కనిపించదు. పైగా వింత కాంతులీనుతూ మెరిసి పోతూవుంటారు మీరు" అన్నాడు మూర్తి.

"థాంక్యూ" అంది తృప్తిగా నవ్వి యామిని.

"మీరు కాదు. థాంక్యూ చెప్పాల్సింది నేను" అన్నాడు వేదమూర్తి.

"అదేమిటి మళ్ళీ!" చోద్యంగా కళ్ళు పైకెత్తి నవ్వింది.

"ఎంచేతనంటే మీరింత అందంగా వున్నందుకు. మీవి స్టన్నింగ్లీ బ్యూటిఫుల్ పేర్ ఆఫ్ ఐస్ అయినందుకు. మిమ్మల్ని పొగిడే అవకాశం నాక్కలిగినందుకు."

"యూ సిల్లీ" అంటూ అతని చేతిని మెత్తగా గిల్లింది యామిని.

ఇవన్నీ వేదమూర్తి ఎప్పటికప్పుడు నాతో చెపుతూవుంటే నాలో ఏమూలో సందేహం తొంగిచూసేది. వేదమూర్తి వూహాలోకంలో విహరిస్తూ తనచుట్టూ భ్రమల తెరలను అల్లుకోవటంలేదు కదా అని అనిపించేది నాకు అప్ప

వప్పుడూ. కాని ఎంత భావుకుడైనా అతను ఆ స్థితికి రాడనే నమ్మకంకూడా వుంది. పైగా యామిని అతనితో ఎంతో చనువుగా మాట్లాడటం ఆఫీసులో చూస్తూనే వున్నానాయె.

యామినికి ట్రైనింగు పూర్తి కావస్తోంది. తనకి మద్రాసులోనే పోస్టింగు రావచ్చని చెప్పింది ఒకరోజు వేదమూర్తితో. వేదమూర్తి కళ్ళు జిగేలుమనటం స్పష్టంగా కనిపించింది నా కా క్షణంలో.

చెల్లికి ఒంట్లో బావుండటంలేదని వుత్తరం వస్తే వారంరోజులు సెలవుపెట్టి బయలు దేరాను.

"నువ్వు తిరిగొచ్చేసరికి యామిని నా జీవిత భాగస్వామిని అయిపోయిందంటే ఆశ్చర్యపడ తేం" అని నవ్వుతూ సాగనంపాడు వేదమూర్తి నన్ను రైలెక్కిస్తూ.

"బెస్టాఫ్ లక్. యూ ఆర్ రియల్లీ గ్రేట్ వేదమూర్తీ" అంటూ అతని భుజం తట్టి రైలెక్కాను.

వారంరోజుల తరువాత తిరిగొచ్చిన నేను ఆఫీసులో పిడుగులాంటి ఆవార్త విని అదిరి పడ్డాను.

కొద్దినిముషాలు నా గుండెలు అమితవేగంతో స్పందించి అల్లాడిపోయినయ్.

ఆ క్రితంరోజు రాత్రి వేదమూర్తి తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు!

నా మస్తిష్కపు టంచులమీద భయంకరంగా మెరిసింది యామిని. ఆమె కోసం పిచ్చివాడిలా పరిగెడుతూ ఆఫీసంతా కలయ తిరిగాను.

ఆమె ఆ రోజు ఆఫీసుకి రాలేదని తెలిసింది.

ఆ మధ్యాహ్నం పోస్టులో నాకో పొడవాటి కవర్ అందింది. పైన ఫ్రం అడ్రెస్ కూడా లేదు. వణికే చేతులతో ఆతృతగా కవరు తెరిచాను. రెండు పెద్ద వుత్తరాలు విడివిడిగా;

"డియర్ గౌతమ్!

మరి కాసేపటికి నా గది చూరునుంచి వూయ్యాలలూగబోతున్నాను. భయపడకు ఇప్పుడు నన్నెవ్వరూ ఆపలేరు. నీవీ వుత్తరం చదివే వేళకి నాకు పోస్టు మార్టం పూర్తయిపోయి నా శరీరం హాస్పిటల్ లాబ్‌లో యాసిడ్‌లో భద్రపరచబడి వుంటుంది. నీకు తెలుసు నాకు అంత్యక్రియలు జరిపేవాళ్ళు కూడా ఎవరూ లేరని. అందుకే నా తరువాత 'నేను' వైద్య విద్యార్థులకైనా వుపయోగపడాలని నా శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేశాను. గుర్తుందా? ప్రేమకి కళ్లున్నాయి అనే వాడివి నువ్వు. నువ్వే గెలిచావు గౌతమ్! నేను ఓడిపోయాను. ఘోరంగా ఓడిపోయాను. అంత మాత్రానికే ఇంత ఘోరం తలపెట్టాలా అని అడుగుతావు నువ్వు. కాని అదంతే. కొండలు మీద పడుతున్నా కదలని కొందరు చిగురుటాకు తాకిడికి చలించి పోతారు.

— వేదమూర్తి

రెండో వుత్తరం విప్పాను. వేళ్ళు సరిగ్గా పట్టుకోలేకపోతున్నాయి వుత్తరాన్ని.

ఇంగ్లీషులో రాసి వుంది.

"వేదమూర్తి గారికి —

మీతో ఎలా చెప్పతమో తెలీక ఈ వుత్తరం రాసున్నాను. మొదటి చూపులోనే నాకెందుకో మీరు చాలా చిత్రంగా కనిపించారు. అతి త్వరలో మీరు నా మీద పెంచుకున్న ఆరాధనా భావాన్ని నేను అర్థం చేసుకోగలిగాను. ఆ రోజు ధైర్యం చేసి కాంటీనులో మొదటిసారిగా మీరు నన్ను పలకరించినప్పుడు నాకు ఆశ్చర్యంతోబాటు ఒకరకమైన సంతోషం కూడా కలిగింది. నేను చాలా అందంగా వుంటానని నాకు తెలుసు. మరీ అంత అందంగా వుండటం చేతనేనేమో చాలా మందికి నాతో మాట్లాడాలనీ, పరిచయం చేసుకోవాలనీ వున్నా ధైర్యంచేసి ముందుకు రాలేక పోయేవారు. నాతో స్నేహం చేయాలని కోరి వచ్చినవాళ్ళని నేనెన్నడూ తిరస్కరించింది లేదు. కానీ మీ విషయంలో మాత్రం నాకో చిత్రమైన భావన కలిగింది. అదే మీ పట్ల ఒక విధమైన 'జాలి'. ఎందుకో తెలీదు. మీరు నాతో మాట్లాడాలని ఎన్నోసార్లు ప్రయ

ఆత్మయొక్క విలువ ఎంత?


చాలా కాలము వెనుక ఒక బాటసారి చారిత్రాత్మకమైన రోమ్ పట్టణాన్ని దర్శించటం జరిగింది. రోమ్ చాలా ప్రాచీన పట్టణము. ప్రసిద్ధి చెందిన యీ పట్టణములో గుప్తపరచబడిన ధనమేదైన దొరుకుతుందేమోనని ఆశతో ఆ పధికుడు, సాధారణంగా అందరు పయనించే మార్గమువదలి, ప్రక్కకు తొలగి పోయి, ఒక ప్రాచీన రాజభవనముయొక్క శిథిలాలమధ్య నడచుచుండగ, ఒక రాయిని పరీక్షించుచున్న ఒకపల్లెవాడొకడు ఆ పధికునిదృష్టిని ఆకర్షించాడు. ఆ రాయి మామూలు రాళ్ళవలె లేదు. అందుకే ఆ పధికుడు ఐదు డాలర్లను, ఆ పల్లె వానికిచ్చి, ఆరాయిని ఆయన యొద్దనుండి కొని, తాను బస చేసిన స్థలమునకు వెళ్ళి దానిని పరీక్షించి చూచి అది ఒక విలువైన రాయని దానిని గుర్తించి, దానిని నిపుణత కలిగిన వర్తకుడొకనికి చూపగ, వాడు దానిని సీసర్ ఆగస్టస్ కిరీటముల్లోని ఒక విలువగల వజ్రముగా గుర్తించి దానిని 2,50,000 డాలర్ల విలువ కట్టాడు. దానియొక్క మెరుపు, అందం, విలువ అన్ని దానిని ఆవరించిన మురికిలో మరుగునపడిందిగాని, ఆ వజ్రంయొక్క విలువ మటుకు నశించిపోలేదు.

మానవుడుకూడ అంతే. ఒకప్పుడు దైవస్వరూపంకలిగి దేవుని పోలికగ సృజింపబడినవాడే. అయితే యీనాడు వానిచుట్టూ పాపపు మురికి దట్టంగా ఆవరించి ఆ దైవస్వరూపం, ఆ దైవగుణం మరుగున పడింది. మానవుని నిజ విలువను గుర్తించిన ఆ ప్రభు వానిని పాపబంధములనుండి విడిపించుటకు తన ప్రాణాన్నే బలిగ సమర్పించాడు. ఆ ప్రభు ఈ మాటలు పలుకుచున్నాడు. "ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణానికి బదులుగ ఏమి ఈయ గలడు."

పాపమలినమునుండి మిమ్ములను పరిశుభ్రపరచే క్రీస్తుప్రభువు గూర్చి ఈనాడే తెలుసుకొనండి.

—చదలవాడ చంద్రమతీదేవి.

యోగవిద్య నేర్చుకోండి



త్నించి చివరికి ఆరోజు సాహసించి అంత మంది ముందు నన్ను పలకరించినప్పుడు మీ ముఖంలో ప్రతిఫలించిన ఆ వుద్వేగం, ఖావావేశం, ఆ స్ట్రగుల్, నేను పలుకుతానో లేదో ననే భయసందేహాలు, చివరికి నేను చిరునవ్వుతో మామూలుగా మీరడిగిందానికి సమాధానం చెప్పినప్పుడు మీ ముఖంలో కనిపించిన ఆ 'రిలీఫ్'-ఇవన్నీ మీరంటే నాకో రకమైన జాలి కలిగేలా చేసినయ్. మీతో స్నేహం చేశాను. సినిమాలకి వచ్చాను. మీరు చెప్పే బరువైన సంగతులు-మీ ఫిలాసఫీ సైకాలజీ, మీ సాహిత్య పరిజ్ఞానం, మీ టాల్‌స్టాయ్, మీ డాస్టోవిస్కీ, మీ సార్త్రె ఎగ్జిస్టెన్షియలిజం, మీ జేమ్సు జాయిన్, మృణాల్ సేన్, మీ బెర్గ్‌మన్ మీ దేవీప్రసాద్, వీళ్ళందరి గొడవా మీరెంతో వుత్సాహంతో చెపుతూవుంటే ఓపిగ్గా విన్నాను, మీ కోసం, మిమ్మల్ని తృప్తిపరచాలని. అంతేగాని వీళ్ళగురించి తెలుసుకోవాలని కాదు. ఈ బరువైన విషయాలంటే నాకో రకమైన ఎలర్జీ. భరించలేను. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకునే స్వభావం నాది.

ఒకరాత్రి మీ గదికొచ్చాను. ఆ రాత్రి గదిలో మీతో గడిపాను. మీరనే ఆ ఆరాధన, ప్రేమ-వీటికి పరాకాష్ట 'సెక్సు' అని నా నమ్మకం. ఇదంతా మీరంటే ప్రేమతోకాదు. జాలితో చేసింది. అలా అని మీకంటే అయిష్టమని కూడా చెప్పలేను. నామీద కోరికతో తపించే మీ దాహాన్ని తీర్చగలిగాననే భావన నాలోని 'ఈగో'ని ఒకరకంగా తృప్తిపరిచింది. అంతే. ఆ తరువాత మీరు నన్ను ప్రేమిస్తున్నానని అన్నారు. పెళ్ళిచేసుకుంటానన్నారు. ఈ పరిణామాన్ని నేనూహించలేదు. మీపట్ల నా ప్రవర్తన శృతిమించిందని అప్పుడు అర్థమైంది నాకు. వేదమూర్తిగారూ! నేను మిమ్మల్ని ప్రేమించలేదు. అసలింత వరకూ నేనా ఛాయలకే వెళ్ళలేదు. దయచేసి నామీద అటువంటి సెంటిమెంట్సు పెంచుకోకండి. నన్ను మర్చిపొండి. రేపట్నుంచి నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించకండి దయచేసి. ఆఫీసులో ఎప్పుడైనా ఇద్దరం ఎదురుపడటం సంభవించినప్పుడు ఒక చిరునవ్వుతో విష్‌చేసి వూరుకుందాం, చాలు. ఈ వుత్తరం చదువుతూ మీరెలా ఫీలవుతున్నారో తల్చుకుంటూ వుంటే నాకు మళ్ళీ జాలేస్తూంది మీమీద.

-యామిని.


"యామినీ! రాక్షసీ!" అని అరవాలనిపించింది నాకు. రెండుగంటలు పర్మిషన్ పెట్టి టాక్సీలో స్టాఫ్ కాలేజీ హాస్టల్ చేరుకున్నాను. యామిని గదికి తాళం వేసివుంది. ఆ వుదయమే గది ఖాళీచేసి వెళ్ళిపోయిందని చెప్పాడు వార్డెన్.

"ఎక్కడికి?"

"ఏమో తెలీదు" అని ఇన్వెంటరీ లెక్కలు చూసుకోవటంలో మునిగిపోయాడు వార్డెన్.

జాలి ప్రాణాలు నిలబెడుతుందంటారు. ప్రాణాలు తీస్తుందని తెలీదు చాలామందికి.





ఆవిడకి ఎలా చెప్పాలో దారిలోనే వూహించుకుంది మీరా.

శేఖరం వరండాలోనే వున్నాడు. బాచి శేఖరం దగ్గర ఆగిపోయాడు.

మీరా తలొంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోతున్న మీరాకేసి ఓసారి చూసి, బాచికేసి తిరిగేడు శేఖరం.

మీరాకోసం బాచిని పంపేనని శేఖరం చెప్పడంతో శాంతమ్మగారు నిశ్చింతగా కూర్చుండిపోయింది.

మీరాని చూసి, "ఏమిటి మీరా!" అని అడిగింది.

మీరా వెంటనే చెప్పేసింది "మా అమ్మకి వంట్లో బాగుండలేదండి...." లేచి అస్తమానూ తల్లి తిరిగినప్పుడు కూడా ఆవిడకి ఒంట్లో బాగుండలేదని చెప్పడం మీరాకి నరకంగానే వుంది. అంతకన్న వేరే మార్గంలేదు.

మీరా మాట పూర్తికాకుండానే శాంతమ్మగారు, "అదే అనుకున్నానులే" అంది. అంతకన్న ఏమీ అనలేకపోయింది.

మీరా కాస్సేపు నిలబడిపోయింది. ఇంకా ఆవిడేదేనా అడిగితే తనేమయినా చెప్పచ్చు. ఆవిడేం అనకుండా ఎలా చెప్పడమో ఎప్పటిలా, ఇంటి దగ్గర ఎన్నో అనుకుని వచ్చి ఆవిడని చూస్తూనే మౌనం వహించినట్టు, యిప్పుడూ అలాగే మౌనంగా నిలబడి పోయిందిమీరా.

నిలబడిపోయిన మీరాని చూసి "రాత్రి అబ్బాయి భోజనం చేయలేదు ప్మా చేయి" అంది.

నీరసంగా కదిలింది మీరా. "అంతే! తను ఆవిడ ఎదుట నిలబడి ఏం చెప్పలేదు" అనుకుని నిట్టూర్చింది.

శాంతమ్మగారు నిశ్చింతగా పడుకుంది. నిజంగా యీ పూట మీరా రాక పోతే ఆవిడకి లేచి వంటచేసే ఓపిక లేదు.

మీరా వచ్చి "మీరు ఏదేనా తీసుకుంటారా" అని అడిగింది.

ఆవిడ కాస్త హార్లిక్స్ కలిపి తీసుకురమ్మంది.

మీరా ఆవిడకి హార్లిక్స్ కలిపి యిచ్చి వెళ్లి పని చూసుకోసాగింది.

మీరా ఉప్మాగిన్నె పక్కన పెట్టి టీకి నీళ్ళు పడేసి శాంతమ్మగారికి చెప్దామని ఇటు తిరిగింది.

గుమ్మంలో శేఖరం నిలబడి వున్నాడు.

మీరా అటు తిరిగిపోయింది.

శేఖరం గుమ్మం దగ్గర నిలబడే అన్నాడు "రాత్రి నేనేదో హోటల్‌నుండి తెప్పించుకు తింటాను. మానేస్తాను. ఒంట్లో బాగుండని మనిషి ఆవిడేం అవుతుంది, చెప్పకుండా వెళ్ళిపోతే."

మీరా మాట్లాడలేదు.

శేఖరం లోపలికి వచ్చేడు. మీరాకి దగ్గరగా వచ్చేడు. "దేనికీ జవాబు చెప్పదలుచుకోలేదా? చెప్పడం అనవసరం అనుకుంటున్నావా!" జవాబు చెప్పి తీరాలన్నట్టుంది అతని స్వరం.

"అమ్మగారికి రొట్టెలు చేసే వెళ్లేను" స్టవ్‌కేసి చూస్తూ జవాబిచ్చింది.

మొదటే అతను నేను హోటల్‌నుండి తెప్పించుకు తింటాను, మానేస్తాను అని అననే అన్నాడు. ఇంక అతనికి ఏమనాలో తోచనట్టుగా నిలబడిపోయాడు.

మీరా ఇవతలకి వచ్చేసింది.

శాంతమ్మగారు శేఖరానికి తను ఉన్న గదిలోకే టిఫిను తీసుకురమ్మని చెప్పింది.


బ్రతికేను అనుకుంది మీరా.

టిఫిను, టీ స్టూలుమీద పెట్టి వెళ్ళిపోయింది.

అప్పిని కొడుకుని పిలవమని చెప్పింది. శేఖరం బయటకెళ్ళే ప్రయత్నంలో వున్నాడు.

"ఇప్పుడెందుకు చేయించేవు! నీమట్టుకేదేనా చేసిపెట్టి వెళ్ళమనవలసింది" అన్నాడు.

"అదేమిరా! రాత్రి భోజనం చేయలేదు, నామట్టుకే అంటున్నావు. మధ్యాన్నం రావా?" అని అడిగింది.



"రాను. రావుగారు వాళ్లు వస్తే నువ్వేం మాటియ్యకు" అన్నాడు.

నేనేందు కిస్తారా!....నా ఇష్టమేముంది. అందరూ నన్ను అంటున్నారు" అదోలా అందావిడ.

"అదేమిటమ్మా!" బాధగా చూశాడు తల్లికేసి. "ఈ ఒక్క విషయంలో నన్నేమీ ఇబ్బంది పెట్టకు" అన్నాడు మళ్ళీ.

"ఈ ఒక్క విషయానికే అంతా నన్ను అనుకొనేది. ఎవరి వరకో ఎందుకూ? మన బంధువుల్లో—దగ్గర వాళ్ళే అనుకుంటున్నారు" బాధగా అందావిడ.

"అనుకోనీ! పని లేకపోతే ఏం చేస్తారు" నిర్లక్ష్యంగా అన్నాడు.

"అనుకోనీ అంటే-నేను పడలేను నాయనా! నాకు ఓపిక లేదు. నీకు పెళ్ళి చేస్తే నువు నా చెయ్యిదాటి పోతావని నేను చేయట్లేదని అంటోంటే ఎలా భరించను—పిల్లకి ఓ పురుడు కూడా పోశాను. చేతో వాతో—ఏ కాశీకో పోయి...."

"నువ్వు అరుణ పెళ్ళికి—ఓ పురుడు పోయడానికే వచ్చేవా?...అరుణని మంచి చోటులోనే యిచ్చేవు—ఇంక నాకు దిగులేముంది........"

ఇంకా అతను ఏదో అనబోతున్నాడు. అప్పటికే శేఖరం గుండెల్లో ఆవేదన మాటల రూపంలో—ఆ ధ్వనిలో వ్యక్తమయి ఆ తల్లి గుండెల్ని తాకింది.

ఆవిడ ప్రాణం గిలగిల లాడింది. కంగారుగా లేచి కూర్చుంది.

శేఖరం అలా ఎందుకన్నాడో ఆవిడ గ్రహించలేదు. ఇప్పుడు ఆవిడ కళ్ళకి శేఖరం పదేళ్ళ పసి బాలుడిలా—పదహారేళ్ళప్పుడు మేనత్త "అమ్మ మీ

వచ్చిపోయింది—పిన్ని" అన్నప్పుడు ఆ అవతారంలో—శేఖరం యిప్పుడు ఆవిడ కళ్ళ ముందు మెదిలేదు.

తను ఓ ఉద్దేశంతో అంటే అది ఇంకోలా పరిణమించిందని ఖంగారు పడింది. "చినబాబూ!" అంటూ. శేఖరం చేయి తన చేతిలోకి తీసుకుంది.

"నువు పిల్లా పాపల్తో కళకళలాడుతూ వుంటే చూడాలని నా కుండదా? ఏ తల్లయినా బిడ్డల నుండి ఇంతకన్న ఏం కోరుకుంటుంది నాయనా! నువ్వే చెప్పు. నిన్నో ఇంటి వాణ్ని చేద్దామనుకుంటాను" నిట్టూర్చిందావిడ. "ప్చ్! ఏం లాభం! నేనే ఓడిపోతున్నాను........"

అప్పి వచ్చి "అమ్మగారూ! నిన్నటోరు వచ్చేరండి!" అంది.

"ఎవరూ" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

సరోజినీదేవే తిన్నగా వచ్చేసింది.

"మీరా, రండి రండి" శాంతమ్మగారు లేచి నిలబడుతూ అంది.

శేఖరం లేచి ఇవతలకి వచ్చేడు. ఆవిడ మామూలుగా కనపడలేదు శేఖరానికి. ఏదో ఆయాసపడుతున్నట్టుగా వుంది.

"కూర్చోండి" ఆహ్వానించింది శాంతమ్మగారు.

కూర్చోవడానికేం లెండి" అని క్షణం ఆగి, "మీరా వుందా?" అని అడిగింది.

శాంతమ్మగారిని ఏదో అడగడానికి అప్పుడే అక్కడకొచ్చిన మీరా ఆవిడని చూసి టక్కున ఆగిపోయింది. వెంటనే వెనక్కి వచ్చేయబోయింది.

సరోజినీదేవి లేచి ఒక్క అంగలో వచ్చినట్టుగా లేచి వచ్చి మీరా జబ్బ పట్టుకుంది.

ఆవిడ చేసిన ఆ చర్యకి మీరాతోబాటు శేఖరం, శాంతమ్మగారూ కూడా తెల్లబోయారు.

మీరా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగిందావిడ. "నీకు అక్క వుందేదా? హఠాత్తుగా ఎక్కడనించి వూడిపడింది నీకు అక్క! వాడు-ఆ కుర్రాడు నీ కొడుకే కదూ? ఇంకా ఇక్కడ పిల్లలకి ఆయానని చెప్తావా! ఎందుకూ ఆవిడని అంత క్షోభపెడ్తావూ?" సరోజినీదేవి రొప్పుతోంది గుక్క తిప్పుకోవటానికి అన్నట్లు క్షణంసేపు ఆగింది.

శేఖరానికి పరిస్థితి అర్థమయిపోయింది.

శాంతమ్మగారు గబగబా ఆవిడ దగ్గరగా వచ్చి, ఆవిడ భుజంమీద చెయి వేస్తూ "ఇలా కూర్చోండి" మీరాకేసి తిరిగి "మీరా కాఫీ తీసుకురా" అంటూ సరోజినీదేవి చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి సోఫాలో కూర్చోపెట్టింది.

"ఇప్పుడు నేనేం తీసుకోలేనండీ!"....ఆవిడ పరిస్థితి చూస్తే నాకే ఇలా వుందే! ఆ తల్లి బాధ ఇంత చెప్పక్కరలేదు "శాంతమ్మ కొచ్చిన బాధ తనదే

నన్నట్టు-కాంతమ్మమీద ఈగవాలితే తను భరించలేనన్నట్లు అంది.

"ఏమిటండీ!" అంతా అయోమయంగా అన్పించగా అడిగింది శాంతమ్మ గారు.

"మీకు తెలియదా?" అంటూ తల్లీ కొడుకులకేసి చూసింది.

అసలు సంగతి తను చెప్పేద్దామా అన్నంత ఆవేశం వచ్చింది శేఖరానికి. ఎలాగో పళ్ళ బిగువున నిగ్రహించుకున్నాడు. 'ఈ కోపంలో మీరా ఏ అఘాయిత్యానికైనా పాల్పడితే' అందుకే అతను పెదవి విప్పలేదు.

"కాంతమ్మకి మీరా ఒక్కత్తే కూతురు, మీ అమ్మాయి చెప్పే వుంటుంది. నేనిందాక చూడ్డానికెళ్ళేను. దబ్బపండులా వున్నాడు ఏడాది పిల్లాడు. ఎవరని అడిగితే తన పెద్ద కూతురు కొడుకని, బిడ్డనికని కూతురు పోయిందని చెప్తోంది. అందరికీ అలానే చెప్తోందిట. అవును. అంతకన్న ఏం చేస్తుంది. అందుకే అంత హఠాత్తుగా మకాం ఎత్తేశారు; ఊరంతా గుప్పుమంది ఏమిటా అని" గుక్క తిప్పుకోకుండా చెప్పింది..

శాంతమ్మగారు స్థాణువులా కూర్చుంది.

శేఖరం వరండాలోకి వచ్చేడు. అప్పిని పిల్చి నెమ్మదిగా "అమ్మాయిగారు వెడుతోంటే నాకు చెప్పు" అన్నాడు.

"సరేనండి" అంది అప్పి.

"అక్కడే వుండి చూస్తూ వుండు. వెళ్ళు" అని చెప్పి మళ్ళా లోపల కొచ్చేడు.


"ఇలాంటి వాళ్ళని నమ్మకూడదండీ బాబూ! మీరా సంగతి మొదటినించీ చూస్తూనే వున్నాను. ఆ పిల్ల చేసిన పనికి బంగారంలాంటి ఉద్యోగం వదులుకుని తల్లి ఈ మారుమూల దొంగ బ్రతుకు బ్రతుకుతోంది పాపం" కాంతమ్మ మీద సానుభూతి వ్యక్తం చేసింది.

"అప్పి మీరాని కాఫీ తీసుకు రమ్మను" అని శాంతమ్మగారు పిల్చింది.

"నాకిప్పుడేం వద్దండీ!" అని శేఖరంకేసి తిరిగి, "మీరు అలా అయిపోయారేమిటీ? కూర్చోండి!" అంది. మీరా అసలు సంగతి తెలిసి శేఖరం అలా అయిపోయాడని ఆ ప్రమాదం తనే తప్పించినట్లు అనుకోసాగింది. 'వీళ్ళని గోతిలోకి దింపుదామని ఆ తల్లీ కూతుళ్ళు ప్లాను వేశారు. లేకపోతే బి.ఏ. చదివి వంటమనిషిగా చేరుతుందా! ఈ పల్లెటూళ్ళో వుంటుందా! అసలు శేఖరం మీరామీద దృష్టి పెట్టుకునే జ్యోతిని కాదంటున్నాడు. ఇప్పుడు ఈ వూరు రావటం ఎంత మంచిదయింది. ఇప్పుడు చచ్చినట్టు ఒప్పుకుంటాడు. అడిగి మరీ చేసుకుంటాడు" అనుకుంది సరోజినీదేవి.

మీరా తను తీసుకు రాకుండా అప్పిచేత కాఫీ పంపించింది. శాంతమ్మగారికి సిగ్గేసింది అప్పిచేత పంపించినందుకు ఆవిడ ఏమనుకుంటుందోనని.

లాభం లేదు కోర్టుకి పద !!



శేఖరం వరండాలోకి వచ్చి నిలబడ్డాడు. అతని బుర్ర బొత్తిగా పనిచేయటంలేదు. శేఖరం అలా వెళ్ళగా చూసి సరోజినీదేవి అంది. "ఇలాంటి వాళ్ళని కొంపల్లో ఉంచుకోకూడదండీ! మనకికూడా చెడ్డపేరు వస్తుంది. మీరు సరే అంటే నేను హైదరాబాదునించి మంచి పని మనిషిని పంపుతాను. అయినా ఏమిటో! కొడుక్కి పెళ్ళిచేసి హాయిగా సుఖపడకుండా! ఏదో చనువుకొద్దీ అనేస్తున్నాను. ఏమీ అనుకోకండి వదినగారూ" మొదటిసారిగా వరస కలుపుతూ ఆవిడ చేతులు అంది పుచ్చుకుంది.

ఇప్పుడు సరోజినీదేవినీ-ఆవిడ మాటల తీరూ చూస్తే అంత గంభీరంగా వుండేది ఈవిడేనా అన్పిస్తుంది. అది వరకు ఆవిణ్ని ఎరుగున్న వారికి ఎవరికైనా.

o o o o

సరోజినీదేవి వెళ్ళిపోయింది. శాంతమ్మగారు "ఉండండి" అని ఎంత చెప్పినా "మధ్యాన్నం వస్తాం" అని వెళ్ళిపోయింది. శేఖరం వుండ మనలేదు. ఆవిడ వెళ్ళిపోతే బాగుండునని తపస్సు చేస్తున్న వాడిలా నిలబడ్డాడు.

కోటేశ్వరరావు జ్యోతిని తీసుకుని పక్క వూరిలో ఆయన తరపు బంధువులుంటే వెళ్ళేడు. సరోజినీదేవి రానంది. ఆమె పెళ్ళిలో గొడవ జరిగిందట ఆ గొడవకి కారణం వాళ్ళేనట. ఎప్పుడూ ఆవిడ వాళ్ళింటికి వెళ్ళలేదు. ఇప్పుడూ రానంది. ఆయనా బలవంతం చేయలేదు. కూతురిని తీసుకుని వెళ్ళేడు.

శాంతమ్మగారి కంతా అయోమయంగా అన్పించసాగింది. 'అరుణ కూడా చెప్పింది మీరా ఒక్కత్తేనని. నిజంగా అక్కగారే వుంటే మీరా ఎందుకు చెప్పదూ! ఇందులో రహస్యంగా దాచుకోవలసింది ఏముంది?' సరోజినీదేవి చెప్పింది నిజమే అన్పించింది శాంతమ్మగారికి. మళ్లీ అంతలోనే' మీరా అలాంటి పిల్లలా అనిపించదే!....మరి ఈ విషయం రహస్యంగా ఎందుకుంచినట్టు. అరుణ కూడా మీరాని "అంత హఠాత్తుగా వచ్చేశారేం" అని అడిగింది సరోజినీదేవి అదే అడిగింది—

"చినబాబూ!" కొడుకుని పిలిచింది.

"ఏమిటమ్మా" అంటూ వచ్చేశాడు శేఖరం. తల్లి ఎందుకు పిలిచిందో-ఏమంటుందో అతనికి తెలుసు. అతని తలంతా దిమ్మగా వుంది. వచ్చి తల్లి పక్కన కూర్చున్నాడు.

"మీరాని చూస్తే అలాంటి పిల్లలా అనిపించదుగాని ఆవిడ చెప్పిందాంట్లో కూడా అతిశయం కన్పించటం లేదురా. నాకు చాలా చిత్రంగా వుంది" అంది.

"మనకి తెలియని విషయాల్ని గురించి మనమేమీ మాటాడొద్దమ్మా!" భారంగా అన్నాడు.

"అరుణ కూడా మీరా ఒక్కత్తేనని చెప్పింది కదురా! నిజంగా అక్కగారుంటే మీరా దాచవలసిందేముంది?"

శేఖరం మాట్లాడలేదు.

"అందుకే తల్లిని ఇక్కడికి తీసుకురాలేదు. అరుణ వస్తానంటే కూడా నువ్వేం వస్తావు మా అమ్మనే తీసుకొస్తాను అనేది. ఇవన్నీ మనకేం తెలుసూ?" మీరాని ఇంట్లో వుంచుకుంటే సరోజినీదేవి అన్నట్టుగా ఎలాంటి అపవాదులొస్తాయోనని అనుకోకపోలేదావిడ.

"నువ్వు ఆవిడనేమీ అడక్కమ్మా!... మనకెందుకూ" అన్నాడు శేఖరం.

వీధిలో కారు ఆగిన శబ్దమయింది. ఈ సంగతి విని కోటేశ్వరరావే వచ్చి వుంటాడనుకున్నాడు శేఖరం. లేచి ఇవతలికి వచ్చేడు. వచ్చినాయన్ని చూస్తూనే అతను సంభ్రమంగా అన్నాడు తల్లితో "అమ్మా! ఎవరొచ్చారో చూడు."

"ఎవరూ" అంటూ ఆవిడ లేచి వచ్చింది. వచ్చినాయన్ని చూస్తూనే గబగబా ముందుకెళ్ళి ఆయన చేతులు పట్టుకుంది. ఆవిడ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆ వచ్చినాయనకీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఇన్నాళ్ళకి దయ కలిగింది మావయ్యకి" నవ్వుతూ పలకరించేడు శేఖరం.

వచ్చినాయన శాంతమ్మగారి మూడో అన్నగారు. ఆ అన్నగారంటే ఆవి

డకి ప్రాణం. చెల్లెలంటే ఆయనకీ అంతే! ఉన్న ఇద్దరు అన్నగార్ల దగ్గరకన్నా ప్రకాశంగారి దగ్గరే శాంతమ్మగారికి చనువు ఎక్కువ. ఇద్దరి మధ్య ఎటువంటి రహస్యాలూ వుండవు. ఒకరి కష్ట సుఖాలు ఒకరు చెప్పుకుంటారు. మనసులో బాధని దించుకుని కొంత ఉపశాంతిని పొందుతారు.

"ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి" కళ్ళు ఒత్తుకుంటూ అందావిడ.

"బొత్తిగా ఇలా అయిపోయావేమిటే శాంతా. ఒంట్లో కులాసాగా వుంటోందా?" ఆప్యాయంగా అడిగాడాయన.

"అదే కులాసా! కూర్చో! ఎక్కడుంటావో ఒక్క వుత్తరం కూడా రాయవుకదా!" అన్నగారి పక్కన కూర్చుంటూ అంది.

"ఎక్కడుంటే ఏమే! నేను రాయిలా వుంటాను. అరుణ అత్తారింటికి వెళ్ళిపోయిందిటగా!"

"అవున్రా అన్నయ్యా! వాళ్ళకి నెలలో కదపటమే ఆచారమట. ఏమంటాం. ఇందిర దగ్గర కెళ్లావా? కులాసాగా వుందా!"

"ఇప్పుడు అక్కడనించే వస్తున్నాను. నీకో పెద్దపని అప్పచెబ్దామని వచ్చేనే!"

వాళ్ళలా మాట్లాడు కొంటోంటే శేఖరం లోపలకొచ్చేడు.

మీరా చలనం లేనట్టుగా నుంచుంది. శేఖరానికి చాలా బాధనిపించింది.

"మీరా" మృదువుగా పిల్చేడు.

పరాగ్గా వున్న మీరా వులిక్కిపడింది. కాని, ఇటు తిరగలేదు.

"మా మావయ్య వచ్చేడు. కాఫీ కావాలి."

మీరా నుంచున్న చోటునుండి కదిలింది.


శేఖరం ఇవతల కొచ్చేశాడు.

"నేను చేసే పనేముందిరా!" అంటున్న శాంతమ్మగారు కొడుకు లోపల్నించి రావటం చూసింది. "చెప్పి వుందిరా! మీరాని కాఫీ తీసుకురమ్మని చెప్పమను" అంది.

'మీరా!' వులిక్కిపడ్డారు ప్రకాశంగారు. "మీరా ఎవరూ?" చెల్లెల్ని అడిగారు.

ఆవిడ ఏం మాట్లాడలేదు. అది వరకు మళ్లే మీరా గురించి అభిమానంగా ఆవిడ నోటి వెంట మాటరాలేదు. అలా అని మీరాని తీసిపారేసినట్టుగా "వంట మనిషి" అని చెప్పలేకపోయింది.

అప్పి అక్కడెక్కడా లేకపోవటంతో మీరాకి కాఫీ తీసుకురాక తప్పలేదు. శాంతమ్మగారు ఒక్కసారి ఇవతలకి వస్తే "నేను వెడుతున్నాను" అని ఒక్క మాట చెప్పేసి వెళ్ళిపోదామని ఉగ్గబెట్టుకుని నిలబడింది. ఇంతట్లో 'అతిథి' వచ్చేడు. ఇలా ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. మీరా వంట ప్రయత్నమేమీ



చేయలేదు. ఇంక శాంతమ్మగారు ఏమన్నా వినదలుచుకోలేదు. ఆనాడు తల్లి మాట వినకుండా ఇక్కడ చేరినందుకు ఎంతయినా చింతిస్తోంది మీరా.

మీరా కాఫీ తీసుకొచ్చింది. అక్కడ దగ్గరగా టీపాయ్ లేదు. కింద పెట్టాలా వద్దా అన్నట్టు ఆగిపోయింది.

మీరాకేసి క్షణం సేపు చూసి చూపు తిప్పుకుంటూ తనే మీరా చేతి లోంచి కాఫీ కప్పు అందుకుని అన్నగారికి అందించింది.

ప్రకాశంగారు చెల్లెలు చేతి లోంచి యాంత్రికంగా అందుకున్నారు మీరానే చూస్తూ.

మీరా వెళ్ళి పోయింది.

"ఎవరూ, ఈ అమ్మాయి" మీరా రూపం ఆయన కళ్ళ ముందు ఇంకా చెదిరి పోలేదు. 'అదే పోలిక' 'మీరా' "మీరాబాయమ్మ" ఆయన హృదయం పదే పదే ఘోషిస్తోంది.

ఈ మధ్య నాకు బొత్తిగా బాగుండలేదులే అన్నయ్యా! కాఫీ కూడా. కాచుకో"లేని పరిస్థితిలో పడిపోయాను. ఈ అమ్మాయిని పెట్టుకున్నాను" అంది

తల్లిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది శేఖరానికి. బాధగా చూశాడు.

"మీరా ఏమిటి. మీరాబాయా! మనలో ఈ పేరు కొత్తే!" అదేదో తేల్చు కోండే మంచినీళ్ళు కూడా ఎక్కేలా లేదాయానకి.

"ముందు కాఫీ తీసుకో! నాకేదో పని చెప్తానన్నావు" అంటూ మాట మార్చేసింది.

"ఇందిరకి ఏడో మాసమట శాంతా! దాన్ని తీసుకొచ్చి నేనేం చేయగల్ను చెప్పు. పై పెచ్చు మా అందరికి అదే చేసి పెట్టాలి. వదిన లిద్దరు "తీసుకురా మేమున్నాము" అని మాట వరసకన్నా అనలేదు. పైగా వదిన ఏమందో తెలుసా?"

"ఏమంది!"

"అక్కడే వుంచేయి. వాళ్ళే పోసుకుంటారు అని సలహా ఇచ్చింది. నీకు అప్పజెబుదామని వచ్చేననుకో! నిన్ను చూస్తోంటే పెద్ద వదిన చెప్పిందే మంచిదేమో ననిపిస్తోంది. ఇంత నీరసంగా వున్నావు నిన్ను ఇబ్బంది పెట్టలేను శాంతా "గ్లాసు క్రింద పెట్టేస్తూ అన్నాడాయన.

"నాకేం ఫరవాలేదు నువ్వు నిశ్చింతగా వుండరా. దానికి పురుడు నేను పోస్తాను. మొదటి కాన్పుకన్నా తీసుకురాకపోతే దాని మనసు బాధపడదా? కాని ఒక్క షరతురా" అంది శాంతమ్మగారు.

"ఏమిటే" నవ్వుతూ అడిగారాయన.

"నువ్వు ఇక్కడే వుండాలి."

"బాగుందే! నేనుండి చేసేదేముంది? తిండి దండగ-చాకిరీ దండగానూ"

"ఇంక జీవితాంతం ఇలా దేశాలుపట్టి తిరుగుతూంటావా! ఇందిర ఆడపిల్ల ఏదో పెళ్ళిచేశావు. అత్తారింటికి వెళ్ళింది. ఆ ఇద్దరు మగపిల్లల దగ్గర వుండక ఏమిటిరా? చిన్నాడు దుడుగ్గా తయారయ్యాట్ట! తల్లి చిన్నప్పుడే కరువయింది. నువ్విలా దేశాలు పట్టి తిరుగుతున్నావు. ఇంక వాళ్ళకి ఎవరి భయం వుంటుంది?"

వాళ్ళిద్దరూ మాటల ధోరణిలో వున్నారు.

శేఖరం లేచి వరండాలోకి వచ్చేడు-మళ్ళీ లోపలకెళ్ళాడు.

మీరా ఇందాకటిలాగే నుంచునుంది.

శేఖరం మీరా దగ్గరగా వచ్చేడు. "మీరా" నెమ్మదిగా పిల్చేడు.

మీరా కొద్దిగా ఇటు తిరిగి "నేను వెడుతున్నాను. ఆవిడ వస్తారేమో చెప్పి వెళ్దామని వున్నాను" అనేసి ముందుకి వెళ్ళబోయింది.

శేఖరం మీరా వెళ్ళకుండా చెయిపట్టి ఆపేశాడు.

"ఛీ!" అంటూ చెయ్యి విదిల్చి కొట్టింది. కాని అతను వదలలేదు.

"మీరా! నాతో కలిసిన జీవితం-ఈ అపవాదు లన్నిటికన్నా ఘోరమా?



మీరా! నిన్ను పెళ్ళి చేసుకుంటాను-ఇప్పుడే అమ్మకి చెప్తాను" అతని గుండె దడదడలాడింది.

"ఈ అపవాదులు తప్పించుకోవటానికి మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలా? అది ఈ జన్మలో జరగని పని." తనంటే మీరాకి ఎంత అసహ్యమో ఆ ముఖం చూస్తేనే తెలుస్తోంది. అయినా అతను దాన్ని ఎదుర్కొన్నాడు.

"ఒక్క తప్పుకి ఇంత శిక్ష!"

కాటేయబోయిన సర్పంలా కస్సుమని తలెత్తింది మీరా.

"ఏ తప్పు చేశానని నాకింత శిక్ష వేశారు" మీరా ఈ మాట అడగలేదు. కస్సుమన్న ఆ కళ్ళల్లో శేఖరానికి ఆ ప్రశ్న కనిపించింది. క్షణంలో సగంసేపు. మీరా కళ్ళల్లోకి సూటిగా చూడలేక చూపులు మరల్చుకున్నాడు.

మళ్లా వెంటనే మృదుగంభీరంగా అన్నాడతను "మీరా జరిగిందంతా మర్చిపో! అమ్మకి ఇప్పుడే చెప్తాను-మీ అమ్మగారికి చెప్తాను........"

"శవాలతో మాట్లాడాలని వుంటే అలాగే చేయండి...."

"నీ మొండితనం నీదేనా? ఒకళ్ళు చెప్పటం వినటం లేదా? ఇంతవరకూ నీ అనుమతి కోసం చూశాను-నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" దృఢంగా పలికేడు.

"నా ఒంట్లో వూపిరి ఉండగా జరగని పని-శవానికే మీరు"

"అయ్యగారు...." అంటూ వచ్చిన అప్పి శేఖరం చేతిలో మీరా చేయి చూసి నోరు తెరుచుకుని వచ్చినపని మర్చిపోయి అలాగే నిలబడిపోయింది.

చప్పున మీరా చేయి వదిలేశాడు శేఖరం.

ఇటు తిరుగుతూ "ఏమిటి" అన్నాడు కొంచెం విసుగ్గా.

"ఎవరో వచ్చేరండీ" అని చెప్పి ఒక్క పరుగులో వెళ్ళిపోయిందది.

శేఖరం మళ్లా మీరాకేసి తిరిగాడు. "మీరా! పట్టుదలతో పంతాలతో మంచిని గుర్తించకుండా ప్రవర్తించడం ఎవరికీ మంచిదికాదు. నిదానించి ఆలోచిస్తే నీకే అర్థవువుతుంది" అనేసి వెళ్ళిపోయాడు.


శేఖరం వెళ్ళిన అయిదు నిమిషాలకి అప్పి వచ్చి "అమ్మగారు రమ్మంటున్నారండీ" అని చెప్పి వెళ్ళిపోయింది.

మీరా గుండెలు దడదడలాడాయి. నిలబడ్డ చోటునుండి ఒక్క అడుగు కూడా కదపలేకపోయింది. మళ్లా రెండు మూడు నిముషాల తర్వాత "అమ్మగారు పిలుస్తున్నారండీ" అని చెప్పింది అప్పి.

మీరా నెమ్మదిగా కదిలి వచ్చింది.

కళ్ళెత్తి శాంతమ్మగారికేసి చూసింది.

ఆ కళ్ళల్లో అదివరకులా ఆప్యాయతా, ఆదరణలకి బదులు 'నిజమా, మీరా' అన్న ప్రశ్న కనపడుతోంది.



మీరానే పరీక్షగా చూస్తున్న ప్రకాశంగారు "ఎవరి అమ్మాయివమ్మా!" ఆప్యాయంగా పలకరించారు.

ఎవరి అమ్మాయని చెప్పాలి? అందుకే మౌనంగా వూరుకుంది.

"మీ అమ్మ పేరేమిటి?" మళ్లీ అడిగారాయన.

"కాంతమ్మ" ఆయన్నుండి చూపులు త్రిప్పుకుంటూ అంది.

ఆయన అదోలా అయిపోవటం ఆయన్నుండి చూపులు మళ్ళించుకున్న మీరా కాని—మీరానే పరీక్షగా చూస్తున్న శాంతమ్మగారు కాని గమనించలేదు.

"మీరా బాయమ్మగారు....ఆవిడ నీకేమవుతారు" ఏ కాంతమ్మో తేల్చుకోవాలని అడిగారాయన. ఆయన గొంతు చిన్నగా వణకడం కూడా ఎవరూ గమనించలేదు.

ఈ ప్రశ్నలడగటానికా పిల్చింది. మనసులోనే విసుక్కుంది. "ఆవిడ మా బామ్మగారేనండీ! ఆవిడ పోయింది" మళ్లామళ్లా ఆయనేం అడగక్కర లేకుండా చెప్పింది.

"ఆవిడ పోయిందా!?" నీరసంగా వెనక్కి జార్లబడుతూ అన్నారు.

'ఏమిటి! మీరా సంగతి అన్నయ్యకి కూడా తెలుసా? మీరా తండ్రి పేరడిగితే అదోలా పెట్టింది మొహం! మీరా పుట్టుక కూడా అంతేనేమో! ఎంతోమంచి పిల్ల అనుకున్న మీరా గురించి ఒక్క రోజులో ఎన్ని తెలుస్తున్నాయి' అనుకుంది శాంతమ్మగారు.

"వంకాయ కారం పెట్టి కూర వండి. ముద్ద పప్పు చేయి. ములక్కాడా అదీవేసి పులుసు పెట్టు" మీరా అని అనడానికి ఆవిడకి మనసొప్పలేదులా వుంది.

"మా అమ్మలేవలేదమ్మా! మధ్యాన్నం వచ్చి చెప్పచ్చనుకున్నాను. బాచి వచ్చి రమ్మన్నాడని చెప్తే వచ్చేను....ఇంక నాకు రావటానికి కుదరదమ్మా" వినయంగానే చెప్పింది.

కాంతమ్మగారికి కోపం వచ్చింది. "హఠాత్తుగా మానేస్తే ఎలా? నాకు ఒంట్లో బాగుండలేదని తెలిసి కూడా! నిన్నా చెప్పకుండానే వెళ్ళావు" ఆవిడ నెమ్మదిగానే అన్నా ఆ స్వరంలోని మార్పు కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

మీరా మాట్లాడలేదు.

"నేను జానకిని కనుక్కుంటాను వాళ్ళ పిన్ని వున్నదేమో-అంతవరకూ నువు మానేస్తే కుదరదు" ఆవిడకి ఈ రోజు కులాసాగా వుంటే మీరా "రావటానికి కుదరదమ్మా" అనగానే నరేననేదే! అసలే లేచి చేసే ఓపిక లేదు. దానికి తోడు రాకరాక అన్నగారు వచ్చేరు. మీరా ఏదో అనబోతోంటే బాచి వచ్చేడు.

"అక్కా" అని ఆగిపోయాడు. అతని ముఖం చూస్తే ఏదో జరిగినట్లుగా వుంది.

మీరా నాలుగయిదు అడుగులు ముందుకి వేసి, "ఏవిటి బాచీ" అని ఆతృతగా అడిగింది.

"అమ్మగారు పడిపోయారు .. ఇప్పుడే లేచి కూర్చున్నారు. కంగారులేదు. నిన్ను రమ్మన్నారు" అన్నాడు.

కాంతమ్మగారికేసి తిరిగి "నేను వెడుతున్నానండీ" అనేసి బయటికొచ్చేసింది.

మీరా బాచీ వెళ్ళిపోయాక "పడిపోవటం ఏమిటే! ఫిట్సొస్తాయా?" అని అడిగారు ప్రకాశంగారు. మీరా వాళ్ళగురించి అంతా తెలుసుకుంటేగాని ఆయన ప్రాణానికి శాంతి కనిపించేలా లేదు.

"ఏమో, ఏమిటో! ఇంతవరకూ ఈ అమ్మాయి బుద్ధిమంతురాలనుకున్నాను. పెళ్లి కాలేదు. ఏడాది పిల్లాడు ఉన్నాట్ట. ఇంతక్రితమే తెలిసింది. ఈ అమ్మాయికి తండ్రి వున్నాడో, చచ్చాడో తెలియదు, ఎవర్నీ నమ్మడానికి లేదు. ఇలా వున్నాయి రోజులు" అంటూ లేచిందావిడ. అప్పటికే పొద్దెక్కిపోయింది. వంట ఎప్పటికవును అనుకుంటూ.

"చినబాబు ఏడీ? నేను స్నానం చేసి వస్తారా ప్రొద్దెక్కిపోయింది. ఇంకా వంట చేస్తోందనుకున్నాను" అని లోపలకెళ్లిందావిడ.

ఈ మాటలు ప్రకాశంగారి కేం వినపడటంలేదు. "కాంతమ్మ-మీరా బాయమ్మ-వాళ్లే ఎందుకు కాకూడదూ!" ఆయన గుండె దడదడ కొట్టుకుంది.

సోఫాలో వెనక్కి వాలి అలాగే కూర్చుండిపోయారాయన. (సశేషం)

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి రు. 116 పొందిన కథ

సన్యాసికేటి లక్ష్మి

సరిగ్గా రాత్రి ఏడున్నర.

జనత తావి ఎక్స్‌ప్రెస్ ఒంగోలు ప్లాట్‌ఫాం నంబర్ వన్ పక్కన ఆగి ఉంది. చేయి పట్టుకు దారి చూపే పోర్టర్ వెనుక పడుతూ లేస్తూ పరుగు పెట్టున నడిచాడు ముకుందం. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో పోర్టర్ వెనుకనే చొరబడి అతను చూపిన ఓ మూల సీటులో కిటికీ పక్క నక్కి కూర్చున్నాడు.

చక్రాలు కీచుమన్నాయి. సకల చరాచర వస్తు ప్రాణులతో స్టేషన్ ఆవరణంతా వెనక్కి నడిచింది.

ప్లాట్‌ఫాం వదిలింది జనత.

చుట్టూ కనిపించినంత మేర కలయ చూశాడు ముకుందం. జీవిత కావ్యానికి సంక్షిప్త నిర్వచనంలా ఉంది కంపార్ట్‌మెంట్. అతని పక్కన కూర్చున్న వృద్ధ దంపతులు తిరుగు ప్రయాణంలో తిరుపతిని గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ పక్కన భూస్వాములు కౌలు యాక్ట్ లొసుగుల గురించి వాదించుకుంటున్నారు.

ముకుందాన్నే చూస్తూ కూర్చుంది ఎదురు సీటులో ఒకామె. ఆమె పక్కన జంటలో భర్త భుజాలకు తల ఆనించి నిద్రపోతోంది భార్య. చెరొక ఇంగ్లీషు సెక్స్ థ్రిల్లర్లో లీనమయి ఉన్నారు బెంచి చివర ఇద్దరు స్టూడెంట్స్. సీట్ల మధ్య సందులో పరిచిన దుప్పటిమీద గాఢ నిద్రలో ఉన్నారు రేపటి పౌరులు.

నార్త్ కేబిన్ దాటి వేగం పుంజుకుంటుంది జనత. గుండెలమీద చేయి వేసుకుని గట్టిగా ఊపిరి పీల్చాడు ముకుందం.

ఎడాపెడా తుఫాను గాలి. దారి తప్పి కాలువగట్టున పడిచి పోతున్న బాటసారి ఏం చేస్తాడు?.... ఈదురుగాలికి దొర్లి కాలువలో పడకుండ మోకాళ్ళను చేతులతో చుట్టి, వాటి మీద తల ఆనించి బిగుసుకు కూర్చుంటాడు. ఈ తుఫాను తగ్గేదెప్పుడా? అని ఎదురు చూస్తాడు.

అంత వరకు అలా హోరెత్తించిన తుఫాను ఆగింది. అప్పుడేం చేస్తాడా బాటసారి? లేచి నిలబడి ఒళ్ళు విరుచుకుంటాడు. కళ్ళు తెరిచి తెరిపిగా ప్రపంచాన్ని చూస్తాడు. బతుకు జీవుడా అని తిరిగి నడక ప్రారంభిస్తాడు.

సీటులో సర్దుకు కూర్చుంటూ ఆ నిముషాన అలా రిలీఫ్ ఫీలయ్యాడు ముకుందం.

తన వంకే సూటిగా చూస్తున్న ఎదురు సీటులో ఆమె చూపులకు తట్టుకోలేక తలవంచుకున్నాడు ముకుందం.

"ఎంత వరకు మీరు?" అడిగింది ఆమె.

తనని కాదన్నట్లుగా అటూ ఇటూ చూశాడు ముకుందం.

"మిమ్మల్నే" తిరిగి అంది ఆమె.

కిటికీ గుండా బయటికి చూశాడు. తరువాత కంపార్ట్‌మెంట్ పైకప్పు వైపు చూశాడు. తిరిగి ఆకాశంలో చంద్రుని పరికించాడు. చివరికి తనలో తను గొణుకున్నట్లుగా చెప్పాడు ముకుందం.

"ఋషీకేశ్"

"అక్కడ వర్క్ చేస్తున్నారా!"

అడ్డంగా తల ఆడించాడు ముకుందం.

పైకి అనలేదు ముఖంలో ఆశ్చర్యం దాచుకోలేకపోయింది ఆమె.

మూడు పదులలోపు వయసు. కట్టుబట్టలతో ఒంటరిగా బయలుదేరాడు పోనీ టూరిస్టేమో అనుకుంటే వెంట ఉండవలసిన లగేజి ఏమి పక్కన లేదు.

పత్రిక తెరచి ఆమె చూపులైతే మరల్చింది కాని ముకుందం నుంచి మనసును మాత్రం మరల్చలేకపోయింది.

'సంసార బంధాలమీద రోసినవానిలా బయలుదేరాడు. అందునా సన్యాసాన్ని వృత్తిగా మార్చి సకల సౌకర్యాలతో ప్రజలమధ్య వెలిగే ఈ.


రచయిత పరిచయం

కథలు వ్రాయటం సరదా. కేవలం కాలక్షేపమే కాక కథ ప్రయోజనకారి కూడ కావాలని అభిలాష. ఇక బహుమతి అంటారా, ఇది ఒక తీయటి అనుభవం.

కథ గుర్తుంటే, రచయిత గుర్తున్నట్టే. అది లేకుంటె నేనిక్కడ ఏమిచ్చినా ఒకటే.

ఈ అవకాశాన్నిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

బి. మధుసూదనరావు



రోజుల్లో అంత దూరం వెళ్ళేదెవరు? చూస్తే ఉట్టి అమాయకుడిలా ఉన్నాడు' అని ఆలోచిస్తుంది ఆమె.

నిజంగా ఉట్టి అమాయకుడు, బహు నెమ్మదస్తుడు ముకుందం.

చిరాకు కలిగినప్పుడైనా కొమ్ము విసురుతుంది గోవు. ఎదుటి మనిషి దురుసుగా మాట్లాడుతున్నప్పుడు కూడ ఎలాటి అసహనాన్ని ప్రదర్శించడు. ఎవరైనా ఏదైనా ప్రశ్నించినప్పుడు కూడా నోరు విప్పి బదులు చెప్పడు. అవును, కాదు అనేది పీకైనంత వరకు నెమ్మదిగా తల ఆడించో, సంజ్ఞల ద్వారానో తెలియచేస్తాడు.

దానికి తోడు అలాటివాడు ఇలాటివాడు అయితే ఈ ఆర్థిక వ్యవస్థలో నోట మన్ను కరుచుకునే వాడే ముకుందం.

ఉన్న ఊళ్ళో ఎకౌంట్స్ లెక్చరర్‌గా వచ్చే జీతం కాక పైన ట్యూషన్స్. ఊరి సెంటర్‌లో షాప్స్ నుంచి లీజ్‌కు తీసుకున్న నేష్నలైజ్‌డ్ బాంక్ నుంచి అద్దె తెచ్చిపెట్టే బిల్డింగ్ కాంప్లెక్స్. ఇవికాక పన్నెండెకరాల పత్తి పండే భూమి, భార్య తరపున ఏడెకరాల జీడిమామిడి తోట-ఉండబట్టే-దినం దినం వెతుక్కునే ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా సజావుగా ఉంది అతని జీవితం.

సీటు కింద వేలాడ వేసిన రెండు కాళ్ళ సందున చేతులు బిగించి తల వంచుకు కూర్చున్నాడు ముకుందం.

"మారీడా మీరు?" మెల్లగా అడిగింది ఆమె.

తల ఊపాడు ముకుందం అవునని.

"ఎంత కాలం అయింది?"

మూడు వేళ్ళు చూపాడు.

"జీవితం మీద విరక్తా"

లేదన్నట్లు తల ఆడించాడు.

"భార్య డిసీవ్ చేసిందా?"

"కాదు"

"మరి.... ఇంకేమిటి?"

ఏమని చెప్పేట్లు? చెపితే వెక్కిరిస్తుందేమో! భయపడ్డాడు ముకుందం.

కాని తన కష్టాన్ని అంత వరకు అలా పరామర్శించిన వాళ్ళు లేరనిపించింది. ఊరడిస్తే తలపుకు వచ్చినట్లు దుఃఖం పొంగుకు వచ్చింది.

తల పక్కకు తిప్పి కిటికీగుండా బయటకు చూశాడు.

రైల్వే ట్రాక్ పక్కల వరకు తన్నుకు వస్తూంది ఎక్కడిదో వరద నీరు. ఎటు చూసినా జలరాశి. నీటిలో మునిగే మనిషి పైకెత్తిన చేతుల్లా వరి మొక్కల కొసలు ఏటిపైన కొన ఊపిరితో ఊగిసలాడుతున్నాయి.

చూడమన్నట్లు వేలు చూపించాడు ముకుందం.

చూసింది ఆమె. కట్టలుతెగి ప్రవహిస్తూంది నీరు.

'ఏమిటి?' అన్నట్లు చూసిందామె.

"సో వైల్డ్"

"ఏమిటేమిటి?"

"ఆమె నోరు"

అని ఆమె వైపు చూశాడు.

ముకుందం భయపడినంత అయింది. ఓ చేయి పొట్టమీద తొక్కి పట్టింది. మరో చేత్తో హాండ్ కర్చీఫ్ నోటికి అదిమి పట్టింది.

"అందుకు" నవ్వు దొంతర్ల మధ్య అడిగింది ఆమె "పెళ్ళాన్ని వదిలి పారిపోతున్నారా?"

సైకిల్‌మీద నుంచి పడి ఒళ్ళంతా దోక్కుపోయి తను బాధ పడుతుంటే తన స్టూడెంటొకడు అది చూసి నవ్వినట్లు అనిపించింది. పడిన పుండును చూసుకుంటుంటే దారిన వెళ్ళే గరల్ స్టూడెంట్ కొక్కిరించినట్లు అనిపించింది. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు ముకుందం.

ఎనిమీ మిషన్‌గన్ బులెట్స్ తూట్లు చేస్తుంటే సిపాయి శరీరం ఎంత గట్టిదైనా ఏమాగుతుంది? చిన్నా భిన్నమవుతుంది. మెలికలు తిరుగుతూ ఎగిరెగిరి పడుతుంది. భార్య వాక్ ప్రవాహానికి అలా విలవిల్లాడేది ముకుందం మనసు. ఎప్పుడో ఓ సారి అయితేనో లేదా ఫలానా షెడ్యూల్ అనుసరించో అయితే ముందుగా ఊహించి ఆ ప్రకారం ఏ ట్రెంచెస్ లోనో తల దాచుకోవచ్చు. కాని గొరిల్లా వార్‌ఫేర్‌లా అతను చేసిన ఏదో ఒక పనికి వంక పెట్టటం హఠాత్తుగా గన్ గురిపెట్టటాన్ని మూడు దీర్ఘ సంవత్సరాలు సహించి, భరించి చివరికి ఆ నాటికి ఓ నిర్ణయానికి రాగలిగాడు ముకుందం.


తల ఎత్తి చూశాడు ముకుందం.

ఎదురుగా కూర్చున్న ఆమె అప్పటికీ నవ్వు ఆపుకోలేత తిప్పలు పడుతుంది. చూడలేక లేచి డైనింగ్‌కార్ వైపు దారి తీశాడు.

బడబాగ్నిలో చిక్కి ఎలాగో వెనుక ఓ సారి చావు తప్పుకున్న లేడిపిల్ల ఆ తరువాత నిప్పు చూస్తే? వెనుక నుంచి భార్య మాటల్లా వినిపించి అంత బెదిరిపోయాడు ముకుందం.

నోట్లో పెట్టుకోబోయే ముద్ద ఆగింది. కుర్చీకింద టైమ్ బాంబ్ చూసినట్లయింది. వెనక్కు చూశాడు.

కాని ఆ మాట్లాడుతుంది ఎవరో. భోజనం అయిందనిపించి లేచి చేయి



కడిగి వెనక్కు బయలుదేరాడు ముకుందం.

కంపార్ట్‌మెంట్ అంతా కిక్కిరిసి ఉంది. సీటు అంచులు పట్టుకుని కొందరు, పై బర్త్ చివరలు పట్టుకుని కొందరు కునుకు తీస్తున్నారు. కలత నిద్రలో కాళ్ళు జాపబోయి సీటు చాలక జారిపడి తిరిగి సర్దుకుకూర్చుంటున్నారు కొందరు. రైలు కదలికకు ఊయల్లో పాపల్లా జోగుతున్నారు.

చూసినా ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేడు ముకుందం. ఈ దృశ్యాలన్నీ కలల్లో చిత్రాల్లా కనిపించి కదిలిపోతున్నాయి. నిద్రలో నడిచే జబ్బున్న మనిషిలా నడిచి పోతున్నాడు.

దారిలో వాళ్ళను తప్పుకుంటూ వచ్చి తన సీటులో కూర్చున్నాడు ముకుందం. చేతులు కట్టుకుని కళ్ళు మూసుకుని సీటు మూలకు ఆనుకుని ఉంది ఎదురు సీటులో ఆమె. ఉండి ఉండి చిరుహాసం ఒకటి ఆమె పెదవుల మీద నాట్యం చేస్తూనే ఉంది.

తిరిగి కళ్ళు మూశాడు ముకుందం.

మూసిన కళ్ళల్లో మరీ వికృతంగా కనిపించింది అతనికి భార్య. జానపదాల్లో భూతంలా పెరిగి పెరిగి ఆమె భూమ్యాకాశాలు నిండింది. చేతులు చాపి తన మీదకు వస్తున్నట్లు భయపడి కళ్ళు తెరిచాడు ముకుందం.

"డైవర్స్‌కు ఎందుకు ట్రై చేయలేదు?" అడిగింది ఆమె.

మాట్లాడలేదు ముకుందం. ఆమెకు సమాధానం చెప్పలేదు. అలాగే చూస్తూండి పోయాడు. కాని ఎదురుగా

వుండేదేదీ ఆతని కళ్ళకు కనపడటం లేదు.

తెనాలి స్టేషనులో ఆగింది జనత. కంపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు దిగారు. ఆరుగురు ప్యాసింజర్స్ ఎక్కారు. ఎక్కిన వాళ్ళు బోగీలోకి తొంగి చూసి లోపలకు వచ్చే మార్గం లేక అక్కడే టాయిలెట్ పక్క తలుపుకు ఆనుకుని క్రింద కూర్చున్నారు.

స్టేషన్ వదిలింది జనత.

ఎదురుగా కూర్చున్న ఆమె కిటికీ లోంచి బయటి వెన్నెలను చూస్తోంది. ఆమె ముఖంలో అంతకు ముందటి నవ్వు మాయమయింది.

దీర్ఘంగా ఆలోచించి ఆమె. మకుం దాన్ని జాలిగా చూసింది.

కిటికీలో చేయి ఆనించి దాని మీద తల వాల్చి శూన్యంలోకి చూస్తున్నాడు ముకుంద.

ముకుందంలానే కిటికీలో తల వాల్చి-

"వెన్నెల.... ఎంత తెల్లగా వుందో!" అంది ఆమె.

"ఊ..." అన్నాడు ముకుందం.

"ఎంత చల్లగా కూడ వుందో?"

"..... ....."

"పక్కన కాలువలో చూడండి.... కలువ పూలు ఎలా వికసించాయో"

"..... ....."

"ఇదంతా సృష్టికర్త గీసిన ప్రకృతి చిత్రంలా సౌందర్యంతో తొణికిస లాడటం లేదూ?"

"ఊ...."

"కాని చూశారా?.. అందాల చంద్రు నిలో ఆ మచ్చ!"

బేలగా ఆమె ముఖంలోకి చూశాడు ముకుందం. చీకటిలో తవుడుకుంటున్న తనని చేయి పట్టి నడిపిస్తున్నట్లు అని పించింది. దారి తెలియక తికమక పడు తున్న వానికి "అదిగో, అటు" అని ఆమె దారి చూపే ప్రయత్నంలో వున్నట్లు అనిపించింది.

"ఆ మచ్చ కూడ లేకుంటే వంక లేని సౌందర్యమే అవుతుంది"

తల దించాడు ముకుందం.

"కాని.... వేళకు భోజనం పెడు తుందా మీ మిసెస్?"

"ఊ...."

అంతే కాదు దగ్గర కూర్చుని కొసరి కొసరి తినిపిస్తుంది.

"మీరెప్పుడైనా ఏదైనా వ్యవ హారంలో చిక్కుకుంటె చూస్తూ ఊరు కుంటుందా?"

"ఉహుఁ...."

అలాంటి సమయాల్లో ముందుకు వచ్చి సమయస్ఫూర్తిగా వ్యవహ రిస్తుంది.

"మీరెప్పుడైనా జబ్బు పడినప్పుడు?"

ఎంతో బెంబేలు పడుతుంది. నిద్రా హారాలు మాని దగ్గర కూర్చుని "కం టికి రెప్పలా కాపాడుతుంది"

"బెడ్ పార్టనర్‌గా?...."

"ఏ లోపం లేదు"

ఆమె సమక్షంలో ఆ కాలం ఇట్టే గడిచిపోతుంది.

ముకుందం మనసులో సూర్యో దయం ముందులా ఓ వెలుగురేఖ పొడచూపింది. క్రమేపి అది పెరిగి పూర్ణ సూర్య బింబం ఆకాశంలో తళ తళా నిలచేసరికి చుట్టూ వెలుగు పరుచు కున్నట్లు అయింది.

"చంద్రుని చూసినప్పుడల్లా నా కిదే గుర్తుకు వస్తుంది... మీ దృష్టి అంతా మీ భార్యలో ఒక్క లోపం మీదే ఉంది కాని.... మీ కిష్టమైనవి, మీ మనుగడకు ఆధారమైనవి ఇన్ని ఉన్నాయని ఒక్కసారైనా ఆలోచిం చారా?"

తెర తొలగించినట్లు అనిపించింది ము[illegible]దానికి. అంతవరకు భూతంలా కని[illegible]న భార్య రూపం క్రమేణా ఫే[illegible] అయి శాపవిమోచన పొం దిన గంధర్వకన్యలా కళ్ళ ముందు నిలచినట్లయింది. అంతవరకు జుగుప్స కలిగించిన మెడలో ఎముకల గొలుసు పూలదండలా, నుదుటిమీది వికృతమైన మూడో కన్ను కస్తూరి తిలకంలా, ఒళ్ళంతా అలుముకున్న రోమం దేవతా వస్త్రాల్లా మారాయి. తనను కబళించటానికి అన్నట్లుగా చాపిన చేతులు కౌగిలి కోసం ఆరాటపడే ప్రియ హస్తాల్లా మారాయి.

విజయవాడ స్టేషనులో జనత ఆగి కొద్ది నిముషాలయింది. దిగే వాళ్ళను ఎక్కే జనం దిగనివ్వటంలేదు. విజిల్ వేసి లైట్ చూపాడు గార్డ్. కూత వినిపించింది.

లేచి నిలబడ్డాడు ముకుందం.

"బండి కదులుతుంది మాష్టారూ... త్వరగా దిగండి"

చక్రాలు కదిలాయి.

జనాన్ని తప్పుకువెళ్ళి దిగే టైమ్ లేదు. కిటికీలో దూరాడు ముకుందం. గట్టిగా పట్టుకుంది ఆమె. ఎలాగో వచ్చి విజయవాడ ప్లాట్‌ఫాం మీద చతికిలపడ్డాడు ముకుందం.

'నచ్చనిదొకటి ఎంత పని చేసింది!' గట్టిగా ఊపిరి పీల్చింది ఆమె.

ఒంటికి పట్టిన దుమ్ము దులుపు కుంటూ అటు చూశాడు ముకుందం. వెళ్తున్న ట్రయిన్ నుంచి టాటా చెపు తుంది ఆమె.

జారిన చెప్పు తొడుక్కున్నాడు ముకుందం. జుట్టు సరిచేసుకున్నాడు. లేచి నిలబడ్డాడు.

అంతరిక్షంలో దూసుకుపోతోంది రాకెట్. మధ్యలో ట్రబులిచ్చింది.... అటు ఊగింది ఇటు పరుగెత్తింది. పరిస్థితి చూశాడు వ్యోమగామి. ఈ అనంత విశ్వంలో ఎక్కడో తను. జీవితంమీద ఆశ వదిలి సృష్టికర్తను తలుచుకున్నాడు.

అయితే-రాకెట్ వచ్చి నేరుగా పసిఫిక్ మహాసముద్రంలో పడింది. రెస్క్యూచేసి అభినందిస్తున్న వాళ్ళ మధ్య కళ్ళు తెరిచి చుట్టూ చూసిన అతనికి ఎలా ఉంటుంది?

ఒంగోలు వెళ్ళే ట్రయిన్ వివరాల కోసం ఎంక్వయిరీ దగ్గరకు ఉలా వెళ్ళాడు ముకుందం. ❊

ప్రధాన మంత్రి 20 అంశాల కార్యక్రమము
లక్షలాది కష్ట జీవులకు వరప్రసాదం

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రకటించిన 20 అంశాల ఆర్థిక కార్యక్రమం, వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సుస్థిరమైన ప్రగతికి సంకేతం. ఇది బడుగు వర్గాల అభివృద్ధికి జరుపుతున్న కృషిలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించి, లక్షలాది మంది బలహీనవర్గాల ప్రజలలో కొత్త ఆశలను చిగురింపజేసింది.

వాస్తవాలే ఇందుకు దర్పణం రికార్డు స్థాయిలో ఆహారోత్పత్తి :

1978-79 లో రికార్డు స్థాయిలో 106.6 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశారు. తుఫాను, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినప్పటికీ తాత్కాలిక ప్రణాళికలను త్వరితగతిని అమలు జరపడంతో 79-80 లో కనీసం 70 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించగలిగారు.

ప్రజలకు చౌక వస్త్రాలు :

అరవై శాతం మంది చేనేత పనివారలను సహకార పరిధిలోకి తెచ్చారు.

1977-78 లో 189 లక్షల చదరపు మీటర్ల చౌక వస్త్రాలను ఉత్పత్తి చేయగా 1978-79 లో 2.3 లక్షలు 1978-80 లో 330 లక్షల చదరపు మీటర్లు చౌక వస్త్రాలను ఉత్పత్తి చేసి ఇప్పుడు 388 కేంద్రాల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు.

చౌకధర దుకాణాల ద్వారా అత్యవసర సరుకులు :

ఇప్పుడు 22,099 చౌక ధర దుకాణాల ద్వారా ప్రజలకు అత్యవసర సరకులను సరఫరా చేస్తున్నారు.

భూసంస్కరణలు :

రాష్ట్రంలో భూసంస్కరణలను శీఘ్రతరంగా అమలు జరుపుతున్నారు. ఇందువల్ల 3.79 లక్షల ఎకరాల మిగులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. 1,74,125 కుటుంబాలకు భూమి పంపిణీ చేశారు. వారిలో చాలా వరకు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులవారు ఉన్నారు.

బలహీన వర్గాలకు ఇళ్లు :

ఈ పథకాన్ని ద్విగుణీకృతోత్సాహంతో అమలు జరుపుతున్నారు. 2.5 లక్షల కుటుంబాలకు 5,000 కొత్త వాడలలో వసతి కల్పించారు. 12 లక్షల పేద కుటుంబాలకు ఇళ్ళస్థలాలు కేటాయించారు.

ఒకడు పది మంది!

మీరు
నా నోటితో మాట్లాడుతున్నారు
నా కళ్ళతో చూస్తున్నారు
నా వేళ్ళతో స్పృశిస్తున్నారు.
మీ
పదపదంలో నే నుబుకుతున్నాను
(నా రెక్కలు కట్టుకెగుర్తున్న పక్షులుకదా మీరు)
మీ పెదవి వంపుల్లో నే నవ్వుతున్నాను.
మీరు
అద్దాల్లో చూచుకుంటున్నప్పుడు
మీ ముఖాల్లో నేను కనబడతాను
మీ మాటల్నిండా నా రక్తం చారలే
మీ అంగిట్లో సుడి తిరుగుతున్న సముద్ర సందోహాలూ నేనే
మీ కళ్ళలో చెలగేగుతున్న తాచుపాము పగలూ నేనే
కళ్ళు కనపడకండా ముఖంమీద
జుట్టును పక్కకు దీసి
సరైన పంథాలో పథంలో మిమ్మల్నొదిలిన మాతృహస్తమూ నేనే-
నా వెంటేసుకుని
నగరాలు తిప్పాను, అడవులు తిప్పాను
(చేతివేళ్ళలో జన్మిస్తున్న రహస్య స్థావరాల్ని చూయించాను)
వీధి వీధికీ కంటికంటికీ తిప్పాను
తిప్పి, తిప్పి బోధివృక్షంకింద
విముక్తి మార్గం ప్రబోధించి జలతుల్యం చేసి జనంలోకి వదిలాను-
పొండి!
ఏరులై పొండి, నదులై పొండి, అడవులై పొండి
అనంత సస్యశ్యామల సుక్షేత్రాలయి పొండి
నాగళ్ళవ్వండి, కొడవళ్ళవ్వండి, తుపాకులవ్వండి
కలాల్ని మట్టిలో నాటి ఎర్రసేనల్ని మొలిపించండి
కానీ
మీ రక్తంలో పడిలేస్తున్న విద్యుత్ కెరటాల్ని దాయగలరా?
మీ ముఖాల్లో కన్పిస్తున్న
మరో ముఖం మీద మసి పూయగలరా?

-కె. శివారెడ్డి

మనోవిజ్ఞాన శీర్షిక :


మనసు సంగతి

డా॥ జయానాగరాజ్

సన్నగా రివటలా వుంటుందావిడ. నలభై ఏళ్ళకే ముసలికళ ఆవరించింది. అతిగా... తేలికగా మాట్లాడుతూ జీవితంలో తను ఎట్లా మోసపోయింది తప్పిపుచ్చాలని చూస్తుందావిడ.

చిన్నప్పుడే తండ్రి పోయాడు. పదో తరగతి చదువుతున్నప్పుడు తల్లిని పోగొట్టుకొని తన చెల్లికీ, తమ్ముడికీ తానే సంరక్షకురాలిగా వుండిపోయింది. చదువు మీద ఆసక్తి మెండు. చిన్న బడిలో టీచరుగా చేరి, చెల్లినీ, తమ్ముడినీ చదివిస్తూ తెలుగు పరీక్షలు, హిందీ పరీక్షలు కట్టింది. ఇంటికి మరి తానే పెద్దదిక్కయింది. ఒంటరి జీవితం, బాధ్యతలు.... అన్నింటినీ మరచి తన మనస్సును చదువు మీద లగ్నం చేసి చాలా పరీక్షలే పాసయింది. మధ్యలో ఓ సంబంధం వచ్చింది. కాని అవతలి వారు ఆమె చెల్లిని, తమ్ముడిని తమతో పాటు వుంచుకోడానికి నిరాకరించారు. దానితో ఈమె వివాహానికి స్వస్తి చెప్పింది. చెల్లికి చదువు అబ్బలేదు. సంబంధం చూసి మూడు ముళ్లు వేయించింది. రెక్కలు వచ్చిన పక్షిలా తమ్ముడు చదువు పూర్తి చేసుకొని అస్సామ్‌లో వుద్యోగం రాగానే వెళ్ళిపోయాడు. వర్ణాంతర వివాహం చేసుకొని అక్కమాటే మరిచిపోయాడు. అందరూ తమ జీవితాలలో స్థిరపడిపోయేసరికి వరలక్ష్మికి నడివయస్సు నెత్తిన పడింది. తానుంటున్న చిన్న పెంకుటిల్లు చిన్నబోయింది. చుట్టూ క్రీనీడలు.... జ్ఞాపకాలు... ....కొడిగట్టుతున్న తన జీవన జ్యోతీ, తనూ మిగిలారు. ఒంటరి జీవితం....లెక్చెరరుగా ఎదిగిపోయిన తన హోదా....డబ్బు....

ముగ్గురమ్మాయిల వ్యధ!




అందరి కళ్లూ యిన్ని ఏండ్ల తరువాత ఆమె మీదే కేంద్రీకరించాయి. ఒంటరితనాన్ని భరించలేక దూరపు చుట్టాల తాలూకు అబ్బాయిని తెచ్చి పెంచుకోవడం మొదలుపెట్టింది. ఆమె డబ్బుమీద ఆశలు పెంచుకుంటున్న వారందరికి ఇది చెంపపెట్టు. కానీ నీచ సమాజం చూస్తూ వూరికే వుంటుందా, పనికిమాలిన ప్రచారం చేస్తూ తల్లీ కొడుకుల్ని అనుమానించడం ప్రారంభించింది. అంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు నిలకడగా వున్న వరలక్ష్మి మనస్సు కలుక్కుమంది. అందరికీ తను స్వపర భేదం లేక మంచినే పంచియిచ్చింది....కాని తనకు సంఘం అందించిందేమిటి?? నైరాశ్యం....!! మనసు కృంగిపోయింది. ఏదోపోగొట్టుకున్నదానిలా తిరిగింది కొన్నిరోజులు.. తన ఈ విచార స్థితినుండి బయటపడాలనే ప్రయత్నంలో మరల మనసు చదువుమీద కేంద్రీకరించింది. నిద్ర కరువయింది. తాను చేసింది మంచిపని అని నలుగురికీ చాటి చెప్పాలనే ఉద్దేశంతో అతిగా మాట్లాడడం.... కనబడిన వారి నందరినీ ఆపి తన కథ చెప్పడం మొదలుపెట్టింది, దీనిని అతిధోరణి రోగం (మానియా) అంటారు. మనసులో యిముడ్చుకోలేని బాధ ఒక ధోరణిగా మారి పైకి పొంగి వస్తుంది ఉప్పెనలాగా....


2

ముక్కుబేసరి, చెవులకు జుంకాలు.... మెడలో పెద్దపెద్ద మంగళసూత్రాలు....

చేతులనిండా గాజులు....వడ్డాణం....చేతులలో గట్టిగా పట్టిన స్టీలు గ్లాసు, పళ్ళెం....పర్సూ........యిది సుజాత వేషం....ముప్పైఏళ్ళ సుజాత అందంగానే వుందనవచ్చు, సన్నగా, చామన ఛాయలో! ఆమె పదహారవ ఏట తల్లి దండ్రులు చనిపోయారు. పోతూ 5 ఎకరాల భూమిని యిద్దరు కూతుళ్ళ, యిద్దరు కొడుకులకు పంచి పోయారు. పెద్దన్న పంచ చేరారు ఆడపిల్లలు. పి.యు.సి.తో చదువాపి పెళ్ళి చేస్తామంటూ అన్నా వదినలు కొంత ఆస్తి రాయించుకున్నారు. కాని ఆ ప్రయత్నాలేమీ చేయలేదు సరికదా యింట్లో వూడిగానికి వేసుకున్నారిద్దరాడపిల్లల్నీ!

అక్కడినుంచి సుజాత చుట్టపు చూపుగా వచ్చి చిన్నన్న యింట్లో వుండిపోయింది. బ్రతిమాలి బామ్మాలి చిన్న వుద్యోగం సంపాదించుకుంది... ఏదో జీతం తెచ్చుకుంటున్న చెల్లిని మరీ పెద్దన్నలాగా అల్లరి పెట్టక తనింట్లో వుంచుకున్నాడు రమణ. కాని ఏ అన్నకు కూడా చెల్లెళ్ళ పెళ్ళి గురించిన ఆలోచన లేకపోయింది. ఉద్యోగం చేస్తూ, వయసులో వున్న ఆడపిల్ల అంటే అందరికీ అలుసే....ఒక ఉత్తముడు ఆమెను వివాహ మాడతానని మభ్యపెట్టి....మోసగించి.....వంచించి పత్తా లేకుండా పారిపోయాడు. అప్పటి నుంచి జీవితంమీద విరక్తి కలిగింది. తనచుట్టూ వున్నవారిమీద వెగటు....అందరినుంచీ దూరంగా వుండాలనే తపన. ఇల్లు మారింది. కంపెనీవారి యిళ్ళలో వుంటూ వచ్చింది. స్వార్థ





లోకానికి దూరంగా....కాని కాకుల లాగా పొడుచుకుతినే మనుషులు ఆవిడను వదలలేదు....ఒంటరిగా వున్న ఆడదానిని చూస్తే మగతనం....మదం అవధులు దాటుతుంది మరి....ఆవిడను వెంటాడి, చేజిక్కించుకుందామనే ప్రయత్నాలు ఎన్నో జరిగాయి. దానితో విసిగి బజారునుంచి మంగళసూత్రాలు తెచ్చి వేసుకొని తనకు వివాహమైందని చాటుతూ పనిమాలి ఆడదానివెంట పడే మగవారి బారినుండి తప్పించుకోవాలని చూసింది సుజాత......రక్షణ లేని బ్రతుకు....ఎందుకూ కొరగాని జీవితం, జారిపోతున్న యవ్వనం....భంగపడిన హృదయం....తీరని కోరికలు—అన్నీ కలిసి ఆవిడను ఉక్కిరిబిక్కిరి చేశాయి. చుట్టూ వున్న సంఘం ఆవిడకు సానుభూతి పంచడానికి బదులు వ్యభిచరించిందని నిందలు మోపి రాళ్లు రువ్వింది. పిచ్చిదని పకపక నవ్వింది....రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములు ఆస్తి కోసం రాబందులలాగా వెంటబడ్డారే గాని ఆవిడను ఆదుకోలేదు....సరిగదా వేలెత్తి చూపుతూ ఆమెను వెలివేశారు. తనకూ ఒక యిల్లూ, భర్తా, పిల్లా జల్లా వుండాలనే కోరిక కోరికగానే మిగలగా వంచించబడ్డ సుజాత పిచ్చిదయింది. తనమీద దుమ్మెత్తిపోసిన జనాన్ని తిడుతూ..కోపంతో, క్రోధంతో బుసలు కొట్టుతుంది....తనను తాను చూచుకొని నవ్వుకుంటుంది. జీవితంలో ఎవ్వరినీ నమ్మలేక బెదురు చూపులతో అటూ

యిటూ చూస్తూ మూలకు నక్కుతుంది. అవును మరి....సుజాత పిచ్చిది!

3

"నాలుగు పేకెట్ల సిగరెట్లు....డాక్టర్.. నాలుగు పెగ్గుల విస్కీ....కావాలి.... ఏమ్మంటారు?" అంటూ కళ్ళు పెద్దవి చేసి చుట్టూ చూస్తూ మత్తు ఇంజక్షన్ (పెథిడిన్ ఇంజక్షన్) కోసం తడుము కుంటూ అడిగింది రత్నం....వ్యసనాలకు బలి అయిన రత్నం....మనసుకు తగిలిన దెబ్బనుంచి తప్పించుకోవాలని ఈ కృత్రిమ జీవితానికి అలవాటుపడ్డ రత్నం....ఈనాడు త్రాగుడు, మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడ్డ వ్యక్తి ఒక అడిక్ట్!

ఆవి రత్నం చదువుకుంటున్న రోజులు..సన్నగా నాజూకుగా వుండేది. నవ్వుస్తూ అందరినీ ఆకర్షించేది రత్నం. మోహన్‌కు ఆమె అంటే మక్కువ. కాని గాలిలో మేడలు కట్టే రత్నానికి మో హ న్ కనిపించలేదు....నర్సుగా తరిఫీదు పొంది మిలిటరీలో చేరింది... అవి యుద్ధపు రోజులు........బాంబుల చప్పుళ్ళు....చీకటి...కీచురాళ్ళ ధ్వనుల మధ్య మూలుబు....రక్తపాతం....చావు బ్రతుకులమధ్య పోరాటం....పనిలో తిరుగుతూ విరామం లేని ఆమె హృదయం అలసి సొలసి మూల్గింది. దానికి జవాబుగా మేజర్ రావుగారి హృదయం స్పందించింది........రత్నం వాళ్ళ యూనిట్‌కు డాక్టరుగా వచ్చిన రావు గారు పనిలో విరామం, మనసుకు ఆహ్లాదం, శరీరానికి ఆనందం కలిగించారు....రత్నం....రతనాల కలలు కనడం మొదలుపెట్టింది....ముత్యాల పల్లకీలో విహరిస్తూ బంగారు భవనాలలో నివసించింది........రోజులు అతి వేగంగా గడిచిపోయాయి. యుద్ధం ముగిసింది., త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరింది....మేజర్ రావ్. అందరి దగ్గరా సెలవు పుచ్చుకున్నారు........ "నేనూ మీతో వస్తున్నాను" అంటున్న రత్నాన్ని భుజం తట్టి "నీ దారి నీది, నా దారి నాది...." అన్నట్లు చూశారు. హుందాగా నడుచుకుంటూ వెళ్ళి తన కోసం ఎదురు చూస్తున్న భార్యా పిల్లలను కలుసుకొని చెయ్యి వూపుతూ ఆనందంగా వెళ్ళిపోయారు. అప్పుడే రత్నం తలమీద ఆటంబాంబు పడింది! చుట్టూ చీకటి... దారి తెన్ను తెలియని ఒక ఎడారి... జీవితం....ఈ మిథ్యా జీవితాన్ని మరచిపోవడానికి త్రాగుడు, సిగరెట్లు, మత్తు ఇంజక్షన్లు అన్నీ ఒక దాని తరువాత ఒకటి ఆమెను ఆవరించాయి. కలలు తేలిపోయి నిజ జీవితం లోనికి కాలు పెట్టేసరికి మోహన్ చేయూత యిచ్చాడు. యాంత్రికంగా యిద్దరు బిడ్డలను కన్నది. కాని తన కలలనుండి తేరుకోలేకపోయింది. తన అనుభవాలను మరవలేక అలవాట్ల నుంచి తప్పించుకోలేక భయపడి; భంగపడిన రత్నం ఈనాడు మానసికవ్యాధికి గురి అయింది....ఈ వ్యసనాల బారి నుండి తప్పించుకోవాలని ఈనాడు శత విధాల ప్రయత్నిస్తోంది! ❊

కుక్కపిల్ల

పులికంటి కృష్ణారెడ్డి

నడి వీధిలో పడ్డాడు అప్పన్న!

తనకు తానుగా పడలేదు.

అబ్బచేసిన చేతలకు అప్పన్న నడివీధిలో పడ్డాడు.

నడిమిట్టమీద పొద్దు. ఉచ్చి పీకుతూ ఉంది. దాహం వేసింది. ఊరికి దక్షిణంగా వున్న కొబ్బరినీళ్ళ కొలను మనసులో మెదిలింది. కొలనువైపు చూశాడు. కొలనుగట్టు-గట్టుమీద చలువరాతి బండలు-కొలనుకు తూర్పు దిశగా సత్రం-కంటపడ్డాయి. తుపుక్కున ఉమ్మాడు. గిరుక్కున వెనక్కు తిరిగాడు. ఇల్లు కంటపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆలోచిస్తూ ఎటో దృష్టి మరల్చాడు. ఊరి ముందర పొలాలు కనుపించాయి-కనుల పండువుగా!—కడుపు రగిలింది.

పేదవాడి కోపం పెదవికి చేటు!

ఏమీ చేయలేని స్థితి!

ఈ వయస్సులోనే తన కాళ్ళమీద తాను నిలబడ వలసిన గతి!!—

వంగి తన కాళ్ళ వైపు చూసుకొన్నాడు.

కాళ్ళముందర ఓ కుక్కపిల్ల!—

తన యింట్లో గొర్రెలమంద ఉన్నప్పుడు ఆ మంద వెంట తిరుగుతూ ఉండేది ఓ కుక్క. ఆ కుక్క ఈనింది. ఈనిన నెల తిరక్కముందే ఏ మాయదారి రోగమొచ్చిందో యేమో?—ఆ కుక్క చచ్చిపోయింది. తల్లి పాలకు, ఆదరణకు నోచుకోని ఆ కుక్క పిల్లలు ఒక్కొక్కటిగా జీవితాన్ని కడతీర్చుకొని వెళ్ళిపోతే-కడకు మిగిలింది ఒక్కగానొక్క కుక్కపిల్ల. కాళ్ళ ముందర నిలబడి ఉంది.

గొర్రెలమంద పోయింది. ఎద్దులు పోయాయి. ఆవులు పోయాయి. ఇల్లూ వాకిలీ పోయింది. పొలము పుట్రా పోయింది. కని పెంచిన తల్లీ దండ్రి పోయారు. కానీ—చిన్నప్పటి నుండి తాను విసిరేసింది తిని వెంట తిరిగిన కుక్కపిల్ల మాత్రం వదిలిపోలేదు.

అప్పన్న పెదవులపై ఓ చిరునవ్వు తొంగి చూసి తొలగి పోయింది!

నడి వీధిలో అలానే నిలబడ్డాడు



అప్పన్న!....

అది ఒక పల్లె!

పల్లె పల్లెకూ ఓ పేరు ఉంటుంది. ఆ పల్లెకూ ఓ పేరు ఉంది. ఏమిటా పేరంటే?—కొజ్జా మొగుడు కోటలో ఉన్నా ఒకటే పేటలో ఉన్నా ఒకటే అన్నట్లు-ఆ పల్లె పేరు తెలుసుకొన్నా ఒకటే, తెలుసుకొనక పోయినా ఒకటే!!—

పోనీ-ఎక్కడుందాపల్లె? అదైనా తెలుసుకోవచ్చా? అని అంటే—

నిరభ్యంతరంగా!—

ఈ పవిత్ర భారతదేశంలోనే ఉంది.

ఎత్తయిన మేడల్ని-మత్తులో తూలే కన్నుల్ని-మెడ మీద కంతల్ని

చూపించి-యివి మనం సాధించిన ప్రగతికి నిదర్శనాలు కావా? అని అడిగే ఓ ప్రబుద్ధిడికి-పైకప్పుకు పిడికెడు చెత్తకి నోచుకోని పూరికొంపల్ని-కన్నీళ్ల కాపురం పెట్టిన చెంపల్ని చూపించి-మరి వీటినేమంటావ్?-అని సవాల్ చేయడానికి సాక్షాత్కరించినట్లుందా పల్లె!

ఆ పల్లెకు దక్షిణంగా ఓ కొలను ఉంది. ఆ కొలనులోనివి కొబ్బరినీళ్లు! అందులో విచ్చి వికసించిన తామరల్ని-వాటిమధ్య మూతి ముడుచుకున్న కలువల్ని-ఎర్రకలువల్ని చూడడానికి చాలవు కళ్ళు!....

ఆ కొలనుగట్టుమీద యేపుగా పెరిగిన చింతచెట్లు-వెలగచెట్లు-వేపచెట్లు ఉన్నాయి. వాటిక్రింద చలువరాతి బండలున్నాయి. "ఏ పుణ్యాత్ముడు పున్నెం కట్టుకొన్నాడో యేమో?" అని ఎండ పొద్దున ఆ చలువరాతి బండలమీద కూలబడిన బాటసారులు అంటూ ఉంటారు. అయితే తద్వారా అతడెంత పున్నెం మూటగట్టుకొని పోయాడో, అంటున్నవాళ్ళకూ తెలియదు. వింటున్న వాళ్ళకూ తెలియదు.

ఆ కొలనుకు తూర్పుగా ఓ సత్రం. భవబంధాల విముక్తికై ఓ మనిషి చేసిన యత్నం! - ఫలించిందనుకొనేలోపలే అతని బ్రతుకు పండింది. అతడు భవబంధాల నుండి శాశ్వతంగా సెలవు దీసుకొని వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆ సత్రం గతి అంతే!

ఆ పల్లెలో ఆడవాళ్ళచేతి మగవాళ్ళున్నారు. మగ వాళ్ళ చేతి ఆడవాళ్ళున్నారు. అసలు సిసలైన మగవాళ్ళు ఉన్నారు. వీళ్ళందర్నీ తలదన్నే 'మగరాయుళ్ళు' ఉన్నారు.

ఆడవాళ్ళ చేతి మగవాళ్ళయినా—మగవాళ్ళచేతి ఆడవాళ్ళయినా—"ఆడమగ", "మగఆడ"లో అట్టే తేడాలుండవు కాబట్టి—వాళ్ళను గురించి ఆలోచించవలసిన అవసరంలేదు.

ఇక మగ రాయుళ్ళంటారా?—


పొద్దుపుట్టిబారెడెక్కక ముందే కొలను గట్టుపై చేరుతారు. కొలను గట్టున ఓచెట్టునీడలో టీ కొట్టు!— టీ కొట్టులో అందాల అలిమేలు. ఆమె చేతి టీకి రుచి ఎక్కువ. ఆప్యాయంగా తాగుతారు. అటుపై కొందరు చలువ రాతి బండలమీదికి, మరికొందరు సత్రంలోనికి చేరుకొంటారు.

చలువరాతి బండలమీద పులిజూదం —సత్రంలో పేకాట!—పంతాలమీద కొనసాగుతూ ఉంటుంది. ఆడే వాళ్ళు కొందరయితే ప్రక్కన కూర్చుని పై పందెం పాడే వాళ్ళుకొందరు. ఊరు మీద ఊరు పడవచ్చు. పొద్దుగూట్లో పడవచ్చు. అటు పులిజూదం కానీ — యిటు పేకాటకానీ ఆగడానికి మాత్రం వీల్లేదు.

ఈ మగరాయుళ్ళకు కన్ను కత్తరించడానికీ తెలుసు?

కన్నెచెర విడిపించడానికీ తెలుసు!;

టెంకాయలు కావచ్చు. అవి మిరప తోటల్లో వంకాయలు కావచ్చు. పెద తోటల్లో మామిడి కాయలు కావచ్చు. రెడ్డోరి నిమ్మతోటలో నిమ్మకాయలైనా కావచ్చు.



ఏకాపు కా కోపు!

మాటు మణిగితే చాలు. మనిషి మొగం మనిషికి కనుపించని చీకటి అలముకొంటే చాలు. పండిన పంట పొలాలమీద పడడమో? లేకుంటే— కాపు కొచ్చిన తోటలమీద పడడమో?- ఆ మగరాయుళ్ళకొక సరదా!

కోసు కొచ్చిన కాయలో—పులుము కొచ్చిన ధాన్యమో?—వీలైతే అలమేలు అంగడి చేరుతుంది. లేకుంటే సరాసరి అక్కడికి నాలుగు మైళ్ళ దూరానవున్న పేట చేరుతుంది. అక్కడ చేతులు మారుతుంది. చేతులు మారడమంటే బేరం. అది ఒకటికి సగం బేరం. ఆ బేరంలో నాలుగు కాసులు మగరాయుళ్ళ చేతికందుతుంది. ఆ మరునాడు పులిజూదానికో పేకాటకో పెట్టుబడి అవుతుంది.

ఇక ఆ ఊళ్ళో అసలు సిసలైన మగవాళ్లున్నారు, వాళ్ళు ఎద్దులగొట్టి ముద్దలు తింటారు. వాళ్ళు దేశానికి వెన్నెముకలు.

ఈ అసలు సిసలైన మగవాళ్ళల్లో అప్పన్న ఒకడు!

ఈఅసలు సిసలైన మగవాళ్ళందరు ఎద్దులగొట్టి ముద్దలుతింటుంటే అప్పన్న కూడా అదే పని చేయాలి, అయితే అప్పన్నకు అరసెంటు భూమిలేదు.

అప్పన్న తండ్రి సుబ్బన్న. సుబ్బన్న ఆ పల్లెలో కాడెద్దుల సేద్యగాడు. మూడంకణాల పూరిల్లు—ఆ పూరింటి ముందర ఓ పసువుల కొట్టం, ఆ కొట్టంలో కాడి మెడమీద పెడితే ఖణిల్లని రంకె వేసే జోడు గిత్తలు—పూటకు రెండు ముంతల పాలు పిదిగే రెండు పాడి ఆవులు—ఇంటి వెనుక యింటికి తగినంత ఖాళీ జాగా-ఆజాగాలో ఓమంద గొర్రెలు!-

సుబ్బన్న మోతుబరి రైతంటే కాదంటారు.

"సుబ్బన్న కేంవుందిలే!" అంటే ఒప్పుకోరు!

సుబ్బన్న పెళ్ళాం గంగులమ్మ. చుక్కలాంటి మనిషి. అటు పొలానికి వెళ్ళినా — యిటు యింటి దగ్గరైనా వాళ్ళిద్దరూ కూడా మాడా పనిచేసుకొంటుంటే చూడ ముచ్చటగా ఉంటుంది.

ఆమె యింటి ముందు కళ్ళాపు చల్లుతూంటే అతడు పేడదిబ్బకెత్తుతాడు.

ఆతడు కపిల కడితే ఆమె పార చేత పట్టుతుంది.

అతడు పడక దున్నుతూంటే ఆమె పెద్ద పెద్ద పిట్టలు పగుల గొడుతూంటుంది.

రెండు బార్ల పొద్దెక్కక ముందే పొలం పనులు ముగిస్తారు. రెండు బార్ల పొద్దెక్కేసరికి యిల్లు చేరుతారు. ఒకరు ఆవుల పాలుపిండుతూంటే యింకొకరు గొర్రెల పాలు పిదుకుతారు. ఆమె పాల చెంబు చేతపట్టి అలివేలు అంగడికి వెళుతుంది. అతడు గొర్రెల మంద వెంటపడతాడు.

తగులుతున్నా తడుముకొనక పోవడమనేది ధైర్యవంతుడి లక్షణం. భారత దేశం చాలా ధైర్యవంత మయింది. ఎన్నెన్ని ఎదురు దెబ్బలు తగులుతున్నా తడుముకోకుండా ముందుకే పోతూంది. ముప్పై కోట్ల జనాభా అరవై కోట్లకు దాటించి. అన్నింటి కంటే యిది చాలా పెద్దదెబ్బ. అయినా లెక్క చేయడంలేదు. ఇప్పుడిప్పుడే ఆలోచన మాత్రం నామమాత్రంగా ఆరంభమయింది. మే మిద్దరు — మాకు ముగ్గురా? లేక యిద్దరా? అన్నమీమాంసలో పడింది.

కానీ మే మిద్దరు మాకు ఒక్కడే! అన్నాడు సుబ్బన్న!

అప్పన్న అల్లారు ముద్దుగా పెరుగుతున్నాడు.

కడివెడు పాలు చెడిపోవడానికి ఓ ఉప్పుకల్లుచాలు!

పొంగుతున్న సంసారం పొయ్యి పాలు కావడానికి ఏమాత్రం యేమరు పాటైనాచాలు!!

గొర్రెల కాచుకొంటూ బండల మీద కూర్చుని ఉబుసు పోకకు నేర్చుకొన్న పులి జూదం సుబ్బన్నను గుంట కట్టమీద చలువబండల మీదికి చేర్చింది.

జూదంలో అతడు "పులి" అనిపించుకొంటూ, ఒక్కొక్క మెట్టు పైకెక్కుతున్నాడు. అతడి సాంసారిక పరిస్థితి మెట్టు మెట్టుగా కిందికి దిగుతూ ఉంది.

గొర్రెల మేపడానికి మనిషిలేక సుబ్బన్న మందను అమ్మకానికి పెట్టాడు. ఆ మాట చెవిని పడ్డ గంగులమ్మ కుయ్యో! మొర్రో!! అనిమొత్తుకొనింది. పులి జూదం మోజులో తల మునకలవుతున్న సుబ్బన్న ఆలి మాటల్ని ఆలకించడానికి, ఆ స్కారం లేక పోయింది. రుచి తెలియని వాళ్ళకు చెప్పినా లాభం లేదనుకొన్నాడు. తన అభిరుచి తనదను కొన్నాడు.

గొర్రెలమంద "రెడ్డోరి" మందలో కలిసి పోయింది.

సుబ్బన్న చేతిలో నాలుగు కాసులు



మెదులుతున్నాయి. ఆ హుషారులో సుబ్బన్న మకాం చలువబండలమీది నుండి సత్రానికి మారింది. ఇప్పుడు చింతగింజలకు బదులు వింతవింత రంగుల యిస్పెట్టాకులు సుబ్బన్న చేతిలో తిరుగుతున్నాయి.

సుబ్బన్న చేతికి పైసలు చింతగింజల్లా వచ్చినట్లు వస్తున్నాయి. పోతున్నాయి.

ఓడిపోతూనే ఉంటే ఆడడమంత అందగించదేమోకానీ-గెలుస్తూ ఓడుతూ ఉంటే ఆ మజానే వేరు. సుబ్బన్నకు పెళ్ళాం పిల్లలు-యిల్లు వాకిలీ ఏమీ కనుపించడమేలేదు. ఒకవేళ కనుపించినా కన్నెర్ర చేస్తున్నాడు. కానీ ఆటలో కావలసిన ఆకు చేతికందితే అందల మెక్కినంత కాదు-ఆట గెలిచినంత సంబరపడిపోతున్నాడు.

గంగులమ్మ విషమిస్తున్న పరిస్థితుల్ని గమనించింది. భవిష్యత్తును గురించి ఆలోచించింది. ఒక్కగానొక్క బిడ్డను అక్కున చేర్చుకొని ఒంటరిగా కూర్చొని యేడ్చింది. వాడి భవిష్యత్తును తలపోసి కలవరపడింది. కనీసం వాడికోసమైనా మనిషిగా బ్రతకడానికి నిశ్చయించుకొనింది.

ఆ మరుసటిరోజే ఓ సేద్యగాడిని కుదిరించుకొనింది. ఆయన యింటికంటూ వస్తే వేళకింత తిండి పెడదామని నిర్ణయించుకొనింది. ఆ యింటికి ఆడామగా తానే అయినట్లు యిటు యింట్లో అటు పొలంలో రాత్రింబవళ్లు అటు కూర్చోవడంలేదు. ఇటు నిలబడడంలేదు.

ఓరోజు రెండుబారల పొద్దెక్కింది. అప్పుడే గంగులమ్మ పొలంనుండి

తిరిగి వచ్చింది. కడపలో కాలుబెడుతూ కాలటు యిటు కదపలేకుండా నిలబడి పోయింది!

భుజాన బండి కదురుగోలు-చేతిలో ఎద్దుల పగ్గాలు అలానే ఉన్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తుంటే ఆమె కడుపులో దేవినట్లయింది. కండ్లు తిరుగుతున్నాయి. ఇల్లు తలక్రిందు లవుతూ ఉంది. నిల బడడం కష్టమనిపిస్తూ ఉంది. చేతిలో పగ్గాలు చేజారిపోతున్నాయి. భుజాన బండికదురుగోలు జారి కాలి మీద పడ్డాయి.

ఆమె కుప్పగా కూలిపోయింది!

ఆ యింటి కామధేనువులు కన్నీళ్ళ తో కదిలిపోతున్నాయి!

సుబ్బన్న తిరిగి చూడకుండా గుంట కట్ట ఎక్కుతున్నాడు!

కుప్పగా కూలిపోయిన గంగులమ్మను ఎవరో పైకి లేపారు. పైకి లేస్తే తనకు తానుగా లేవాలికానీ-ఒకరు లేపితే ఎంత వరకు?-మంచంమీది వరకు!

మనోవ్యాధికి మందు లేదు.

ఆమె మళ్ళి పైకి లేవలేదు.

సుబ్బన్న అప్పుడప్పుడు ఈ లోకం లోనికి వస్తున్నాడు. వచ్చినపుడు మాత్రం ఓ క్షణం మంచానికి కరచు కొన్న పెళ్లాన్ని-కంచంముందు కూర్చుని అరుస్తున్న కొడుకునుగురించి ఆలో చిస్తాడు. బాధ కలుగుతుంది. బాధోప శమనానికి మందు. అదే పుచ్చుకొం టాడు-గవర్నమెంటు సారాయి కొట్లో! మళ్లీ అదే లోకానికి వెళ్లిపోతాడు.

సుబ్బన్న ఈ లోకంలో మనిషిగా జీవిస్తూ-ఆ లోకంలో పడి ఆడుతున్న పుడు ఓడుతూ ఉండేవాడు. ఓడినదాని కంటే ఎక్కువగా గెలిచేవాడు. కానీ ఆ లోకంలోనే మనిషిగా మిగిల్నప్పుడు ఓడిపోవడమే ఎక్కువయింది.

ఓడిపోతూంటే బాధ. బాధకు విరు గుడు మందు. మందుతో బాధ విరుగు డైతే ఆనందం. ఆనందంలో మళ్లీ ఆట. ఆడితే మళ్లీ ఓటమి. ఓడితే చేతిలో డబ్బుండదు. డబ్బు లేకపోతే ఆట కొనసాగదు. ఎలాగైనా ఆడాలి. ఆడాలంటే డబ్బు కావాలి. ఆస్తిని అమ్ముతూ పోతే వస్తూ ఉంటుంది డబ్బు. అయితే తవ్వుతూ పోతే కొండ లైనా తరిగిపోయినట్లు అమ్ముతూ పోతే ఆస్తులు హరించుకుపోవడం ఎంతసేపు?

సుబ్బన్న జీవితంలో పూర్తిగా ఓడి పోయాడు.

మనోవ్యాధితో మంచమెక్కి తల్లి పోయింది.


తాగితాగి తండ్రి తల్లికి తోడుగా వెళ్ళిపోయాడు!!

అప్పన్న వీధిలో పడ్డాడు. అప్పు డతని వయస్సు పదిహేనేండ్లు.

"ఒరె! పొద్దుగూకులూ యిట్లా ఈ సెట్లకింద కుచ్చోని ఆడతావుంటే-రే పెట్లా బతకపోతావ్రా! - మణుసులుగా పుట్టే సరా?-సిగ్గూ సేవూ ఉండక్కల్లా?"

గుంటకట్టమీద బాధ్యత బాధపడుతూ ఉంది!-ఆ మాటలు అప్పన్న చెవిని పడ్డాయి.

"అవును. ఇక్కడ నిలబడి గెంటల తరబడి ఆలోచిస్తావుంటే ఆకలికి పరి ష్కారం దొరుకుతుందా?"-ఆలోచిం



చాడు అప్పన్న.

దొరకదన్నట్లు తల అడ్డంగా ఊగింది!

అందుకే బయలుదేరాడు ఆ చిన్న వాడు.

వంచిన తల ఎత్తకుండా ఊరికి ఉత్తరంగా నడిచాడు. దారి సాగినంత దూరం నడిచి ఆగిన చోట నిలబడ్డాడు. నిలబడి తల పైకెత్తి చూశాడు. ఎదు రుగా కొండలు. పల్లెకు కోట గోడల్లా ఎత్తయిన కొండలు!—ఆ కొండల మీద పడ్డాడు. కొన్ని చేతికి దొరికాయి. మరి కొన్నింటిని చెట్టెక్కి విరిచాడు. అన్నీ ఎండు పుల్లలు. ఓ మోపు గట్టాడు. నెత్తికెత్తుకొన్నాడు. ఊరి వైపు బయలుదేరాడు.

నీడలా వెన్నంటి వస్తూనే ఉంది కుక్కపిల్ల!

ఊరికి ఉత్తరంగా ఓ పెద్దబావి. ఆ బావి గట్టున ఓ కానుగ చెట్టు. ఆ చెట్టు బోదెకు మోపును ఆనించాడు. మెడ విరుచుకొన్నాడు. చేతకాని పని. అలవాటు లేదు. కాళ్ళు నిలబడడం లేదు. చెట్టుక్రింద చేరగిలపడ్డాడు. ఆ బాధను చూడలేనన్నట్టుగా కుక్కపిల్ల 'కుయ్యో! కుయ్యో!!' మంటూ ప్రక్కకు ఒదిగింది. ఒదిగిన కుక్క పిల్లను ఆప్యాయంగా గుండెలకు హత్తుకొన్నాడు అప్పన్న!

కట్టెలు తెమ్మని ఎవరూ అడగ లేదు. ఎవరికి అవసరమో కూడా తెలి యదు. ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగాలుచేసి ఊళ్ళేలవలెనని ఆశిం చిన తల్లి ముదిగారంతో సేద్యం చేయ డానికి వళ్ళు వంగలేదు. కట్టెలు తేవ డానికి కడుపు పూడడానికి సంబంధ

ఘుందని మాత్రం ఆలోచించగలిగాడు. తీరా తెచ్చిన తరువాత ఎలా చేయాలో తోచలేదు.

తనకంటే నిస్సహాయంగా తన వైపు చూస్తూ ఉంది కుక్కపిల్ల!

అప్పన్న నిమురుతూ ఉంటే ఏదో ఆలోచన వచ్చినట్లు ఎగిరిపడిలేచింది కుక్కపిల్ల. అతని జుట్టు నోటగరచి లాగుతూ ఉంది. అసలే అలసిసొలసి వున్న అప్పన్నకు కోపం వచ్చింది. విదిలించి కొట్టాడు. కానీ అది అదిరి పోలేదు. బెదిరి పోలేదు. జుట్టు వదలి పెట్టి మొలగుడ్డను పట్టి లాగుతూఉంది. ఏమీ తోచక అప్పన్న విసుక్కొన్నాడు. అదికాళ్ళమీదపడి వేడుకొన్నట్లు చూస్తూ ఉంది. కాళ్ళు నాకుతూ ఉంది. దాని తపన అర్థంకాక దానివైపు చూస్తుంటే మళ్ళీ మొలగుడ్డను పట్టి ముందుకు లాగుతూ ఉంది. దాని పోరుపడలేక పైకి లేచాడు అప్పన్న. కట్టెల మోపు నెత్తికెత్తుకొన్నాడు.

ఇంత వరకు వెంటపడిన కుక్కపిల్ల యిప్పుడు ముందు నడుస్తూఉంది!

దాని తీరుకు ఆశ్చర్యపడుతూ అప్పన్న దాని వెంటపడ్డాడు. అది నేరుగా 'రెడ్డోరి' యింటికి దారి తీసింది. దొడ్డి గుమ్మంవైపు లోన దూరింది. అప్పన్న దాని వెంటపడి నడుస్తూనే ఉన్నాడు.

రెడ్డోరి మిద్దింటి వెనుక ఓపినంత ఖాళీ జాగా ఉంది. అక్కడే పశువుల కొట్టాలున్నాయి. ఆనుకొని పెరడు ఉంది. పెరడు ప్రక్కనే పెద్ద పెద్ద వేడినీళ్ళ కాగులు అమర్చిన పొయ్యిలున్నాయి. అక్కడ నిలబడింది కుక్కపిల్ల. తోకాడిస్తూ....'కుయ్యో కుయ్యో!' మని అరుస్తూ అతని కాళ్ళ చుట్టూ తిరుగుతూ మూతిని పాదాలమీద రుద్దుతూ ఉంది.

అప్పన్న నెత్తిమీద మోపును దభీమని నేలవేశాడు.

ఆ శబ్దం విన్న రెడ్డెమ్మ ఆదరాబాదరా పెరట్లోకి వచ్చింది. ఓ క్షణం విస్తుపోతూ నిలబడింది. ఆ తరువాత 'అయ్యో పాపం! నువ్వా నాయనా!' అని సానుభూతిని ప్రకటించింది. ఇంటిలోనికి వెళ్ళి ఓ ముద్ద సంకటిని తెచ్చి అప్పన్నచేత పెడుతూ "ఎట్లాంటి వాళ్ళకెట్లాంటి కష్టం వొచ్చిందిరా దేవుడా!" అని వాపోయింది.

అప్పన్న పెద్దబావి గట్టుమీదికి వెళ్ళాడు. కానుగ చెట్టు నీడలో కూర్చున్నాడు. కుక్కపిల్లకంత పెట్టాడు. తానంత తిన్నాడు. ప్రాణం తేలికపడింది.

ప్రతిరోజు అడవికి పోతున్నాడు. కట్టెలు తెస్తున్నాడు. ఏ యింట్లోనో ఒక యింట్లో తనకు యిష్టమైన యింట్లో వేస్తున్నాడు. వాళ్ళు ఇంతపెడితే తింటున్నాడు. పెద్దబావి గట్టున కానుగచెట్టు నీడలో తలదాచుకొంటున్నాడు. కుక్కపిల్ల ఆతని పక్కలో ముడుక్కొంటూ ఉంది.

ఇప్పుడు ఊళ్ళో అందరు అప్పన్నను గురించి మాట్లాడే వాళ్ళే!

"వాడి ఈడు పిల్లకాయలు తేరకు తిని తిరిగ్గా గుంట కట్ట మీద జూదంవాడతా వుంటే—వాడు కట్టెలు తెచ్చి పొట్ట పోసుకుంటున్నాడు. వాడూ బిడ్డంటే!"

ఈ మాట బోడెబ్బ చెవిని పడింది!

బోడెబ్బ అప్పన్నకు వేలు విడిచిన మేనమామ! — నలుగురు ఆడ బిడ్డల తండ్రి.

"ఎవరి నోట్లో యిన్నా ఒకటే మాట! —'అప్పన్న ఎంత మంచోడు! ఎంత మంచోడు!' అని. ఏంవీలేక పొయ్యినా గుణవొకటుంటే అన్నీ వున్నట్టే! చేరదీస్తే సేదోడు వాదోడుగా వుంటాడు. ఆ తరవాత దేంవుడు మేలు జేస్తే ఒక బాధవూ తీరిపోతుంది!"- మేనమామ మేనల్లుణ్ణి గురించి ఆలోచించాడు.

ఆలోచించడమే తరువాయి. ఓరోజు సందకాడ పని గట్టుకొని వెళ్ళాడు.

కానుగ చెట్టు బోదెకు చేరగిలబడి అప్పన్న కుక్క పిల్లతో ఆడుకొంటున్నాడు. మామను చూస్తూనే ఎగిరిపడి లేచాడు. అప్పటికి అదేదో తన యిల్లయినటు—అ యింట్లో మామగారికి అతిధి మర్యాదలు జరుపవలసిన బాధ్యత నెత్తినున్నట్లు — 'కూర్చో మాంవయ్యా!' అన్నాడు.

బోడెబ్బ ఆ చెట్టు కింద ఓ రాతి మీద రారాజులా కూర్చున్నాడు.

"సూడప్పన్నా! నేను బతికుండగానే నువ్విట్లా సెట్ల కింద బతకడం నాకేదో బాధగానే వుండాది. నా బిడ్డల్లో ఒక బిడ్డ అనుకుంటా. నేను తినేది నీకింత పెడతా. ఇంటికి వచ్చేయ్ నాయినా!"— అన్నాడు.

అదో రకంగా నవ్వాడు అప్పన్న!

"ఎందుకురా నవ్వుతుండావ్?— నా మాట మీద నీకు నమ్మకం కుదర్లేదా? పచ్చని సెట్టు కింద కుచ్చోని సెప్తా వుండా!" — నమ్మించడానికి ప్రయత్నించాడు బోడెబ్బ.

"అదేంవీ లేదు మాంవయ్యా! మీరంటున్న మాటలు అనడానికి బాగున్నాయి. వినడానికంతకంటే బాగున్నాయి. అయితే జరగడం మాత్రం కల్ల. జరగదని తెలిసి కూడా తలపోసుకోవడం తలకాయనొప్పి!-అట్లా జరిగేటట్లయితే చెట్టు కిందికేం కర్మ?-అప్పుడే మీ ఇంటికి వచ్చేవాణ్ణి! - నన్నిట్లానే బతకనీయండి మాంవయ్యా!"— అన్నాడు.

అదీ నిజమనుకొన్నాడు బోడెబ్బ. మారుపలుక లేదు.

మౌనంగా లేచి వెళ్ళిపోతున్న మామగారి వైపు అప్పన్న అలానే చూస్తూ వుండి పోయాడు.

చూస్తూ చూస్తూ వుండగానే కానుగ చెట్టు రెండు సార్లు దిస మొలతో నిలబడి-నలుగురు చూచి నవ్విపోతారని భయపడి-పచ్చని చీర కట్టుకొని పండు ముత్తయిదువలా తయారయింది.

ఇప్పుడు అప్పన్న చేతికి ఓ కత్తి వచ్చింది. చంకకొక సొరకాయ బుర్ర వచ్చింది. కాళ్ళకు జత చెప్పులు వచ్చాయి. అడవిలో ధైర్యంగా వెళ్ళగలిగినంతదూరం వెళ్ళగలుగుతున్నాడు. ఏ కట్టె మండుతుందో, ఏ కట్టెలయితే తొందరగా వెల పోతాయో - అప్పన్న బాగా తెలుసుకొన్నాడు.

పుట్ట మీదనో, చెట్టు మీదనో నిలబడి అతడు కట్టెలు కొట్టుతుంటాడు.

అల్లంత దూరంలో నిలబడుతుంది కుక్క. అతడి వైపు దీనంగా చూస్తూ వుంటుంది. కొట్టిన కట్టెల్ని మోపు కట్టుకోవడాకికి ఓ చోట చేరవేస్తుం టాడు. అది గూడ ఓ కట్టెను నోట కరచుకొని తెస్తుంది. అతడు మోపు నెత్తికెత్తు కొంటే దారి చూపుతున్న ట్లుగా ముందు నడుస్తుంది. అలసి సొలసి మధ్యే మార్గంలో ఏ చెట్టు నీడలోనో మోపు దించి అలా ఆ చెట్టు నీడ లో వాలబడితే-ముందరి కాళ్లు రెండూ ఎత్తి రొమ్ము మీద పెట్టి మూతిలో మూతిపెట్టి ముదిగారం చేస్తుంది.

కష్టపడుతున్న తనని చూచి ఓ సాను భూతి వాక్యం పలకడానికి, తల్లి లేదు. కష్టసుఖాల్ని పాలు పంచుకొనడానికి అన్నలు లేరు. తమ్ముళ్ళు లేరు. అక్క చెల్లెండ్రు అసలే లేరు. వెంట ఉన్నది ఓ జంతువు. దానికి నోరు లేదు. మనసులోని భావానికి మాటరాదు.

ఈ భావన మనసులో మెదిలేసరికి ఆతని గుండె ద్రవిస్తుంది. కళ్లు చెమ్మ గిల్లుతాయి. చూడలేనన్నట్లుగా అది ఆతని రొమ్ముమీదనుండి కాళ్ళను దిం చేస్తుంది. తల వంచి మెలికలు తిరిగి పోతూ "కుయ్యో! కుయ్యో!"మంటూ ఆ చెట్టుచుట్టూ తిరుగాడుతుంది.

"ఏదో ఒక బంధం లేకపోతే బ్రతుక్కు అందమే ఉండదేమో?"- అనిపిస్తుంది అలాంటి సమయాల్లో అప్పన్నకు!

"ఆ సమయం కూడా ఆసన్నమ యిందిరా నాయినా!" అంటూ ఓరోజు బోడెబ్బ అప్పన్నను వెతుక్కుంటూ వచ్చాడు. కష్టాన్నినమ్ముకొన్న మనిషిని నమ్ముకుంటే నష్టముండదని బోడెబ్బ అభిప్రాయపడినట్లుంది.

"అప్పన్నా! ఎంతకాలమని యిట్లా వొంటిబతుకు బతకతావు నాయినా! నా మాటిను. ఇంటికొచ్చెయ్! -ఇంటికి రమ్మంటూఉండానంటే ఏదో పనీపాట సెయ్యడానికిగాదు. నా అల్లుడుగా రా!" అభ్యర్థించాడు బోడెబ్బ.

ఆ మాటలు వింటుంటే అప్పన్నకు డబ్బు విలువ తెలిసివచ్చింది.

"మామయ్యా! నాకా దిక్కూ దరీ లేదు. తల దాచుకోవడానికి జానెడు కొంప లేదు. కట్టెలమ్ముకుంటే కడుపు పూడతా వుంది. నన్ను అల్లుణ్నిగా చేసుకుంటానంటే నా చెవుల్ని నేనే నమ్మలేకపోతున్నాను. నీ కూతుర్ని పువ్వుల్లో పెట్టి పూజించుకుంటా! కానీ పువ్వుల్లో పెట్టి పూజించుకుంటానన్నా యిల్లరికం మాత్రం రాలేను మామయ్యా!

పొంగిపోయాడు బోడెబ్బ-అల్లుడు సంపన్నుడు కాకపోయినా అభిమాన సంపన్నుడని!


కానుగచెట్టు తెల్లని పువ్వుల్ని పల పల రాల్చింది!

కట్టెలమ్మేవాడిచేత తాళి కట్టించుకోవ డానికి కాంతమ్మ మనస్సు కష్టపడింది.

పల్లెలో పుట్టి-పల్లెలోనే పెరిగిన పడుచు! పల్లెత్తు మాట పలకలేదు!

కాంతమ్మ, అప్పన్న ఓ శుభగడి యలో ఆలూమగలైనారు!

ఊరికి చివరగా ఓ పూరి గుడిసెలో



కాపురం పెట్టారు.

అప్పన్న బాధ్యత పెరిగింది. కానీ బ్రతుకుతెరువు మారలేదు.

కోడికూతతో నిద్ర లేస్తాడు. ఇప్పుడు సొరకాయ బుర్రకు ఓ'సిక్కం' తోడయింది. కాంతమ్మ సిక్కంలో అంత సంకటి కట్టిస్తుంది. 'సొరకాయ బుర్ర' 'సిక్కం'-భుజాన వ్రేలాడు తుంటాయి. కత్తి చేతిలో ఉంటుంది. కుక్క వెంట ఉంటుంది. అడవికి బయలుదేరుతాడు. అడవిలో వెదకివెదకి మంచి చేవదేరిన కట్టెల్ని కొట్టుకుం టాడు. మోపు కట్టేటపుడు అందమైన పెళ్లాం మొగం మనసులో మెదులు తుంది. ఆ మొగంలో ఓ చిరునవ్వు చూడాలంటే నాలుగు కాసులు ఎక్కు వగా సంపాదించాలి. అందంగా కడ తాడు మోపు. ఇప్పుడు అప్పన్న బేరం పల్లెనుండి పేటకు ఎదిగింది. కాంతమ్మ కట్టిచ్చిన కవళాన్ని ఎండపొద్దున యే బావిగట్టునో కూర్చుని తిని అటునుండి అటే అడ్డుదారిపట్టి పేట చేరుతాడు. కట్టెలమ్ముకుంటాడు. పొద్దు గూట్లో పడేసరికి యిల్లు చేరుతాడు. వచ్చిన డబ్బును పైసలతోసహా కాంతమ్మ చేతుల్లో పోస్తాడు!

కానీ కాంతమ్మకు యేదో వెలితి?-

తన బ్రతుకు ఆ గుండు గుడిసెకే కుదించుకపోయిందని తపన!

ఇరుగు పొరుగు యింతకంటే ఎంతో హీనంగా బ్రతుకుతున్నా తనది వాళ్ళకంటే యింకా హీనమైన బ్రతు కని తనకు తనకే సందేహం!

బ్రతికి నంత బ్రతుకు బ్రతికి కడకు కట్టెలముకొనేవాడితో కాపురమా అన్న ఆవేదన!!

ఎంత కప్పి పుచ్చుకున్నా వీటి ప్రభా వం ఎప్పుడో ఒకప్పుడు అప్పన్న మీద పడుతూనే వుండేది. ఆ మాత్రం గ్రహించలేని అమాయకుడేమీ కాదు అప్పన్న. ఏ సమస్య అయినా కాలం చేతిలో పెట్టడం మంచిదన్న అభి

ప్రాయంతో నోరు కదిపేవాడు కాదు. పైగా మామగారికి మాట యిచ్చాడు- పువ్వుల్లో పెట్టి పూజించుకుంటానని!- ఓర్పు మంచిదే!-అయితే అమితమైన ఓర్పు బలహీనత క్రింద లెక్కకెక్కుతుంది. ఒకసారి లెక్క కెక్కిందంటే—చెల్లుబడడం మహా కష్టం.

అప్పన్న విషయంలో అక్షరాలా అంతే జరిగింది.

కాంతమ్మ కారణం లేకనే చీటికి మాటికీ ఈసడించు కోవడానికి అలవాటు పడిపోయింది.

అతడి కెప్పుడూ అడవిలోనే పొద్దు మొలిచేది. ఊళ్ళోనే పొద్దు కుంకేది. పొద్దు మొలిచి కుంకే లోపుగా అతడి ఆవజీవాలు అణగి పోతాయి. అప్పుడట్లా నాలుగు ముంతల వేడి నీళ్లు వొంటి మీద జారపోసు కుంటాడు. ఇంత ఎంగిలిపడతాడు. నులక మంచం మీద నడుము వాలుస్తూ వుంటే-కాంతమ్మ పాఠం ఆరంభిస్తుంది,

"ఏం బతుకో!....యిరం పరంలేని బతుకు! - ఒక మంచీ లేదు. సెడ్డా లేదు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు టింగు రంగా అని సింగారించుకొని వారానికొక సారైనా పోతా వుంటారు- పేటకు సిల్మాకని!-సిలమాలేదు. గిలమా లేదు. వండుకునేది. తినేది. పొణుకునేది. ఇంతే ఈ బతుక్కు!"

అలవాటయే కొద్దీ ఆవేశం తగ్గిపోయేటట్లుంది!

అప్పన్న బెల్లం కొట్టిన రాయిలా వుండడానికి అలవాటు పడిపోయాడు.

పెద్ద బావి గట్టున కానుగ చెట్టు పాత చీరల్ని విప్పి కొత్త చీరల్ని కడుతూనే వుంది.

ఓ రోజు—

అప్పన్న యింటికి రావడానికి చాలా ఆలస్యమయింది.

ఆ రోజు ఎంత తిరిగినా పేటలో అమ్మబోతే అడవిగా తయారయింది పరిస్థితి. తిరిగి తిరిగి విసిగి పోయాడు అప్పన్న. ఎవరికో ఒకరికి ధార పోసే సరికి పేటలోనే కను చీకటి ఆవరించింది. ఆలస్యమయి పోయిందను కొంటూనే అప్పన్న ఇంటికి వచ్చాడు. ఇంట్లో కాలు పెడుతూనే కాలు గిరడానికి సిద్ధంగా నిలబడి వుంది కాంతమ్మ. ఓక్షణం ఆమెను గమనించాడు. ఎన్నడూ లేనిది ఆమె అందంగా అలంకరించుకుని వుంది.

సందేహంగా చూస్తూ అప్పన్న అలానే నిలబడి పోయాడు!

"ఎందుకట్లా కదిలీ మెదల కుండా మాను మాదిరి నిలబడుకున్నావే?"- రెట్టించింది కాంతమ్మ.

"మరేం జెయ్యమంటావ్?"—

అలసి సొలసిన ప్రాణం. ఎక్కడ లేని విసుగు. ఒక్క మాట వెలువడింది చాలా కాలానికి.

నువ్వేఁవీ సెయ్యాల్సిన పని లేదు. పెళ్ళో నీళ్ళు కాగతా వుంటాయి. మూకిట్లో అంత సంకటేసి పెట్నాను. తిను. పొణుకో!- ఈదినాటక వంట. నేను పొయ్యి సూసేసొస్తా!"

నోట్లో మాట నోట్లోనే వుంది.

కాంతమ్మ కడపదాటి పోతూ వుంది.

తనలో తాను నవ్వుకున్నాడు

అప్పన్న. ఆ తరువాత అక్కడ నుండి కదిలాడు.

కాంతమ్మ అమ్మలక్కలతో చేరింది. ఏదో చెర నుండి విముక్తి పొంది నట్లుందామెకు. ఆమె ఆనందానికి అవధులే లేవు. నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ తూలుతూ పేలుతూ ఏదో స్వర్గ సుఖాన్ని చవి చూడబోతున్నట్లు వెళ్ళింది నాటకం చూడడానికి!—

సతీ సావిత్రి నాటకం!

కాంతమ్మ అక్కడ చేరే సరికి ఊరు ఊరంతా అక్కడే ఉంది. కూర్చోవడానికి కాసంత చోటు సంపాదించుకోవడమే కష్టమైపోయింది. ఎలాగో వాళ్ళను వీళ్ళను బ్రతిమలాడి తంటాలు పడింది. చంకలోని గోనె పట్ట పరచి కూర్చొనింది.

నాటకం ఆరంభమయింది.

సత్యవంతుడు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చి జీవిస్తున్నాడు.

"ఇది బలే బాగుందే!—యింటి కంటే గుడి బద్రవనుకుంటే అదిగూడ ఆడికే ఉందే!—రామేశ్వరంపొయ్‌నా శనేశ్వరం వదల్లేదంట. ఈడకూడా కట్టెల యాపారమేనా?"

అనలేదుకానీ అనుకొనింది కాంతమ్మ.

కానీ సావిత్రి భర్తను దైవ సమానంగా పూజిస్తూ ఉంది. అతనికి సకలోపచారాలు స్వయంగా నెరవేరుస్తూ ఉంది. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు.

కాంతమ్మకు ఏదో ఎబ్బెట్టుగా తోస్తూ ఉంది. నాటకం జరిగేకొద్దీ ఆమెకు ఆశ్చర్యం కలుగుతూవుంది.

ఓ రోజు సత్యవంతుడు అడవికి వెళ్లాడు. ఆ రోజే యముడు అతని ప్రాణాల్ని తీసుకొనిపోతాడు. సావిత్రి మహా పతివ్రత. ముందుగానే ఈ సంగతిని పసిగట్టింది. పతిభిక్ష పెట్టమని యముణ్ణి వెంటాడింది "ఏ మాత్రం ప్రయోజనం లేదు. తిరిగి వెళ్ళిపో!" అంటున్నాడు యముడు. కానీ సావిత్రి పట్టు వదలడంలేదు.

రాళ్ళు రప్పలు ముండ్ల పొదలతో నిండిన అడవిదారి. కాలుదీసి కాలూనడానికి వీలులేదు. యముడేమో దర్జాగా దున్నపోతుమీద వెళ్లుతున్నాడు. సావిత్రి దేనినీ లెక్క చేయడంలేదు. అలాంటి దారి వెంబడే యముణ్ణి వెంటాడుతూ ఉంది. గుట్టల్ని, పుట్టల్ని-కొండల్ని కోనల్ని-దాటి పోతూనే ఉంది. యముడు వారిస్తూనే ఉన్నాడు. అయినా సావిత్రి వదలడంలేదు.

కట్టెలమ్మి పొట్టపోసుకునే మనిషి కోసం సాటి ఆడది పడుతున్న అవస్థను గమనించేసరికి కాంతమ్మ బుర్ర గిర్రున తిరుగుతూ ఉంది. కుదురుగా కూర్చొనలేకపోతూంది. క్షణక్షణానికి తన బ్రతుకు కొట్టవచ్చినట్లు కంటెదుట కనపడుతూ ఉంది.

"కోడి కూసే యాళకాడ లేస్తాడు. గుక్కెడు సద్దినీళ్ళు గొంతులో పోసుకుంటాడు. అడివి మీద పడతాడు. నద్దిసీలిగే మోపు తలకెత్తుకొంటాడు. పేటదాక నడుస్తాడు. అక్కడ దించమన్నచోట దించి-వద్దన్నచోట తలకెత్తి కన్నగసాట్లు పడితేగదా కడుపు

కంతతిండి!—కడపదాటకుండా చూసు కుంటా ఉండాదే! అంత మంచి మణి సికి అంత తిండి కూడపెట్టకుండా నేనేంవో ముక్కలదాక మెక్కి వచ్చే శానే పాపిష్టిదాన్ని!—నేనూ ఆడదే! తానూ ఆడదే! అయితే కూడ ఆ ఆడది మొగుడికోసం ఎన్నగసాట్లు పడతావుంది. నేనేంవో!"—ఎన్నడూ లేని విధంగా కాంతమ్మ మనస్సు కల వరపడింది.

చివాలున పైకి లేచింది కాంతమ్మ!

"అప్పుడే లేస్తావుండావెందుకే?- ఇంకనేగదా వుండేదంతా ఆట!— సావిత్రి అత్తమాంవలకు కండ్లు తెప్పించుకోవాల, పోగొట్టుకున్న రాజ్యాన్ని పొందల్ల! మొగుణ్ణి బతి కించుకోవాల!—ఇంకా యింతాటుంటే అప్పుడే లేసినావే! కూర్చో!"—సతీ సావిత్రి నాటకం తెలిసిన ఓ ఆవిడ సలహాయిచ్చింది.

అదేమీ కాంతమ్మ చెవికెక్కడం లేదు.

సంచివట్ట మడచి చంకలో పెట్టు కొనింది,

ఒక్క ఊపులో యిల్లు చేరింది.

కంటపడిన దృశ్యంతో కదిలీమెదల కుండా నిలబడిపోయింది.

గుడిసెలో గుంజకు ఆనుకున్నాడు అప్పన్న. అలసి సొలసిన ప్రాణం. ఆనుకున్నవాడు ఆనుకున్నట్లే నిద్రపో తున్నాడు. ఆతడిముందు మూకుట్లో సంకటి చల్లబడిపోయింది. చల్లబడిన సంకటిమీద ఈగలు ముసురుతున్నాయి.

ఎప్పుడో సందకాడ వెలిగించిన బుడ్డీ దీపం.కొండెక్కడానికి సిద్ధంగా ఉంది.

అప్పన్న కుక్క-

మూకుడు ముందర ముందరి కాళ్లు బారసాచి పడుకునివుంది.

సూటిగా అతని మొగంలోనికి చూస్తూ వొగిలిస్తూ ఉంది.

ఆ వొగిలింపులో తపన ఉంది.

ఆ చూపుల్లో ఆశ ఉంది.

ఎగిరెగిరి పడుతున్న ఎండిన డొక్కల్లో ఆకలి గూడుకట్టుకొనిఉంది. యజమాని తింటే తనకంత వేస్తాడని ఎదురు చూస్తూ ఉంది.

అది దాని నమ్మకం!

అప్పన్న తినలేదు! అదీ తినలేదు!!

అలికిడైతే ఎగిరిపడి మొరిగే కుక్క!

కాసంత కవళం కంటపడితే ఎగ రేసుకపోయే కుక్క!!

యజమాని తినలేదన్న తపనలో మునిగి ఉంది.

విశ్వాసంలో ఏకాగ్రత!

మూకుట్లో వేసిన సంకటిని తినడా నికి కూడ ఓపిక లేక అలానే గుంజకు చేరగిలబడి నిద్రపోతున్న భర్తను చూసింది కాంతమ్మ.

ఆమె గుండె బాధగా మూలిగింది!

యజమాని తినలేదని తానూ తిన కుండా తపిస్తూ ఎదురు చూస్తున్న కుక్కను చూసింది.

ఆమె కళ్ళల్లో పలపల నీళ్లు రాలాయి!

✻



ఆర్కెస్ట్రా రిహార్సల్ :

ఇది ఇటలీ చిత్రం. ఫెడిరికొ ఫెలినీ ఈ చిత్రానికి దర్శకుడు-

ప్రతి దేశంలోనూ రాజకీయ, సామా జిక అసమానతలు, సమన్వయం లేక పోడాన్ని సాహిత్య పరంగా ఎంతో చెప్పారు-చదివాము. కానీ సినిమాల్లో ఆ విషయాన్ని సింబాలిక్‌గా చెబుతూ నిర్మిం చిన చిత్రాలు బహు కొద్ది ..

ఐతే ఈ చిత్రం యావత్తూ ఓ పెద్ద "సింబల్" అనవచ్చు. అనార్కి జాన్ని, అపసవ్యమైన జీవిత విధా నంలోని ఖంగాళీ అవకతవకలని పైకి చెబుతున్న రంగుల సంకేతమే ఈ సినిమా.

రకరకాల మనస్తత్వాలతో, వివిధ భావాలతో అవస్థపడుతున్న కొందరు వాయిద్య కళాకారుల సమ్మేళనం అది- వారి "రిహార్సిల్" ఓ పురాతనమైన చర్చిలో ఏర్పాటయింది. ప్రతి వ్యవ స్థకీ, ప్రతి దేశానికీ అది సంకేతం. అసమానంగానూ, అసంగతంగానూ, విచక్షణ తెలీకుండా, సమన్వయం

జనవరిలో, ఢిల్లీలో జరిగిన అంత ర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రద ర్శించబడ్డ చిత్రాల మీద మరికొన్ని సంక్షిప్త సమీక్షలను మా పాఠకుల సౌకర్యార్థం యిక్కడ ప్రచురిస్తు న్నాము. -ఎడిటర్



చలనచిత్రోత్సవ న్యాయ నిర్ణేతల సంఘం అధ్యక్షుడు శ్రీ జి. చుక్రాయ్

లేకుండా శృతిమించిన వాయిద్యాలూ, మనుషులూ.... అలా రూపొందించే సంగీత ఫలితం ఏమిటి — అర్థం గాని గొడవ — అనార్కిజమూ. అందుకే సంగీతాన్ని సమకూర్చే నాయకుడు "కండక్టర్" శాయశక్తులా అవస్థపడుతుంటాడు. అక్కడికి అతను వీళ్ళనుద్దేశించి చెప్పాడు-తన చేతులు కదులుతుంటేనే సంగీతం రాగయుక్తంగా ఓ క్రమంలో నిర్వహించబడుతుందనీ, సంగీతం లయ బద్ధంగా వినవాలంటే వివిధ వాయిద్య కళాకారులు తనకు సాయపడుతూ, తనకు 'ఇన్‌స్పిరేషన్' యివ్వాలనీ, ఆ ఇన్‌స్పిరేషన్ తనకు ఉత్సాహాన్నీ, శక్తినీ యిచ్చి మరింత చక్కగా సంగీతం సమకూర్చగలుగుతుందనీ చెప్పాడు-అంటే పాలించబడే వారికీ, పాలించే ప్రభుత్వానికీ, మనిషి అంతరంగానికీ, బాహ్య జీవనానికీ సమన్వయం కుదరాలనే సారాంశాన్ని చెప్పాడు.

కానీ పెడచెవిన పెట్టిన వాయిద్య కళాకారులు గంగ వెర్రులెత్తారు—ఎవరి ధ్వని వారిది. కండక్టర్ విసిగి వెళ్ళిపోయాడు-

ఈ లోగా బయట కొన్ని "విచ్ఛిన్నకర శక్తులు" ఓ పెద్ద ఇనుప గుండు, గొలుసు ఆకారంతో పాత చర్చి గోడలను పగుల గొడుతుంటాయి. దానితో హడలిపోయిన రిహార్సిల్ బృందం తమ కండక్టర్‌ను అనుసరించ నిర్ణయిస్తారు....

అదే రిహార్సిల్లో పూర్వం కండక్టర్‌గా వుండి, ప్రస్తుతం ఓపిక లేని వాడవడం చేత కళాకారులందరికీ రాగం, స్వరాల స్థాయీ క్రమం రాసి కాయితాలు ఏర్పాటు చేస్తుండే ఓ ముసలి మనిషి అక్కడే వుంటాడు. అతను ఈ విపరీత పరిస్థితి గమనిస్తూనే వుంటాడు - కండక్టరు ఇతని దగ్గర కొచ్చి తమకో దారి చూపమని అడుగుతాడు—అతను కొవ్వొత్తి వెలిగించి ఆ కాంతిలో అజ్ఞానపు చీకటిని దాటించి వీళ్ళని స్టేజికీ, సంగీతానికీ చేరుస్తాడు .... దీనితో సినిమా ముగుస్తుంది.

అసలు ఈ చిత్రం పేరే సంకేతం..మనం, మన జీవన విధానం, రాజకీయం, అంతా నియమం లేని రిహార్సిల్....



ఉమన్ ఎట్ వార్:

ఇది ఎఫ్. జి. ఆర్. సినిమా. అల్ఫ్ బ్రస్టెల్లిన్, బెర్న్‌హార్డ్ సిన్‌కెల్ ఈ చిత్రానికి దర్శకులు.

రెండవ ప్రపంచ యుద్ధకాలం అది-ఓ జర్మన్ బ్యాంక్ మేనేజర్ ప్రాగ్ సిటీలో స్థిర పడతాడు. అతనికి ముగ్గురు ఆడ పిల్లలు. ముగ్గురూ మూడు రకాల మనస్తత్వాలు గల వారు. పది సంవత్సరాల కాలంలో ప్రాగ్ సిటీ వాళ్ళకో జీవితానుభవాన్ని చూపింది. సామాన్య జీవితంలో యుద్ధ వాతావరణం ఎంత విపరీతానికి దారి తీస్తుందో చూపిందీ చిత్రం.

ముగ్గురు అక్కా చెల్లెళ్ళలో మొదటి ఆమె తప్పని సరై, తన కిష్టం లేని పెళ్ళి చేసుకోవలసి వస్తుంది. తన అక్క భర్తతో తన ప్రేమ విఫలమైనందుకు 'నన్'గా కాన్వెంట్‌లో చేరవలసి వస్తుంది రెండవ ఆమెకు. మూడో ఆమె ఒక చెకొస్లొవేకియన్ కమ్యూనిస్టుతో జీవితం గడపబోతుంది-కానీ తను జర్మన్ స్త్రీ కావడంతో అతని రాజకీయ విప్లవ జీవితానికి అడ్డు వస్తుంది. బ్యాంక్ మేనేజర్ అటు తన విధికీ, బ్యాంకు తన



చలనచిత్రోత్సవం డైరెక్టర్ శ్రీ రైనా

మీద వుంచిన నమ్మకానికి మధ్య యిరకాటంలో పడ్డాడు.

చివరికి జీవితాలు నాశనం కాగా వొట్టి చేతులతో జర్మనీ చేరుకున్నారు.

యుద్ధ రంగంలో ఓ సైనికుడి మరణం క్షణాల్లో, ఒకే ఒక్క సారిగా జరుగుతుంది-ఓ బులెట్ దెబ్బతోనో, గుర్రం మీంచి పడిపోవటంతోనో అతని జీవితం అంతం అవుతుంది... కానీ యుద్ధ రంగంలో నిలిచి యుద్ధం చెయ్యకపోయినా, ఆడది అనుక్షణం చావుని అంచలంచలుగా భరిస్తూ బతుకు ఈడ్చుకు రావటం మరో యుద్ధం-అదే ఈ చిత్ర ముఖ్యాంశం!

లాస్ట్ సప్పర్:

ఈ సినిమా క్యూబా దేశానికి చెందింది. థామస్ జి. ఆలియా ఈ చిత్ర దర్శకుడు.

మానవతా విలువలని చర్చించే ప్రతి మనిషికీ, ప్రతి దేశానికీ సంబంధించినదే ఈ చిత్రసారాంశం.

క్యూబాలో పారిశ్రామిక విప్లవపు రోజులు అవి. చెరకు పంట, పరిశ్రమల ఆధిపత్యాన్ని పెంచుకోడం కోసం పారిశ్రామిక వేత్తలు బానిసలను లొంగదీసుకునే రోజులు-వాళ్ళ చిత్రమైన విధానాలూ....



'లాస్ట్ సప్పర్' (క్యూబా) చిత్రంలో ఒక దృశ్యం

ప్రతిచోటా బానిసలు తిరగబడు తున్నారు-వాళ్ళని అణచివేయడానికి రకరకాలుగా నీచ బలప్రయోగాలు జరుగుతున్నాయి-ఆ స్థితిలో ఓ పారిశ్రామిక వేత్త అవలంబించిన విధానం వేరు... తిరగబడే బానిసలమీద దౌర్జన్యం ఉపయోగించలేదతను.

ఐతే ఆ బానిసలలో వున్న బలహీనత అతనికి తెలుసు. అందుకే మత గ్రంథాన్ని పుచ్చుకుని మతం పేరిట, దేవుడి పేరిట బోధలు మొదలెట్టాడు. తన అవసరానికి పనికొచ్చే మతపరమైన కథలు చెప్పాడు వారికి.

ఆ విధంగా బానిసలలోని అమాయకత్వాన్నీ, బలహీనతనీ మతం పేరిట ఎక్స్‌ప్లాయిట్ చేశాడు.

అవతలివాడి బలహీనతల్ని ఇవతలివాడుపయోగించుకునే విధాన్ని అమోఘంగా చెప్పాడీ సినిమాలో దర్శకుడు

చిత్రం ఏమంటే, మత సారాంశంవినికూడా ప్రస్తుత జీవిత సత్యాన్ని శ్రామికులు మర్చిపోలేదు. అందుకే చివరికి, తిరుగుబాటుచేసి వాళ్ళే నెగ్గటంతో కథ ముగుస్తుంది.



డెత్ ఆఫ్ ఎ బ్యూరోక్రాట్ :

క్యూబా చిత్రం యిది. థామస్. ఆర్. ఆలే ఈ చిత్రానికి దర్శకుడు.

నిజానికి ఈ సినిమాలోని కథ కాకపోయినా, సారాంశం, సన్నివేశాలూ చాలా దేశాల్లో, (ముఖ్యంగా మన దేశంలో) నిత్యం ఎదురయ్యేవే!

క్యూబాలో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తాడు - అతని "వర్క్ కార్డ్"ని (అతని వృత్తి, వివరాలూ వుండే ఓ కార్డు) అతనితోబాటు సమాధి చేస్తారు. మరణించిన ఆ కార్మికుడి భార్యకి రావలసిన పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ, ప్రొసీజర్ల చుట్టూ, సెక్షన్‌ల చుట్టూ నిర్విరామంగా తిరుగుతూనే వుంటాడు కార్మికుడి బంధువు. కార్డులేనిదే పెన్షన్ సంగతి తేలదు గనక, అతను శవాన్ని బయటకు తీయించే నిమిత్తం



హెల్త్ డిపార్ట్‌మెంట్ చుట్టూ, పోలీస్ పర్మిషన్ల కోసం తిరగడం అవుతుంది. అతనికి సమాధానం చిక్కదు.

అతను ఆఖరికి విసుగెత్తి రహస్యంగా శవాన్ని బయటకు తీయించి కార్డు తీసే సమయానికి కొన్ని విపరీత పరిస్థితులు ఎదురవుతాయి - దాంతో అతను శవంతోసహా పారిపోవడం, అనక పూడ్చి వెయ్యడానికి తిరిగి వెడితే అక్కడ పరిస్థితులు అనుకూలించవు. ఇంటికి తెచ్చిన మృతదేహాన్ని స్మశానానికి తీసుకువస్తే మూడు రోజుల క్రితమే ఆ పేరు గల మనిషిని సమాధి చేశారు గనుక స్మశాన అధికారి అంగీకరించడు. శవాన్ని సమాధి చెయ్యడానికి పర్మిషన్ అవసరమయిన కారణంగా మళ్ళీ ఆఫీసుల చుట్టూ, ప్రొసీజర్ల చుట్టూ తిరిగి, అలిసిపోతాడు. అన్నీ సాధించి ఆ పర్మిషన్‌తో శవాన్ని సమాధి చెయ్యడానికి వస్తే మళ్ళీ స్మశానం తాలూకు అధికారి తన బ్యూరోక్రసీతో అతనికి అడ్డు పడతాడు దాంతో అతను పట్టరాని కోపంతో బ్యూరోక్రాట్‌ని కొడతాడు. ఏక్సిడెంటల్‌గా బ్యూరోక్రాట్ మరణిస్తాడు.

కార్మికుడి సమాధి పక్కనే బ్యూరోక్రాట్ సమాధి వెలియడంతో ఈ సినిమా ముగుస్తుంది.

ఈ చిత్రంలో విశేషం-సోషలిస్ట్ దేశం నిర్మించిన, ఆత్మ విమర్శ కథాంశం గల చిత్రం యిది.

బీయింగ్ దేర్

ఇది యు.ఎస్.ఎ. చిత్రం. హాల్ ఆష్బి ఈ చిత్రానికి దర్శకుడు.

మర్రిచెట్టులా అన్నివైపులా పెరిగి వూడల్లా పాతుకుపోయిన రాజకీయం మీద చిన్న ప్రహసనం ఈ చిత్రం. వెర్రితలలు వేసి విపరీతంగా పెరిగిన అమెరికా అభివృద్ధి ఏ అంశంలో వ్యంగ్యంగా కనిపిస్తుందో, ఆ అంశం మీద నిర్మించిన సున్నితమైన హాస్య చిత్రం ఇది....

అమిత సాధారణమైన విషయాన్ని కూడా అత్యంత విచిత్రంగా తీసుకునే సంఘం హాస్యాస్పదమైనదే!

విపరీతమైన విజ్ఞానంతో ఉన్నత స్థాయికి చేరుకునేవారు కొందరు, అమాయకత్వంతో, అజ్ఞానంతో అదే ఉన్నతస్థాయికి ఎదిగిపోయేవారు మరి కొందరు!

సరిగ్గా ఆ రెండోదే అయింది "ఛాన్స్"కి కూడా! ఛాన్స్ కేవలం ఓ తోటమాలి-అతని జీవితం చెట్లూ, చేమలూ, పువ్వులూ, కాయలూ.... అంతే కాకుండా టి. వీ. కూడా. తన యజమాని ఏం చెబితే అదే చేస్తాడు మరో ప్రశ్నకి తావు లేకుండా. ఎక్కడ పుట్టాడో, ఎవరు తన తల్లిదండ్రులో, ఏది తన వూరో, ఇవేమీ తెలియకుండానే చిన్నతనం నుంచీ యజమాని దగ్గరే పెరిగాడు. యజమాని ఛాన్స్‌ని బయట ప్రపంచంలోనికి వెళ్ళనివ్వక



'బీయింగ్ దేర్'....

లేకుండా సమస్త సౌకర్యాలూ ఇంటిలోనే జరిగిపోయేలా ఏర్పాటు చేశాడు. ఆవిధంగా తన యజమానిదగ్గర చెట్లతో బాటు తనూ పెరిగాడు.

యజమాని మరణించడంతో అతను వంటరి వాడై వీధిన పడ్డాడు-ఎక్కడికి వెళ్ళాలో తేలిక, ఏమి చేస్తున్నాడో తెలీక, బయట ప్రపంచం తాలూకు వింతలూ, విడ్డూరాల గందరగోళంలో పడ్డాడు-

రోడ్డు మీద వెళ్ళే వారి ఆకలి తీరుస్తామని చెప్పే అమ్మకం దారులని ఆకలితో చేరాడు-

"బ్లూ ఫిలిమ్ కావాలా, పుస్తకాలు కావాలా, టేప్‌లు కావాలా"-అని వాళ్ళడుగుతారు-అమాయకంగా రొట్టె కావాలని అడుగుతాడు ఛాన్స్-అతని అమాయకత్వానికి పరాకాష్ట అది.

ఈ గందరగోళంలో అదృష్టవశాత్తు ఈవ్ రాండ్ అనే ఆవిడ అందమైన కారు ఢీ కొంది ఛాన్స్‌ని. ఈవ్‌రాండ్ అమెరికాలో వెలిగిపోతున్న రాజకీయ నాయకుడి భార్య. ఆ నాయకుడి పేరు రోనాల్డ్ - ఓ మల్టీ నేషనల్ కంపెనీకి ప్రెసిడెంట్, అమెరికా సెనెట్ మెంబర్ అతను-అప్పటి అమెరికా అధ్యక్షుడికి అత్యంత స్నేహితుడు.

ఈవ్‌రాండ్ ఛాన్స్‌ని తన భవనానికి తెచ్చి అతను వాళ్ళ ఉండేలా దాకా సాయపడింది. ఐతే అక్కడున్న నాయకుడి వెంట వుండే డాక్టరు ఛాన్స్‌గొప్ప చతురత భాష జరపగలడని గట్టిగా నమ్మాడు-ఛాన్స్ అమాయకపు మాటలా నమ్మకాన్ని బలపరిచాయి,రోనాల్డ్‌తో ఆసంగతే డాక్టర్ వివరించాడు.

కొద్ది కాలంలోనే ఛాన్స్ రోనాల్డుకు అత్యంత సన్నిహితుడవుతాడు.

రోనాల్డు అస్వస్థుడయ్యాడని తెలిసి పరామర్శించడానికి వచ్చాడు అమెరికా ప్రెసిడెంట్-ఆ ప్రెసిడెంట్‌కి ఛాన్స్‌ని పరిచయం చేశాడు. ఛాన్స్ ఆ సమయంలో ఛాన్స్ మాట్లాడిన మాటలు, అమెరికా రాజకీయ, ఆర్థిక అస్తవ్యస్తాలని సరిదిద్దేవిగా తోచాయి అధ్యక్షుడికి - ఇంతకీ ఛాన్స్ చెప్పినదేమిటి?!-రాజకీయ సంక్షోభ స్థితి నివారణకి ఉపాయాన్ని అడిగితే-తన సహజ ధోరణిలో "వేళ్ళు చెట్లకి చాలా ప్రధానమైనవి" అని చెప్పాడు ఛాన్స్. ప్రజలే ప్రభుత్వానికి ఆయువు పట్టు అన్నట్టుగా. మరి ఎంత కాలానికి ఈ స్థితి మెరుగుపడుతుందనే ప్రశ్నకి "ఋతువులు నాలుగు - వసంత కాలం, వర్షాకాలం, చలికాలం, ఎండాకాలం" అని అన్నాడు ఛాన్స్ - అంటే ఆయా స్థితులు ఆయా కాలాలలో ఓ క్రమంలో ఏర్పడతాయన్నట్టనిపించింది అధ్యక్షుడికి.

ఈవిధంగా అమెరికా అధ్యక్షుడే టి. వీ.లో ఛాన్స్‌ని ఓ గొప్ప మేధావిగా భావించి చెప్పాడు.

అనంత ప్రగతిలో విపరీతంగా ఎదిగిన విజ్ఞాన దశలో అతి సాధారణమైన ప్రధాన సూత్రాలని గుర్తించరెంతోమంది-అప్పుడు అమిత సహజమైన 'బేసిక్ ఫండమెంట్స్'ని చెప్పే వారే మహా మేధావులవుతారు-అంటే విపరీత ప్రగతి మళ్ళీ పూర్వ స్థితికి చేరుకుని తెలుసుకుంటోందని ఈ చిత్రం వివరిస్తుంది.

ఈ చిత్ర నిర్మాణం యావత్తు ఒక ఎత్తు-ఛాన్స్ పాత్రధారి 'పీటర్ సెల్లర్స్' అద్భుత నటన ఒక ఎత్తు.

బాలింత్ ఫాబియన్ మీట్స్ గాడ్

ఇది హంగరి చిత్రం - జోల్టన్ ఫాబ్రి ఈ చిత్రానికి దర్శకుడు.

మొదటి ప్రపంచ యుద్ధకాలం - బాలింత్ ఫాబియన్ ఆస్ట్రో హంగేరియన్ సైన్యంలో సైనికుడు. యుద్ధంలో ఒక ఇటాలియన్ సైనికుణ్ణి భయంకరంగా పొడిచి చంపాడు. ఆ దృశ్యం యావజ్జీవితం అతని కళ్ళముందు మెదులుతూనే వుంటుంది.

యుద్ధంనుంచి అతను తిరిగి రావటానికి పూర్వం అతని భార్యకి, ఆ ప్రాంతపు మతాధిపతితో సంబంధం వుండేది. ఆమె కొడుకు లిద్దరూ ఆ 'కేథలిక్ ప్రీస్ట్'ని హత్య చేస్తారు. దాంతో ఆవిడ నానాటికీ దిగులుపడి కృంగిపోతుంటుంది. యుద్ధం నుంచి

(సవరణ : విషయసూచికలో ముఖ చిత్రం పేర్లు పొరపాటుగా ప్రింటుజరిగినది. ముఖచిత్రం : శ్రీదేవి, చివరి అట్టమీద : స్వప్నగా గమనించగలరు. -సం.)

తిరిగి వచ్చిన ఫాబియన్‌కి ఆమె పరిస్థితి అర్థంకాక కొడుకులని అడుగుతాడు. వాళ్ళేమీ చెప్పరు.

ఫాబియన్ భార్య దిగులుతోనే మరణిస్తుంది. అంత్యక్రియలు జరిపిన తరువాత ఒక హోటల్‌మనిషి ప్రీస్ట్‌కీ, ఫాబియన్ భార్యకీ గల సంబంధాన్ని ఫాబియన్ చెవిన వేస్తాడు. దానితో కలత చెందిన ఫాబియన్ ఎంత ప్రయత్నించినా నిజానిజాలు బయట పడవు. కాగా ఆ హోటల్ మనిషి హత్య కాబడతాడు.

దీనికి ముందు ఫాబియన్ ఆప్రాంతపు రాజాధికారి బేరన్ వద్ద కోచ్‌మాన్ (గుర్రబ్బండి తోలే మనిషి)గా చేరతాడు. యుద్ధం ముగిశాక విప్లవకారుల నుంచి బేరన్‌నీ అతని కుటుంబాన్నీ కాపాడతాడు. ఆ కల్లోలంలో యథార్థ ప్రజల స్థితి తెలుసుకొని, తన ఉద్యోగాన్ని వదులుకొని ప్రజల పక్షాన చేరతాడు.

శీతాకాలం ముసురు కొచ్చింది. కట్టెల కోసం గొడ్డలిని వెదికాడు-అది వెదికి తీసి, తుప్పు పోగొట్టడం కోసం తోమి కడిగాడు-తుప్పు రంగుతో బాటు రక్తపు రంగు కనిపించింది ఫాబియన్‌కి-ప్రీస్ట్‌ని తన కొడుకులే చంపారన్నది తెలుసుకుంటాడు - తన భార్య మరణించడం, మఠాధిపతి హత్య, హోటల్‌కీపర్ హత్య, యుద్ధ దృశ్యం, తన విప్లవ దశ, అన్నీ అతనికి చిత్రంగా గోచరిస్తాయి-కలత చెందిన ఫాబియన్‌కి అన్నీ ప్రశ్నలే... తనకి సమాధానం దొరకగపోగా, భగవంతుడినే ఎదిర్చి పోరాడాలనీ, కలుసుకోవాలనీ నిర్ణయించుకున్నాడు.

అందుకే క్రిస్మస్ రోజు చర్చి గంటకి అమర్చిన తాడుకి ఉరిపోసుకున్నాడు-

ప్రకృతి మార్పులతో బాటు కథా గమనాన్ని తీర్చిన తీరు అద్భుతం ఈ చిత్రంలో.... చిత్రీకరణలో ఈ చిత్రం పై స్థాయిని చేరుకుందనవచ్చు. ఏ రుతువులో ఆయా స్థితి గతులని చూపడంలో ఛాయా గ్రాహకుడి కృషి అమోఘం:-జార్జి ఇల్స్ కెమెరా పనితనంలో చలి కాలానికి తగ్గట్టు, తక్కువ కాంతిలో, మంచుతెర కమ్మినట్టుగానూ, ఎండాకాలంచూపేటప్పుడు ప్రతిదృశ్యం కాంతివంతంగానూ, కనిపించేలా ప్రతిభ చూపించాడు.

దర్శకుడు శీతాకాలం చూపేటప్పుడే, ఆ ప్రాంతం నుంచీ పక్షులు వలసపోవటం, ఫాబియన్ కొడుకులు గ్రామం విడిచి పట్టణానికి వెళ్ళడంలాంటి దృశ్యాలు చూపాడు - ఎండా కాలాన్ని సూచించేటప్పుడు ఫాబియన్ ప్రజల పక్షం చేరడం, విప్లవ ఘడియలూ, మానసిక ఘర్షణల వంటివి చూపాడు.

ప్రకృతినీ, కథనీ, పాత్రలనీ కలిపి ప్రకృతి పరంగా చూపటం చిత్ర విశేషం.

—పి. రామకృష్ణ
('జ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-500 020



JYOTI APRIL'81 Rs.3-50 Regd.no: M8669-H/S73
Raghava